అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 10-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 161 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50

పార్లమెంటులో 'మీ వాణి' వినిపిస్తా : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : పార్లమెంటులో మీ గొంతుకగా నిలుస్తానని, మీ భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలను లేవనెత్తుతానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆదివారం నీట్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. మెడికల్ ప్రవేశ పరీక్ష 'నీట్' వివాదంపై ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న మోడీపై విరుచుకుపడ్డారు. నీట్ పరీక్షల్లో 'అక్రమాల'తో 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు సర్వనాశనమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

" ప్రధాని మోడీ ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు. నీట్ పరీక్షలో అక్రమాలు 24 లక్షల మంది విద్యార్థులను మరియు వారి కుటుంబాలను నాశనం చేశాయి " అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించారని, చాలా మంది విద్యార్థులకు సాంకేతికంగా సాధ్యంకాని మార్కులు వచ్చాయని అన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం పేపర్ లీక్ కాలేదని చెప్తోందని అన్నారు. విద్యా మాఫియా, ప్రభుత్వ యంత్రాంగంతో కుమ్మక్కై చేస్తున్న పేపర్ లీక్ పరిశ్రమను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పటిష్టమైన ప్రణాళికను రూపొందించిందని అన్నారు. చట్టం రూపొందించడం ద్వారా విద్యార్థులకు పేపర్ లీక్‌ల నుంచి విముక్తి కల్పిస్తామని తమ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చామని గుర్తు చేశారు.

వ్యాపారవేత్త కిడ్నాప్ కలకలం

- లావాదేవీల విషయంలో గొడవ
- నిందితుల అరెస్టు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన నార్సింగి ఏసీపీ రమణగౌడ్



నవతెలంగాణ-గండిపేట్

రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యాపారవేత్త కిడ్నాప్ కలకలం సృష్టించింది. లావాదేవీల విషయంలో గొడవలు కావడంతో ఇద్దరు వ్యక్తులు వ్యాపారవేత్త శిశువర్ధన్‌రెడ్డిని కిడ్నాప్ చేశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో.. వెంటనే స్పందించిన పోలీసులు బాధితుడిని హైదరాబాద్ నుంచి కర్నూలుకు తరలిస్తుండగా సినీఫక్కీలో కిడ్నాపర్స్ వాహనాన్ని చేధించి పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆదివారం మీడియాకు వివరించారు. శిశువర్ధన్‌రెడ్డి కర్నూల్ నుంచి వచ్చి గండిపేట మండలం హైదర్షాకోట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటూ ఇక్కడే వ్యాపారం చేస్తున్నారు. ఆర్థికంగా ఎదిగేందుకు ఇతరుల దగ్గర డబ్బులు తీసుకున్నాడు. నిందితులు క్రాంతికుమార్, కె.సందీప్.. లావాదేవీలపై శిశువర్ధన్‌రెడ్డితో చర్చించారు. వారు తిరిగి డబ్బులు చెల్లించాలని అడగడంతో శిశువర్ధన్‌రెడ్డి అప్పుడు.. ఇప్పుడు.. అంటూ దాటవేశాడు. దాంతో నిందితులు శిశువర్ధన్‌రెడ్డిని కిడ్నాప్ చేసి కర్నూల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బాధితుడి కుటుంబ సభ్యులు 100 కు ఫిర్యాదు చేశారు. నార్సింగి సీఐ హరికిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శిశువర్ధన్‌రెడ్డిని ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా కర్నూలు తరలించడంతో మహబూబ్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సినీఫక్కీలో నిందితులను పట్టుకుని, బాధితుడిని కాపాడారు. అయితే శిశువర్ధన్‌రెడ్డిపై నిందితులు దాడి చేసినట్టు కారులోని రక్తం మరకల ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. డబ్బులు వసూలు చేసేందుకే కిడ్నాప్ చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమావేశంలో సీఐ హరికిషన్‌రెడ్డి, ఎస్ఐ సతీష్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-బోథ్

అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పూల్‌సింగ్ నాయక్ తండాలో ఆదివారం జరిగింది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాథోడ్ సుభాష్(45) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో గతేడాది పత్తి సాగు చేశాడు. అతివృష్టి, అనావృష్టితో పంట దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక కలత చెంది, ఆదివారం తన ఇంటి సమీపంలో పురుగులమందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. అతనికి బ్యాంకులో రూ.1.5లక్షలు, ప్రయివేటుగా రూ.1.5లక్షలు మొత్తం రూ.3లక్షలు అప్పు ఉన్నట్టు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.

వ్యవసాయ నేలల ఆరోగ్యం ఆందోళనకరం

- వర్షాభావ పరిస్థితులే పంటల ఉత్పత్తిని దెబ్బతీస్తున్నాయి
- వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ నిర్మాణం జరగాలి
- అరిబండి ఆరవ స్మారకోపన్యాసంలో నార్మ్ డైరెక్టర్ శ్రీనివాసరావు
- వ్యవసాయ ప్రణాళిక తరహాలో నీటి ప్రణాళిక ఉండాలి : రాజిరెడ్డి
- అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలి: టి సాగర్

తాగేనీరు, ఆహారభద్రత, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వాతావరణ మార్పులు సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని జాతీయ వ్యవసాయ పరిశోధనల యాజమాన్య అకాడమీ(నార్మ్) డైరెక్టర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం వ్యక్తం చేశారు. వ్యవసాయ నేలల ఆరోగ్యం దెబ్బతింటున్నదని తెలిపారు. తద్వారా త్రాగే నీరు, ఆహారభద్రత, ఆరోగ్యంపై ప్రభావం పడుతున్నదని చెప్పారు. వర్షాభావ పరిస్థితులు పంటల ఉత్పత్తి కూడా ఒడిదుకులను ఎదుర్కొంటున్నదన్నారు. వాతావరణ మార్పులను తట్టుకునే విధంగా వ్యవసాయ నిర్మాణాన్ని చేపట్టాల్సిన అవసరముందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వాటర్ టెక్నాలజీ సెంటర్‌లో అరిబండి ఫౌండేషన్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయ నిర్మాణం' అనే అంశంపై శ్రీనివాసరావు అరిబండి ఆరవ స్మారకోపన్యాసం చేశారు.


ఈ కార్యక్రమానికి తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులు సుస్థిర వ్యవసాయానికి పెద్ద సవాల్‌గా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులు, వరదలు పంటలను దెబ్బతీస్తున్నాయన్నారు. నీరు, ఇందనం,ఆహారం జీవ వైవిధ్యం తగ్గిపోతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో వాతావరణ మార్పుల రిస్క్ పెరుగుతున్నదని హెచ్చరించారు. ఈ మార్పులను ఎదుర్కొగల వ్యవసాయానికి మద్దతు పెరగాల్సిన అవసరముందన్నారు. వాతావరణ మార్పులకు కారణమైన హరిత వాయువుల ఉద్గారాలను తగ్గించాలన్నారు. ఆకలి, పేదరిక సమస్యలను పరిష్కరించేందుకు జీవ వైవిధ్యాన్ని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. లేకపోతే ఆర్థిక మాంద్యం, ఆహార భద్రత, పోషకాహార లోపాలు, యుద్ధాలు తలెత్తుతాయని చెప్పారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు పంటలు, పశువులు, అడవులు, మత్స్య సంపద, పౌల్ట్రీ ఇలా రకరాల సమగ్ర వ్యవసాయ విధానం అమల్లోకి రావాలన్నారు. సాంకేతికతో వాతావరణంలో మార్పులు తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పంటల బీమా పథకం, మార్కెటింగ్ రక్షణ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.

రైతులు అవసరానికి మించి యూరియా, డీఏపీ ఉపయోగించడం సరైందికాదన్నారు. మొక్కలకు ఎంత అవసరమో అంతే తీసుకుంటాయి తప్ప ఎక్కువగా తీసుకోవని గుర్తించాలన్నారు. పంట పొలాల్లో వ్యర్థ అవశేషాలను కాల్చివేయడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతున్నదని తెలిపారు. ఇలా చేయడం ద్వారా నేల చనిపోయినట్టేనని ప్రముఖ వ్యవసాయ నిపుణులు స్వామినాథన్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. చెరువులో చేరిన మట్టిని పంట పొలాల్లో పోయడం ద్వారా ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయం ఒక్కరూగా చేయలేరనీ, సంఘటితంగా చేయాల్సి ఉంటుందని గుర్తు చేశారు. రాజస్థాన్‌లో నీటి కరువు ఉన్నప్పటికీ రైతుల ఆత్మహత్యలు ఉండవన్నారు. ఎక్కువగా పశుసంపదపై ఆధారపడి జీవిస్తారని తెలిపారు. వ్యవసాయంపై పిల్లల్లో ఆసక్తి కల్పించాల్సి బాధ్యత తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ విస్తరణ మాజీ డైరెక్టర్ డి.రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ ప్రణాళిక తరహాలో నీటి ప్రణాళిక కూడా రూపొందించాలని సూచించారు. వరి, పత్తిని 90 శాతానికి విస్తరించి, ప్రమాదకర జోన్‌లో ఉన్నామని చెప్పారు. పత్తిలో సోయా, కంది వంటి అంతర పంటల సాగు చేసి రైతులు రిస్క్ తగ్గించుకోవాలని తెలిపారు. ఈసారి 4.7లక్షల ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. పరిశోధనలు, సాంకేతిక విశ్వవిద్యాలయాలకు పరిమితం కాకుండా పొలాల్లోకి తీసుకెళ్లాలన్నారు. వరి సాగు ఎంత అవసరమో అంతే సాగుచేయాలన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం అన్ని ప్రాంతాల్లో చేయకుండా ఉద్దేశపూర్వకంగా వ్యవసాయ ప్రాంతాల్లో చేయాలని సూచించారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ సన్న రకానికే కాకుండా కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు ఏడు పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంటల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఇస్తామన్న రైతు భరోసా ఇవ్వాలన్నారు. పంటల బీమాలోని లోపాలను సవరించి, ఆ బీమాప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. రైతు బీమా వయస్సును 70 ఏండ్లకు పెంచాలని కోరారు. పోడు వ్యవసాయానికి హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా విజయ డైరీ రైతులు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాలరైతులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. డాక్టర్ కె కిరణ్‌బాబు డిజిటల్ వ్యవసాయ ప్రాధాన్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, జంగారెడ్డి మాట్లాడారు. సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అతిథులను వేదిక పైకి ఆహ్వానించారు. అరిబండి ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ మనోహర్, కోశాధికారి డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ లావణ్య, ఐఏఎస్ అధికారి వేణుప్రసాద్, పివి అమరనాథ్ ప్రసాద్, డాక్టర్ ఏ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రజల్లో రాజకీయ చర్చలు శుభపరిణామం


ఎస్వీకే వెబినార్‌లో ప్రొఫెసర్ హరగోపాల్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సాధారణ ప్రజల్లో రాజకీయ చర్చలు జరగడం శుభపరిణామం అని పౌరహక్కుల సంఘం నాయకులు ప్రొఫెసర్ జీ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్చలు సమాజ పరిణామక్రమాన్ని నిర్దేశిస్తాయనీ, ప్రతిపక్షాలు తప్పనిసరిగా వారితో కలిసి నడవాల్సిన పరిస్థితుల్ని కల్పిస్తాయన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) అధ్వర్యంలో ఆదివారం 'పౌరహక్కులు-ప్రతిపక్షాల కర్తవ్యం' అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. సామాజిక సంబంధాల్లో సమానత్వం, ధరల పెరుగుదల సహా ఆర్థిక నమూనాలోని అంశాలపై సమగ్ర అవగాహన ఉండాలని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్నారనీ, ఇది పాశ్చాత్య రాజ్యాంగమని సావర్కర్ హయాం నుంచీ బీజేపీ నేతలు నమ్ముతున్నారని వివరించారు. రాజ్యాంగాన్ని మారిస్తే అసమానతలు పెరిగి, సమానత్వ భావన కోల్పోతామనే భావన ప్రస్తుత ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజల్లో వెల్లడి అయ్యిందన్నారు. ఈ ప్రభావం ప్రాంతీయ అస్థిత్వాలపైనా పడిందనీ, భవిష్యత్‌లో బీజేపీ ఆర్థిక అభివృద్ధి నమూనా ఇలాగే కొనసాగితే, ప్రతిపక్షపార్టీలు పార్లమెంటులో అర్థవంతమైన చర్చను లేవనెత్తే అవకాశం ఉందని తెలిపారు. అసమానతలపై అసంతృప్తి పెరిగినందున, దాని అణచివేత కోసం 'ఉపా' చట్టం తెచ్చారని చెప్పారు. నెహ్రూ మోడల్‌ను కాంగ్రెస్ వదిలేసిందనీ, బీజేపీ నెహ్రూనే తోసేయడంతో ఆర్థిక నమూనాలు భిన్నంగా మారాయని విశ్లేషించారు. ఉత్పత్తి రంగంలో ఉన్న టాటా, బిర్లాలు దేశ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తమ పెట్టుబడుల్లో 40 శాతాన్ని విద్యారంగంపై పెట్టుబడి పెట్టారనీ, కానీ బీజేపీ విధానాలతో అదానీ, అంబానీలు ఒక్క వస్తువును కూడా ఉత్పత్తిచేయకుండా, సంపదను పోగేసుకుంటున్నారని అన్నారు. ప్రస్తుతం దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందనీ, అయితే పార్లమెంటులో పటిష్టమైన ప్రతిపక్షం ఇప్పుడు ఉన్నందున బీజేపీ ఏకపక్ష నిర్ణయాలు చెల్లవని చెప్పారు. కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో రాజ్యాంగ పరిరక్షణను అజెండాగా పెట్టుకోవడంతో, బీజేపీ కూడ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని చెప్పక తప్పలేదన్నారు. ప్రస్తుతం మీడియా కార్పొరేట్ చేతుల్లో ఉందనీ, ఫలితంగా పాలకవర్గాలు ఆ శక్తుల్ని కాదని నియో లిబరల్ మోడల్‌ను వదులుకొనే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు, నితీష్‌కుమార్‌ల భావజాలాలు భిన్నమైనవనీ, కాంగ్రెస్‌పార్టీతో చేరిన పలు పార్టీల్లోనూ భిన్న భావజాలాలు ఉన్నాయని వివరించారు. ప్రతిపక్షపార్టీలు అధికారపక్షాన్ని గాడిన పెట్టే ప్రయత్నం చేయాలన్నారు. అన్ని రాజకీయపార్టీలు సిద్ధాంత, విధానపరమైన అమలు సమస్యను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధికారంలో ఉండే పార్టీలకు ప్రజలే ప్రతిపక్షంగా ఉంటారంటూ, ఢిల్లీ రైతాంగ పోరాటం, ప్రజా ఉద్యమాల ప్రాధాన్యతను వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిపక్షాలపై బాధ్యత మరింత పెరిగిందనీ, పౌరసమాజం, ప్రజాసంఘాల మద్దతుతో ముందుకు నడిస్తే, అధికారపక్షం ఆచితూచి నిర్ణయాలు తీసుకుటుందని విశ్లేషించారు. ప్రస్తుత ఎన్నికల ఫలితాలతో ఫాసిజానికి తాత్కాలికంగా బ్రేక్ పడిందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ఓటమికి కూడా పెత్తందారీ పోకడలే కారణమనీ, మోడీ కూడా ప్రజల్ని కలవకుండా, దాదాపు అదే దారిలో నడిచినందువల్లే సీట్లు తగ్గాయని చెప్పారు. రాజ్యహింసను తగ్గించి, మానవీయ, సామాజిక దృక్పథంతో దేశ పురోగమనం ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ అధ్యక్షత వహించారు.

రాజస్థాన్‌లో అర్ధరాత్రి భూకంపం..



జైపూర్: రాజస్థాన్‌లో అర్ధరాత్రి భూమి కంపించింది. శనివారం అర్ధరాత్రి 11.47 గంటలకు సికార్, చురు, నాగౌర్ జిల్లాల్లో కొన్ని సెకన్లపాటు భూకంపం వచ్చింది. దీని తీవ్రత రిక్టర్‌స్కేలుపై 4.2గా నమోదయింది. సికార్ జిల్లాలోని హర్ష పర్వత వద్ద భూకంప కేంద్రం ఉన్నదని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. భూ అంతర్భాగంలో 5 కిలోమీటర్ల లోతులు కదలికలు సంభవించాయని వెల్లడించింది. అర్ధరాత్రి వేళ భూమి కంపించడంతో భయాందోళనలకు గురైన ప్రజలు ఇండ్ల నుంచి బయటకు పరుగుతు తీశారు. కాగా, భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదు.

తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్ పర్సన్‌గా


జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా ప్రదీప్ కుమార్ రెడ్డి పల్లె (అడ్వకేట్, జ్యుడీషియల్ మెంబర్), రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిత్రా రామచంద్రన్ (టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్ మెంబర్) కూడా ఆయనతో పాటు బాధ్యతలు చేపట్టారు. చైర్‌పర్సన్, సభ్యుల నియామకానికి ప్రభుత్వం ఈ నెల 7న వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బాధ్యతల స్వీకరణ సందర్భంగా రెరా అథారిటీ చైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, సభ్యులు కె.శ్రీనివాసరావు, జె.లక్ష్మినారాయణ చైర్మెన్, సభ్యులకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ట్రిబ్యూనల్ చైర్‌పర్సన్, సభ్యులతో పాటు రెరా అథారిటీ చైర్మెన్, సభ్యులు సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో రెరా అడ్జుడికేటింగ్ ఆఫీసర్ లతీఫ్ ఉర్ రెహమాన్, రెరా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పరిపాలనాధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్యకు టాప్ ర్యాంక్‌లు



నవ తెలంగాణ - హైదరాబాద్

ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో తమ విద్యార్థులకు ఆల్ ఇండియా స్థాయిలో అగ్ర ర్యాంక్‌లు దక్కాయని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో తమ విద్యార్థులు 10లోపు 5 ర్యాంకులు సాధించారన్నారు. ఒక్కటవ ర్యాంక్‌తో పాటు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 4,5,6,9,10,12,14 ర్యాంకులతో శ్రీచైతన్య ఆధిపత్యాన్ని కొనసాగించిందన్నారు. ఆలిండియా స్థాయిలో రాఘవ శర్మ 1వ ర్యాంక్, రిథమ్ కేడియా 4వ ర్యాంక్, పుట్టి కుశాల్ కుమార్ 5వ ర్యాంక్, రాజదీప్ మిశ్రా 6వ ర్యాంక్, ధ్రువిన్ హేమంత్ దోషి 9వ ర్యాంక్, సిద్విక్ సుహాస్ 10వ ర్యాంక్‌ల్లో నిలిచారని వెల్లడించారు. 100లోపు 30 ర్యాంక్‌లు, 1000 లోపు 202 ర్యాంక్‌లు, వివిధ కేటగిరీల్లో 100 లోఎపు ఏకంగా 146, 1000 లోపు 721 ర్యాంక్‌లు సాధించామన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 3,728 మంది శ్రీచైతన్య విదార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఈ దఫా ఐఐటీల్లో తొలి వరుసతో పాటు మొత్తం సీట్లలోనూ అత్యధిక శాతం శ్రీచైతన్యదేనని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి సుష్మ అభినందనలు తెలిపారు.

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు పదేండ్ల తర్వాత అధికారం ఇచ్చారని, ఆరు గ్యారంటీలపై ప్రజలు పెట్టుకున్న ఆశలు నెరవేర్చడమే తమ లక్ష్యమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి నియోజకవర్గంలో ప్రధానంగా విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడమే తన టార్గెట్ అని తెలిపారు. త్వరలోనే పార్లమెంటు పరిధిలో ఉన్న ప్రజలందరినీ కలుసుకుంటానని అన్నారు. పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన తర్వాత 'నవతెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను వివరించారు.

- పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తా
- ప్రభుత్వ స్కూళ్లకు పక్కాభవనాలు నిర్మిస్తా
- మండలానికో జూనియర్ కాలేజీ, నియోజకవర్గానికో డిగ్రీ కాలేజీ..
- భువనగిరిలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-ఆలేరు

భువనగిరి ఎంపీగా గెలిచినందుకు అభినందనలు. మీ విజయానికి దోహదం చేసిన ప్రధాన అంశాలేంటి..?

కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలైన ఆరు గ్యారంటీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే కొన్ని గ్యారంటీలను అమల్లోకి తీసుకొచ్చింది. వాటిని పూర్తిగా అమలు చేస్తామన్న నమ్మకం వల్లే భువనగిరి ఎంపీగా ఇక్కడి ప్రజలు నన్ను గెలిపించారు. నన్ను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు. నా విజయానికి కృషి చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటాను.

ఎంపీగా మీ లక్ష్యం ఏమిటి?

ఇక్కడి ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా లక్ష్యం. ప్రధానంగా మూడు పనులు చేయడమే నా టార్గెట్. నా నియోజకవర్గం హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నప్పటికీ.. ఇక్కడ మెజారిటీ ప్రజలు రైతులే. వాళ్ళను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 5 పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడమే నా తొలి లక్ష్యంగా పెట్టుకున్నాను. పదేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి పెట్టిన కేసీఆర్ సర్కారు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వదిలేసింది. మా నియోజకవర్గంలో గంధమల్ల రిజర్వాయర్‌ను, మూసీ నదిపై పెండింగ్‌లో ఉన్న బునాదిగానికాలువ, ఇతర ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు విస్తీర్ణాన్ని పెంచుతాను.

విద్యా రంగంపై మీ ప్రణాళిక ఏమిటి..?

నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ స్కూళ్ళ, కాలేజీ భవనాలన్నింటినీ పూర్తి చేస్తాను. ప్రతి మండలంలో ఒక జూనియర్ కాలేజీ, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఒక డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాను. చదువు కోసం హైదరాబాద్ వెళ్లేందుకు విద్యార్థులు పడుతున్న కష్టాలు తీరుస్తాను.

ఉపాధి అవకాశాలపై మీ ప్రణాళిక ఏమిటి..?

డిగ్రీ, ఇంజనీరింగ్ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఇక్కడి యువతకు వస్తున్న వేతనం.. వాళ్ల వసతి, భోజనానికి కూడా సరిపోవడం లేదు. ఇంట్లో వాళ్ళే నెలకు రూ.10 వేలు పంపించే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఉద్యోగం వదిలేసి ఇంటికి వచ్చేయాలని పిల్లలను తల్లిదండ్రులు ఒత్తిడికి గురుచేస్తున్నారు. వాళ్ల కష్టాలు తీర్చేందుకు నా నియోజక వర్గంలో పరిశ్రమలు నెలకొల్పుతాను.

ఎంపీగా మీరు తొలిసారి గెలిచారు. మీ అనుభూతి ఎలా ఉంది..?

నేను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో జాతీయ స్థాయిలో పనిచేశాను. భువనగిరి ప్రజలు నన్ను తొలిసారి పార్లమెంట్‌కు పంపించారు. నాకు గెలిచిన సంతోషం ఒక్కరోజే ఉంది. వెంటనే నా బాధ్యత గుర్తుకొచ్చింది. ప్రజల ఆలోచనలు, అవసరాలు నాకు తెలుసు. నేను నిద్రలేవక ముందే ప్రజలు నా ఇంటి వద్దకు వచ్చి ఉంటారు. గెలిచిన తర్వాత నేను ఫోన్ లిఫ్ట్ చేయకుంటే ప్రజలు నన్ను నమ్మరు. అందుకే ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాను.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 10-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

పార్లమెంట్‌లో రైతుల గొంతుక
ఎంపీ అమ్రారామ్‌కు ఏఐకేఎస్ అభినందన
- బీజేపీ అడ్డాలో సీపీఐ(ఎం) గెలుపుపై హర్షం
- హాజరైన సీతారాం ఏచూరి, బృందా కరత్



వివరాలు 11లో

సంపుటి : 10 సంచిక : 114 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

కొలువుదీరిన క్యాబినెట్
మోడీ సహా 72 మంది ప్రమాణ స్వీకారం
- తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు
- 30 మందికి క్యాబినెట్ హోదా
- స్వతంత్ర హోదాలో ఐదుగురు సహాయ మంత్రులు



న్యూఢిల్లీ : భారత ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి ప్రమాణస్వీకారం చేశారు. దీంతో జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత మూడుసార్లు ప్రధాని పదవిని చేపట్టిన నేతగా మోడీ రికార్డు సృష్టించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం తెలుగు రాష్ట్రాలకు చెందిన కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ (తెలుగుదేశం), శ్రీనివాస వర్మ బండి సంజయ్ కుమార్, కిషన్ రెడ్డి (బీజేపీ) సహా 71 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురికి, తెలంగాణకు చెందిన ఇద్దరికి క్యాబినెట్‌లో చోటు లభించింది.

మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జేడీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, మనోహర్ లాల్ ఖట్టర్, హెచ్‌డీ కుమారస్వామి, పీయుష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, జితిన్ రామ్ మాంఝీ, లలన్ సింగ్, సర్బానంద సోనోవాల్, డాక్టర్ వీరేంద్ర కుమార్, ప్రహ్లాద్ జోషీ, జుయల్ ఓరం, గిరిరాజ్ సింగ్, అశ్వనీ వైష్ణవ్, జ్యోతిరాదిత్య సింధియా, భూపేంద్ర యాదవ్, గజేంద్ర సింగ్ షెకావత్, అన్నపూర్ణ దేవి, కిరణ్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరి, మనసుఖ్ మాండవియా, చిరాగ్ పాశ్వాన్, సీఆర్ పాటిల్, రావు ఇంద్రజిత్ సింగ్, డాక్టర్ జితేంద్ర సింగ్, అర్జున్ రామ్ మేఘ్‌వాల్, ప్రతాప్ రావ్ జాదవ్, జయంత్ చౌదరి, జితిన్ ప్రసాద్, షరిపడ్ నాయక్, పంకజ్ చౌదరి, కిషన్ పాల్, రామ్‌దాస్ అథావలే, రామ్‌నాథ్ ఠాకూర్, నిత్యానంద్ రాయ్, శ్రీమతి అనుప్రియా పటేల్, వి. సోమన్న, ప్రొఫెసర్ బఘేల్, శోభా కరంద్లాజే, కీర్తి వర్ధన్ సింగ్, బీఎల్ వర్మ, శాంతను ఠాకూర్, సురేష్ గోపి, డాక్టర్ ఎల్ మురుగన్, అజయ్ తమ్టా, కమలేష్ పాశ్వాన్, భగీరథ్ చౌదరి, సతీష్ చంద్ర దూబే, సంజయ్ సేథ్, రవనీత్ సింగ్, దుర్గాదాస్, శ్రీమతి సుకంత మజుందార్ తదితరులు ఉన్నారు.


మోడీ క్యాబినెట్‌లో బీజేపీకి చెందిన 61 మందికి చోటు దక్కింది. మిత్రపక్షాల నుండి 11 మంది క్యాబినెట్‌లో చేరారు. టీడీపీ, జేడీయూ, శివసేన పార్టీలకు రెండేసి మంత్రి పదవులు లభించగా మిగిలిన మిత్రపక్షాలకు ఒక్కో పదవి లభించింది. క్యాబినెట్‌లో 27 మంది ఓబీసీలు, 10 మంది ఎస్సీలు, ఐదుగురు ఎస్టీలు, ఐదుగురు మైనారిటీలు ఉన్నారు. క్యాబినెట్‌లో చేరిన 43 మందికి మూడుసార్లు మంత్రులుగా పనిచేసిన అనుభవం, 23 మందికి రాష్ట్రాల్లో మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉంది. 30 మందికి క్యాబినెట్ హోదా లభించగా ...11లో

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ	- యూపీ
క్యాబినెట్ మంత్రులు	
రాజ్ నాథ్ సింగ్	- యూపీ
అమిత్ షా	- గుజరాత్
నితిన్ గడ్కరీ	- మహారాష్ట్ర
జెపి నడ్డా	- రాజ్యసభ
శివరాజ్ సింగ్ చౌహాన్	- మధ్యప్రదేశ్ (మాజీ సీఎం)
నిర్మలా సీతారామన్	- రాజ్యసభ
జయశంకర్ సుబ్రమణ్యం	- రాజ్యసభ
మనోహర్ లాల్	- హర్యానా (మాజీ సీఎం)
హెచ్ డి కుమార స్వామి	- కర్నాటక (జేడీయస్)
పియూష్ గోయల్	- మహారాష్ట్ర
ధర్మేంద్ర ప్రధాన్	- ఒడిశా
జితిన్ రామ్ మాంఝీ	- బీహార్ (హెచ్ఏఎం)
లలన్ సింగ్	- బీహార్ (జేడీయూ)
సర్బానంద్ సోనేవాల్	- అసోం(మాజీ సీఎం)
వీరేంద్ర కుమార్	- మధ్యప్రదేశ్
కింజరపు రామ్మోహన్ నాయుడు	- ఏపీ (టీడీపీ)
ప్రహ్లాద్ జోషి	- కర్నాటక
జోయల్ ఓరాం	- ఒడిశా
గిరిరాజ్ సింగ్	- బీహార్
అశ్వినీ వైష్ణవ్	- ఒడిశా
జ్యోతిరాదిత్య సింధియా	- మధ్యప్రదేశ్
భూపేంద్ర యాదవ్	- రాజస్థాన్
గజేంద్ర సింగ్ షెకావత్	- రాజస్థాన్
అన్నపూర్ణ దేవి	- జార్ఖండ్
కిరణ్ రిజిజు	- అరుణాచల్ ప్రదేశ్
హర్దీప్ సింగ్ పురి	- రాజ్యసభ
మన్సుక్ మండవియ	- గుజరాత్
జి. కిషన్ రెడ్డి	- తెలంగాణ
చిరాగ్ పాశ్వాన్	- బీహార్ (ఎల్‌జేపీ)
సిఆర్ పాటిల్	- గుజరాత్

సహాయ మంత్రులు
ఇంద్రజీత్ సింగ్ - హర్యానా, జితేందర్ సింగ్ - రాజస్థాన్ అర్జున్ రాం మేఘావల్ - రాజస్థాన్, ప్రతాప్ రావ్ గణపతి రావ్ యాదవ్ - మహారాష్ట్ర (శివసేన షిండే, మిత్రపక్షం) జయంత్ చౌదరి - రాజ్యసభ (రాష్ట్రీయ్ లోక్ దళ్, మిత్రపక్షం) జితెన్ ప్రసాద్ - యూపీ, శ్రీపాద్ యసో నాయక్ - గోవా ...10లో



ఇక సెలవ్...
- అధికారలాంఛనాలతో ముగిసిన రామోజీరావు అంత్యక్రియలు
- పాడెమోసిన చంద్రబాబు
- అంతిమయాత్రలో పాల్గొన్న సినీ, రాజకీయ ప్రముఖులు





నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో
రామోజీ గ్రూపు సంస్థల చైర్మెన్ రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో పూర్తిచేశారు. గౌరవ సూచకంగా పోలీసులు గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో రామోజీ స్వయంగా నిర్మాణం ...11లో



నెలరోజులు... వరుస సమీక్షలు
జోడెద్దులుగా అభివృద్ధి-సంక్షేమం
- అధికారుల బదిలీలకు తొలి ప్రాధాన్యత
- పాలన పరుగులుతీయాలి
- సీఎం, డిప్యూటీ సీఎంల ఆకాంక్ష
- ప్రణాళికలు సిద్ధం చేసిన రేవంత్ సర్కార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
నెలరోజులు...వరుసగా అన్ని ప్రభుత్వ శాఖలపైనా సమీక్షలు. ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే సమీక్షలు. జిల్లా మంత్రుల అధ్యక్షతన అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వరుస సమావేశాల నిర్వహణ. అభివృద్ధి-సంక్షేమం జోడెద్దుల బండిలా పరుగులు తీయాలి. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిర్ణయించారు. దానిలో ...11లో

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెల్లడి
ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోతికి టాప్ ర్యాంక్



న్యూఢిల్లీ: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) 2024 ఫలితాలను ఆదివారం ప్రకటించారు. ఈ పరీక్షకు 1.8 లక్షల మంది అభ్యర్థులు హాజరుకాగా, వీరిలో 48,248 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో మహిళా అభ్యర్థులు 7,964 మంది, వికలాంగులు 594 మంది ...10లో

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు
దరఖాస్తు చేసుకున్న వారు 4.03 లక్షల మంది
- హాజరైన అభ్యర్థులు 3.02 లక్షలు
- త్వరలో కమిషన్ వెబ్‌సైట్లో ప్రిలిమ్స్ కీ
- షెడ్యూల్ ప్రకారమే అక్టోబర్ 21న మెయిన్స్
- వివరాలు వెల్లడించిన టీజీపీఎస్సీ
- నిమిషం ఆలస్యం నిబంధన నిక్కచ్చిగా అమలు
- పలు చోట్ల నిరాశతో వెనుదిరిగిన అభ్యర్థులు

వివరాలు 10లో

ధాన్యం కొనుగోళ్లలో రికార్డు
రూ.10,355.18 కోట్ల చెల్లింపులు
- మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలకు..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డు నెలకొల్పింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లించింది. ఇప్పటివరకు 8,35,109 మంది రైతులకు రూ. 10,355.18 కోట్లు చెల్లింపులు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ముందుగా ప్రారంభించింది. గతంలో ఏప్రిల్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేవి. ఈసారి దాదాపు రెండు వారాలు ముందుగా మార్చి 25వ తేదీ నుంచే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈసారి 7,178 కేంద్రాలను తెరిచింది. వీటిలో 6,345 కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగాయి. ఈ నెల 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా 47.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. చాలాచోట్ల ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయిందనీ, మరో పది రోజుల పాటు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశముందని సివిల్ సప్లయిస్ విభాగం అంచనా వేస్తోంది. ఆలస్యంగా పంటలు వేసిన రైతులకు ఇబ్బంది తలెత్తకుండా.. ఈ నెలాఖరు వరకు అవసరమైన చోట్ల కేంద్రాలు తెరిచి ఉంచాలని అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది.

ఈ ఏడాది దాదాపు 75.40 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోళ్లు జరుగుతాయని సివిల్ సప్లయిస్ విభాగం మొదట్లో అంచనా వేసింది. కానీ మార్కెట్లో మద్దతు ధర కంటే ఎక్కువ రేటు రావటం, ప్రయివేటు వ్యాపారులు పోటీ పడి మంచి ధరకు కొనుగోలు చేయటంతో కేంద్రాలకు వచ్చే ధాన్యం అంచనా తగ్గింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఈసారి సివిల్ సప్లయిస్ విభాగం పక్కాగా ఏర్పాట్లు ...11లో

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్
ఆరుగురు మావోయిస్టులు మృతి
- పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి చెందినవారిగా గుర్తింపు



ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్‌లో మరోమారు భద్రతా బలగాల కాల్పుల మోతలు వినిపించాయి. ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఎన్‌కౌంటర్ నారాయణ్‌పూర్ జిల్లాలోని ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోబెల్, తుల్తులి గ్రామాల సమీపంలో శుక్రవారం జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మొదట ఏడుగురిని చంపినట్టుగా ప్రకటించి, తర్వాత ఆరుగురేనని పోలీసులు వెల్లడించారు. వారిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. వారంతా తూర్పు బస్తర్ ఫార్మేషన్‌కు చెందిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్)కు చెందినవారిగా గుర్తించారు. మావోయిస్టుల ఉనికిపై ...11లో

బడి ఊడ్చేదెవరు..?
- బడులకు రంగులు, మరమ్మతులు సరే.. పరిశుభ్రత మాటేమిటి!
- అపరిశుభ్రమైన గదులు, టాయిలెట్ల నడుమ చదువులెలా..
- ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

స్కావెంజర్ల వ్యవస్థ రద్దుతో స్కూళ్లలో పారిశుధ్యం ప్రశ్నార్థకం



నవతెలంగాణ-సిటీబ్యూరో
అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కొత్త ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం కోట్ల రూపాయలు కేటాయించింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలకు రంగులు వేస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నారు. టాయిలెట్ల రిపేరింగ్, అదనపు టాయిలెట్ల నిర్మాణం, డ్రెయినేజీ వ్యవస్థ సరిచేయడంతో పాటు ఎలక్ట్రికల్ పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఈ నెల 12లోపు పాఠశాలలను అందంగా తీర్చిదిద్ది విద్యార్థులకు మంచి వాతావరణంలో స్వాగతం పలికేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రారంభ అనంతరం పరిశుభ్రత గురించి ప్రభుత్వం ఆలోచించింది లేదు. తరగతి గదుల శుభ్రత, మొక్కలకు నీళ్లు, ప్రాంగణాల పరిశుభ్రత, మరీ ముఖ్యంగా టాయిలెట్స్ క్లీనింగ్ పనులు స్కావెంజర్లకు బదులు జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు



రెండేండ్ల క్రితం గత ప్రభుత్వం అప్పగించడంతో పనులు సరిగ్గా జరగడం లేదు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం, శానిటేషన్ ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పుడీ సమస్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభంలోపే స్కావెంజర్ల వ్యవస్థ పునరుద్ధరణపై ఒక నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఉపాధ్యాయ సంఘాల భేటీలో ...11లో

పూరణ

యుద్ధ ట్యాంకులు ఎదురొచ్చినప్పుడే
సముద్రం బిక్కచచ్చిపోయింది
అలలపై విరుచుకుపడినప్పుడే
కలలు కందిపోయాయి
ఇక, పగలైనా రాత్రయినా-



కమ్ముకునేది చీకటేనని అప్పుడే తెలిసిపోయింది
చెట్ల మీద గూళ్లలో గుడ్లు ఎదురుచూస్తున్నప్పుడే
పొదగాల్సిన పక్షులు తూటాల మధ్య
కలవరపడినట్టు కబురొచ్చింది
పురిటి నెప్పులేవీ బాంబు పేలుళ్ల నడుమ వినబడలేదు
పాలసీసాలు పగిలిపోయిన ఆ క్షణమే
పాలస్తీనా అమ్మతనం నేలపాలైంది
తొమ్మిది నెలల కలల స్వప్నం పొలమారింది.
విరిగిపోయిన ఇంద్ర ధనస్సు
శిథిలాల మధ్య చెదిరిపడింది
దాన్లో తమ ముఖాలను పోల్చుకోలేక
పిల్లలు గుక్కపెట్టారు
గుట్టలుగా పోగుపడుతున్న శవాల మధ్య
కొన ఊపిర్ల మనుషుల బుక్‌మార్క్ లవుతున్నాయి
ఆరడుగులుండే దేహానికి
ఆరించులైనా లేని నోటితో..
నినాదాన్ని పూరించలేని తల్లిదండ్రులు
దుఃఖాన్ని తమ పాడె మీదకే ఎత్తుకుంటున్నారు
గళ్ల నుడికట్టులో పూడ్చేయగా మిగిలిన ఖాళీలను
ఇప్పుడిక ఎవరి ఆత్మలతో పూరిస్తావురా?
పిల్లలా? తల్లులా? తండ్రులా??
-లేదూ, చివరాఖరిగా మిగిలే నీతోనా?

- దేశరాజు

కాంతి-భ్రాంతి



అవనిని అలుముకున్న
సామాజిక మాధ్యమ రేఖలు...
కల ఏదో కళ ఏదో
కాంతి ఏదో భ్రాంతి ఏదో
తెలియనంతగా నట్టింట
నెట్టింటి వలలు....
కాలాన్ని దూరాన్ని తన గుప్పిట్లోకి
లాక్కున్న సాంకేతిక స్వర దృశ్య లయలు..
మనసులోని స్నేహ లతలు
మాటలోని ప్రేమ కృతులు
అనుబంధ గంధాల అనురాగ శృతులు
మానవతా గీతాల సరిగమలన్నీ..
సెల్ అలలలో గిలగిల చేపలు...

శబ్దాన్ని నిశ్శబ్దంగా తనలోకి
ఇముడ్చుకున్న మాయపొర
పద సంపదలు వాక్య మధురిమలు
పలకరింపుల పరిమళాలన్నీ నేడు
అర చేతి వైకుంఠపు గడులు
పద కోకిలల కిలకిల ధ్వనులతో
వాక్య కిరణాల వేకువ వెలుగులను
మనో గగనంలో ప్రసరింపజేద్దాం
భద్రమైన జీవన భాగ్యాన్ని తరతరాలుగా
అందిస్తున్న పుస్తక నేస్తాన్ని గుండె గుడిలో నిలుపుదాం..

- వెల్మల జయపాల్ రెడ్డి, 9441168976

మెచ్యూరిటీ!

ఎప్పటికీ.. బద్దలుకాని అగ్నిపర్వతాల్ని
మౌనంగ కనీసం గుండెల్లోనైనా గుట్టుగ
పేర్చుకోవడం నేర్చుకోవాలి!

తిట్లని, శాపనార్థాల్ని ఉద్దీపనా బహుమతులుగ
మనసు పొరల్లో రహస్యంగ ఎవరి కంట
పడకుండ దాచుకోవాలి..!

చివరాఖరికి మాటల్లోనైనామనమే ఓ ముందడుగేసి
శత్రువులైనా సరే.. హద్దుల్ని చెరిపేసుకోవాలి!

కినుకలు, అర్థంలేని అలకలు దూరదూరంగ ఉండటం..
నిశ్శబ్దాల్ని మోయడం.. మూతులు తిప్పుకోవడాలూ..
ముఖాల్ని దాచుకోవడాలు..

రానున్నవి గడ్డు రోజులు.. ఏకాంతం అతి ప్రమాదకరం!
ఆస్తులు, అంతస్తులెన్నున్నా ఎంతటి వారికైనా
ఆలోచనల అపరిపక్వత
'మెచ్యూరిటీ' అనిపించుకోదు!!

చూపు సక్కగలేనప్పుడు దృష్టి సంక్లిష్టత సహజం!
మనుషుల్తో సావాసమంటెనే కాళ్లల్ల కట్టిరికినట్లు..
జరంత సల్లు బిగుండాలే!!

అహమో, అజ్ఞానమో రెంటిని పక్కన పెడితే
అందరిలో ఆనందంగ వుంటాం!
ఒకమెట్టు దిగితే ఏం పడిపోం
నెగ్గడం కాదు తగ్గడమే మజా!!

ద్వేషం అసహజాతం!
ప్రేమ సర్వామోద సమ్మతం!!

- అశోక్ అవారి, 9000576581

కొల్లి వెంకన్న కవిత్వంలో 'దళిత వేదన'



"ఎంత కోయిల పాట వృధయయ్యెనో కదా చిక్కు చీకటి వనసీమలందు" అని జాషువ ఆవేదన చెందాడు. "పుట్టరాని చోట పుట్టుకతన ఎన్ని వెన్నెల వాగులు ఇంకిపోయనో గదా?" అని వాపోయాడు. నేటికీ ఎంతోమంది అణగారిన వర్గాల కవులు, కవయిత్రులు వెలుగులోకి రాకుండా పోయారు. సాహిత్య చరిత్రలో వారికి సముచిత స్థానం దొరకలేదు. దళిత సాహిత్య ఉద్యమ ఉధృతిలో కొంతమంది తొలితరం కవులు వెలుగులోకి వచ్చారు. డాక్టర్ కల్లూరి ఆనంద రావు, గోగుశ్యామల, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ లాంటి పరిశోధకులు పాత తరం కవులను, కవయిత్రులను సాహిత్య లోకానికి పరిచయం చేశారు. దళిత సాహిత్య చరిత్ర ఊట చెలిమ లాంటిది. ఈ సృజన చెలిమ నుండి మధురమైన కవితాజలాన్ని ఇంకా వెలికి తీయాల్సిన అవసరముంది. తరతరాలుగా అక్షరానికి దూరం చేయబడిన జాతిలో వెల్లువెత్తిన, సాహిత్య జీవ నదులతో వర్తమాన కాలానికి అంటిన కాలుష్యాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలి. ఇలాంటి మరొక కవితా జీవనది కొల్లి వెంకన్న. వెంకన్న మాష్టారుగా ప్రఖ్యాతిగాంచిన ఈ కవి తూర్పు గోదావరి జిల్లా కోలంక గ్రామంలో 1932 ఫిబ్రవరి 4వ తేదీ మహాలక్ష్మి (తండ్రి పేరు) గంగమ్మ దంపతులకు జన్మించాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో వెంకన్న ఐదవ తరగతి వరకు చదివి, ఆర్థిక ఇబ్బందుల వలన విధిలేని పరిస్థితుల్లో పశులకాపరిగా భూస్వామి వద్ద చేరాడు. ఆ తరువాత మేనమామ వడ్డి వెంకన్న, గురువు వీరన్నల ప్రోత్సాహంతో విద్యనభ్యసించి ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించాడు. పల్లి పాలెం, కోలంక గ్రామాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించాడు. విద్యార్థులకు కొంగుబంగారంగా, గ్రామ ప్రజలకు తలలో నాలుకగా విలసిల్లి, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నాడు. రచయిత దాట్ల దేవదానంరాజు వెంకన్న ప్రియ శిష్యుడు. ఆయన ఏలుబడిలో అక్షరాలు దిద్దుకొని, తరువాత గురువుతో కలిసి ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. కోనసీమ ప్రాంత ప్రజల గుండెల్లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా కొలువైన కొల్లివెంకన్న 1996 జూన్ 11న మరణించాడు.

డెబ్బయ్యో దశకంలో ఆధునికదృష్టితో దళిత స్పృహతో వెంకన్న ఎన్నో పద్యాలు, గేయాలు, శతకాలు రాశాడు. నిరుపేదలు, వ్యసాయకూలీలు, అణగారిన వర్గాలు నిత్య జీవితంలో అనుభవిస్తున్న కష్టనష్టాలను వాస్తవ దృష్టితో కవిత్వీకరించాడు. స్పందనాస్పద హృదయంతో కవిత్వం రాసుకుంటూ పోవటం తప్ప ప్రచురణ విషయం వెంకన్న పట్టించుకోలేదు. అమూల్యమైన వెంకన్న అముద్రిత రచనలను సేకరించి వారి కుమారుడు కొల్లి సత్యనారాయణ 'దళిత వేదన' పేరుతో కవితా సంపుటిని ప్రచురించాడు. పద్య, గద్య, శతక, వచన, గేయ రూపంలో వెలువడిన ఈ సంపుటిని ఇటీవల హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. తరువాత యానాంలో పరిచయ సభ నిర్వహించారు.

ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుడైన వెంకన్న ప్రత్యేకించి భాషా శాస్త్రాలను అధ్యయనం చేయకపోయినప్పటికీ కుసుమ ధర్మన్న, గుర్రం జాషువ, బోయి భీమన్నల ప్రభావంతో సామాజిక అసమానతలు, ఆర్థిక అంతరాలు, ప్రజాసమూహంలో వేళ్లూనుకున్న మూఢ నమ్మకాలను తీవ్రంగా నిరసిస్తూ సరళంగా పద్య కవిత్వం రాశాడు. సందేశాత్మకమైన గేయాలు రాశాడు. ఒక్కొక్క అంశం గురించి భావ పరమైన పునరుక్తి లేకుండా ఎనభైకి పైగా పద్యాలు రాశాడు. కొన్ని పద్యాలు శతకశైలిలో ప్రబోధాత్మకంగా సాగాయి. కులపిశాచుల కుటిలత్వాన్ని, మత గజంబుల మదాన్ని మట్టు బెట్టాలని, 'మనువు చూపిన బాటను మంట గలపాలని వెంకన్న పిలుపునిచ్చాడు. దళిత జనుల వేదనను కవిత్వంలో శక్తివంతంగా పలికించాడు. మనువాదుల గుండెలదిరేలా ప్రశ్నాస్త్రాలను సంధించాడు. **"నీదు తల్లివలెనె నా తల్లి యున్నది/ నిన్ను గన్న యట్లు నన్ను గనెను/ నీదు రూపు గూడ నాదు రూపేనోయి/ ఏల వచ్చె నాకు మాల తనము?"** అంటూ సమర్థుడైన న్యాయవాదిలాగా కులవ్యవస్థ రూపొందించిన కుట్రను వ్యతిరేకించాడు. **'ఇరువురందు భేద మిసుమంతయు లేదని'** పద్యాల ద్వారా శాస్త్రీయంగా నిరూపించాడు. **"కోట్లకొలది సొమ్ము/ కూడ బెట్టు నరుడు కూడా"** కూలి వాని అండదండ లేకపోతే ఒక్క క్షణం కూడా మనుగడ సాగించలేడని వెంకన్న తెగేసి చెప్పాడు. కిందికులంలో పుట్టిన కారణంగా కూలివాడిగా మారాల్సి వచ్చిందనే ప్రగాఢమైన విశ్లేషణతో కవిత్వం రాశాడు. కుల నిర్మూలనా పోరాటంలో ముందుకు నడిచిన ఈలి వాడవల్లి, బి. వి రమణయ్య, పావన మూర్తి, పొనుగుమట్ల విష్ణుమూర్తి తదితర దళిత వైతాళికుల, నాయకుల అచంచల కృషిని పద్యాలలో కొనియాడాడు.

కవికి అపూర్వ వస్తు నిర్మాణ దక్షత ఉండాలి. విస్తృత వస్తువులను వేయి కళ్ళతో పరిశీలించి, పాఠక లోకానికి సరికొత్త రసస్ఫూర్తి కలిగించాలి. కొల్లి వెంకన్న అతి సాధారణ వస్తువులను గ్రహించి, పీడిత ప్రజల జీవితాలకు అన్వయించి రమణీయమైన పద్యాలను రచించాడు. డాక్టర్ బోయి విజయభారతి అన్నట్లుగా వెంకన్న ఊహాశక్తి గొప్పది. ఆయన ఎంచుకున్న కవితా వస్తువులలో వైవిధ్యం ఉంది. 'ఉప్పు మాత' లాంటి కవితల్లో ఈ రకమైన దృష్టి కనిపిస్తుంది.

అసమ సమాజంలో బుసలుకొడుతున్న కులవివక్ష, పేదరికం, మతాధిపత్యాలను ఎదుర్కొనే క్రమంలో వెంకన్న ప్రతిఘటనాత్మకమైన చైతన్యాన్ని అందిపుచ్చుకున్నాడు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే పాఠశాలలో కూడా ఆయన అనేక అవమానాలను ఎదుర్కొని, ఆత్మగౌరంతో వాటిని ధిక్కరించి నిలబడ్డాడు. డాక్టర్ ఏ.టి కోవూరు, గోరా, తాపీధర్మారావు వంటి వారి ప్రేరణతో హేతువాదిగా పరిణామం చెందాడు. మనుషులను నిలువెల్లా కలుషితం చేస్తున్న మూఢాచారాలను తరిమికొట్టే శాస్త్రీయ ఆలోచనలను విద్యార్థుల్లోనూ, తనజాతి జనుల్లో రేకెత్తించాడు.



"నీళ్ళు నీది తండ్రి, నేల నీదు జనని/ ఇరువురకును బుట్టి యిలను వెలసి/ సర్వ జనుల కిలను చప్పదనము బాపె/ గొప్ప దానివమ్మ ఉప్పు మాత" అంటూ కవి ఉప్పు పుట్టుక తీరును కవిత్వంగా మలిచాడు. **"నిన్ను గన్న తండ్రి, నీరు మళ్ళీ నిన్ను హతమారుస్తుందని, కరుణ లేనట్టి వాడు నీదు కన్న తండ్రి"** అంటూ నీటికి ఉప్పుకు ఉన్న విలక్షణ బంధాన్ని తేటతెల్లం చేసి, ఉప్పు మాతతో ఆత్మీయంగా కవి సంభాషిస్తాడు. నిత్య జీవనంలో ఉప్పు ప్రయోజనాన్ని, ఆహారంలో ఉప్పు ప్రాధాన్యతను, కడలి తీరంలో ఉప్పు ఉత్పత్తివిధానాన్ని, ఉప్పు వలన కలిగే లాభ, నష్టాలను వెంకన్న సముచితంగా అక్షరబద్ధంచేశాడు. జనుల నాలుకల మీద ఉప్పు 'రుచి మొలకలు' మొలిపిస్తుందని, ఆహారవిజ్ఞానికి ఉప్పుగల్లు 'ఒజ్జవిత్తు'గా ఉపయోగపడుతుందని కవితాత్మకంగా సంభాషించాడు. కోటీశ్వరునికీ, కటిక నిరుపేదకు ఉప్పు ఒకేరకంగా మేలు సమకూర్చుతుందని, ఉప్పుకు ఉన్న సమబుద్ధి మనుషులకు లేదని ఆవేదన చెందుతాడు కవి. ఉప్పుకు కూడా పన్ను చెల్లించాలని హుకూం జారీ చేసిన సీమదొరల దోపిడీ విధానాన్ని వెంకన్న నిరసించాడు. 'గొప్పదానివమ్మ ఉప్పు మాత' అనే మకుటంతో ఉప్పుతో సంభాషిస్తున్నట్లుగా సాగిన వెంకన్న పద్యశైలి విశిష్టంగా ఉంటుంది. 'తాటి చెట్టు జనని నీకు దండమమ్మ' అనే మకుటంతో హృద్యమైన భావధారతో వెంకన్న రాసిన పద్యాలు ఎంతగానో ఆకట్టు కుంటాయి. **"నీదు రక్తము కాశించి నీదు సుతులు/ తలలను నరికి నెత్తురు త్రాగు చుండె"** అంటూ కవి ఆవేదన చెందాడు. ఈ పద్యాలు చదువుతుంటే కరుణశ్రీ 'పుష్ప విలాపం' మదిలో మెదులుతుంది. **"దాన కర్ణుడు నీలోన దాగియుండె/ నిన్ను బోలిన సహకారి ఇలనెవరు గలరు?"** అంటూ వెంకన్న బహుళ ప్రయోజన దాయిని తాటిచెట్టు ఔన్నత్యాన్ని పద్యాల్లో ప్రస్తుతించాడు. కష్టజీవుల కడుపులో చెలరేగే ఆకలి మంటలనార్పే తల్లియని కీర్తించాడు. మద్యపానం, చీట్లపేక వల్ల సంభవించే ప్రమాదాలను కవిత్వంలో వెంకన్న ఆమోదయోగ్యంగా చిత్రించాడు. ఈ వ్యసనం సిరులను నోటన బెట్టియు కర కరమని నమిలి.. కడుపున దాస్తుందని" నరులను నాశన మొనర్చు పరమ పిశాచి' యని కవి హెచ్చరించాడు. "మేడల రేడుల యందున ఆడమని, పాడుబడిన బ్రతుకుల ఇళ్ళలో కాలు పెట్టవద్దని చీట్లపేకను వెంకన్న వేడుకున్నాడు. 'కోడిరేడు' కవితలో కోడికి మనిషికి మధ్యవున్న సంబంధ బాంధవ్యాలను, కాలికి కత్తి గట్టుకొని రణరంగంలో వీరోచితంగా పోరాడే కోడిపుంజు ధీరత్వాన్ని రమణీయంగా వర్ణించాడు .

అసమ సమాజంలో బుసలుకొడుతున్న కులవివక్ష, పేదరికం, మతాధిపత్యాలను ఎదుర్కొనే క్రమంలో వెంకన్న ప్రతిఘటనాత్మకమైన చైతన్యాన్ని అందిపుచ్చుకున్నాడు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే పాఠశాలలో కూడా ఆయన అనేక అవమానాలను ఎదుర్కొని, ఆత్మగౌరంతో వాటిని ధిక్కరించి నిలబడ్డాడు. డాక్టర్ ఏ.టి కోవూరు, గోరా, తాపీధర్మారావు వంటి వారి ప్రేరణతో హేతువాదిగా పరిణామం చెందాడు. మనుషులను నిలువెల్లా కలుషితం చేస్తున్న మూఢాచారాలను తరిమికొట్టే శాస్త్రీయ ఆలోచనలను విద్యార్థుల్లోనూ, తనజాతి జనుల్లో రేకెత్తించాడు. యెండ్లూరి చిన్నయ్య అంబేడ్కర్ జీవిత చరిత్ర అధ్యయనస్ఫూర్తితో వెంకన్న సామాజిక విముక్తి తత్వాన్ని అర్థం చేసుకున్నాడు. బాబాసాహెబ్ అంబేడ్కర్ స్థాపించిన 'రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా' రాజకీయాలను, ఆశయాలనుప్రచారం చేశాడు. ఈశ్వరీ బాయి, బి.వి.రమణయ్య లాంటి నాయకులు కూడా ఎన్నికల సమయంలో అంబేడ్కర్ భావజాల ప్రచారానికి వెంకన్నను ఆహ్వానించటం విశేషంగా భావించవచ్చు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవన, ఉద్యమ తీరుతెన్నులను వెంకన్న తన పద్యాలలో తాత్విక బంధురంగా చిత్రించాడు. **"అంధకారము బాపు అరుణుడేమి గొప్ప?"** అంటూ **"చీకటి బాపె అంబేద్కరే గొప్ప"** అంటూ వెంకన్న భీమైక దృష్టితో కలమెత్తి చాటిచెప్పాడు. **"మతము మారినావుగాని మాలతనము పోయిందా? మతము మారినా గాని మాదిగవే నీవిలలో"** అంటూ క్రైస్తవ, హిందూమతాల పరిమితుల్లో చిక్కిన మాల మాదిగలను ప్రశ్నించాడు. చర్చి, దేవాలయాల్లో, ప్రార్థనలు, అర్చనల్లో మునిగి తేలే అణగారిన వర్గాలకు వెంకన్న అంబేడ్కర్ హక్కుల ఆవశ్యకతను తెలియజెప్పాడు.. **"కలమను హలమున భారత పొలము దున్ని/ జాతి మెరక పల్లము లెల్ల/ సౌఖ్య జలములు సర్వము సాగు నటుల/ సల్పితివి భీమ! నీకిలసాటి ఎవరు?"** అంటూ అంబేడ్కర్ బహుముఖీన ఔన్నత్యాన్ని అపురూపంగా వర్ణించాడు. **"సత్యభామ మగనిచక్రంబు కంటెను/ భూపుత్రి పతియొక్క తూపుల కన్నను/ శివుని కరమునందు శూలంబు కంటెను/ అపరబుద్ధుని కల మరయ ఘనము"** (ఘనుడు అంబేడ్కరుండు). విష్ణు చక్రం, రామ బాణం, శివుని శూలం ఇత్యాది పురాణ వీరుల ఆయుధాల కంటే అంబేడ్కర్ కలము ఘనమైనదని కొల్లి వెంకన్న జ్ఞానోత్తేజంతో నిర్ధారించాడు. ఏభయ్యేళ్ల క్రితం వెంకన్న రాసిన ఈ పద్యంలో ఈనాటి దళిత కవుల తాత్విక ఎరుక కనిపిస్తుంది. **"మీ దగ్గర బ్రహ్మాస్త్రం ఉంది/ ఉంటే ఉండనివ్వండి/ మీ దగ్గర పాశు పతాస్త్రం ఉంది/ ఉంటే ఉండనివ్వండి"** అని సూర్యవంశి రాసిన 'యెన్నుంటేనేం' కవితకు వెంకన్న పద్యానికి భావ సామీప్యత కనిపిస్తుంది.

వెంకన్న ఉపాధ్యాయుడు కావటం వల్ల విద్యార్థుల మనోవికాసాన్ని పెంపొందింపజేసే సంకల్పంతో 'కోతి దూలము', 'కాకి పూజ' లాంటి సుప్రసిద్ధ కథలను, వాటిలోని నైతిక విలువలను, జీవిత సత్యాలను పద్యాలుగా మార్చి, పఠన యోగ్యమైన శైలిలో ప్రబోధించాడు. కథా కావ్య రచనాశైలిలో సాగిన ఈ ఖండికలు పాఠ్యపుస్తకాలలో చేర్చదగిన స్థాయిలోఉన్నాయని డాక్టర్ పల్లేరు వీరాస్వామి అన్నమాట సత్య సమ్మతమైనది. చాలామంది పండితుల్లాగా వెంకన్న ఏ గురువు వద్దా పంచకావ్యాలను, వ్యాకరణ, ఛందోగ్రంథాలను పఠించలేదు. పద్యరూపంలో సందేశమందిస్తే అది పదికాలాలపాటు నిలుస్తుందని ఆయన భావించాడు. చాలామంది దళిత సంప్రదాయ కవుల్లాగా పద్య రచనను సాధన చేసి పూర్తిగా వ్యవహారశైలిలో పద్యాలు రాశాడు. అక్కడక్కడ అన్వయ దోషాలు, వ్యాకరణపరమైన చిన్న చిన్నపొరపాట్లు దొర్లినప్పటికీ వెంకన్న పద్యాల్లో ఉదాత్తమైన భావసంపద పొంగిపొర్లుతుంది. మానవీయ జీవన మార్గం ఆలోచనా లోచనాలకు దర్శనమిస్తుంది. అన్నిటికీ మించి అంబేడ్కర్, బౌద్ధ తాత్వికతకు వెంకన్న కవిత్వం నిలువుటద్దంలా ఉంటుంది.

(జూన్11 కొల్లి వెంకన్న వర్ధంతి సందర్భంగా)



డాక్టర్ కోయి కోటేశ్వర రావు,
9440480274

కమ్మనైన అమ్మ ముచ్చట



- గాజోజి శ్రీనివాస్,
9948483560

అమ్మ ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే. తన త్యాగం, కరుణ, అలుపెరుగని ఓర్పుతో బిడ్డని కనీ, పెద్దవారిని చేస్తుంది. అమ్మ పస్తులుండైనా బిడ్డ కడుపు నింపుతుంది. ఈ ప్రపంచానికి మొట్టమొదటి సారిగా నిన్ను పరిచయం చేసేది అమ్మే. ఎంత సేవ చేసినా అమ్మ రుణం తీర్చలేనిది. అమ్మ మీద అంతులేని ప్రేమను చూపడం బిడ్డ కర్తవ్యం. అలాంటి ప్రేమనే పెంచుకున్నారు మన కవి లేదాళ్ల రాజేశ్వరరావు. అమ్మ మీద ప్రేమను వ్యక్తం చేస్తూ రాసిన తన తృతీయ కవితా సంకలనమే 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి'.

రాజేశ్వరరావు అత్యంత విలక్షణమైన కవి. నిత్యం ఏదో ఒక పత్రికలో అతని కవితలు ప్రచురితం అవుతుంటాయి. ఆ కవిత్వంలో మానవీయ కోణాలు కవితా వస్తువులుగా కనిపిస్తాయి. వాటిని చదువుతుంటే మన చుట్టూ జరిగే సంఘటనలు గుర్తుకువస్తాయి. కొన్ని మన గుండెల్ని పిండేస్తాయి. అలాంటి కవి రాసిన ఎంతో ఆర్ద్రత గల కవితల్ని ఈ కవితా సంకలనంలో చదవొచ్చు. ప్రపంచీకరణలో మట్టి కొట్టుకుపోయిన మానవీయ విలువల్ని ఈయన కవిత్వంలో స్పృశిస్తున్నారు.

'అమ్మ కాళ్లకు/ కొనలేని మెత్తని చెప్పులు గుర్తొచ్చి/ కన్నీటి ప్రవాహమవుతాను' పాడై పోతాయని అమ్మ చెప్పుల్ని తడవకుండా/ చేతిలో పట్టుకుని నడిచేది కొన్నిసార్లు/ ఇప్పుడా చెప్పులు గూట్లో స్తబ్దంగా కనిపిస్తాయి/ ముట్టుకున్నప్పుడల్లా మెత్తగా/ అమ్మ పాదాలు కంది పోతాయేమోనన్నంత మృదువుగా..

ఈ కవితను చదివినప్పుడు కంట్లో నీళ్ల తిరుగుతాయి. మనం బతికినన్నాళ్ళు అమ్మ బతకపోవచ్చు కానీ అమ్మ బతికిన్నాళ్లు మనం బతికే ఉంటాం. అమ్మ ప్రేమను పొందుతూనే ఉంటాం. ఈ కవిత చదువుతున్నప్పుడు ప్రతి ఒక్కరికి తన తల్లి గుర్తుకొచ్చి గుండె బరువెక్కుతుంది. ఈ కవిత 'అక్షరాల తెర టోరి రేడియో'లో కూడా ప్రసారితం అయినది.


'అనివార్యమై ఆమె ఒక్క రోజు జ్వరంతో నిద్రపోతే/ బ్రహ్మాండాలు బద్దలైనట్లు/ సునామీలు చుట్టూ ముసురుకున్నట్లు/ ఆమె చాకిరిని ప్రశంసించని/ కష్టాన్ని కనికరించని/ ఆమె పైనే ఆధారపడ్డ ప్రత్యక్ష పరాన్న జీవిని నేను'.

ఇంట్లో అమ్మ, భార్య చేసే చాకిరిని ఎప్పుడూ మనం గుర్తెరగం. ఆమెకు జ్వరం వచ్చి మంచం ఎక్కిన రోజున కిచెన్‌కి వెళ్లి వంట చేయాలన్నా, ఇంటిని శుభ్రం చేయాలన్నా బ్రహ్మాండం బద్దలవుతుంది. అలవాటు లేని పనిని చేసినప్పుడు ఏదో పాతాళంలోకి దిగబడిపోయినట్లుగా భావిస్తాను. అప్పుడే గుర్తుకొస్తుంది, తాను రోజూ ఎంత కష్టపడుతుందో అని. అయినా తన కష్టాన్ని గుర్తించమని ఎప్పుడూ అడగదు. నిస్వార్థంగా, ప్రేమగా తన పని తాను చేసుకుంటూ, ఇంట్లో అందరికీ అన్నీ సమకూర్చుతుంది. మనమే ఆమెపై ఆధారపడ్డ పరాన్న జీవులమై ఉన్నాం.

ఇలా ప్రతి కవితలో ఏదో ఒక అంశాన్ని గూర్చి చక్కగా ఆవిష్కరించారు. కవికి వస్తువు కొదవలేదు, వస్తువు లోతుపాతులు బాగా తెలుసు, మనసు చెప్పినట్టు రాసుకోగలిగారు. చదివే ప్రతి పదానికి మనసులో ఆలోచనలు తెరలుతెరలుగా పొంగిపొర్లుతాయి. మానవీయ కోణాల్ని ఆవిష్కరించడంలో ఈ కవి సఫలీకృతమయ్యారని చెప్పవచ్చు. ఇలా సరళంగా అర్థమయ్యేలాగా మనసులోకి చొచ్చుకుపోయే విధంగా ఉన్నాయి కవితలు.

నాతో ఎవరైనా ఉంటే బాగుణ్ణు/ఒక్కణ్ణే మాత్రం ఎంతని పయనించను?/ ఒక్కణ్ణే గుండెల్ని చీల్చుకుని ఏం రాసుకోను?/ గుండెల్లోనైనా ఒకరు ఉండాలి కదా!... నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా జీవనం సాగిస్తున్నారు. ఇంకొకరి గురించి ఆలోచించేంత సమయం ఎక్కడిది. ఉన్న సమయమంతా నేను, నా కుటుంబం అనుకునే కాడికే సరిపోతుంది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా రూపొందాక మానవ బంధాల మాధుర్యం లేకుండా పోతుంది. ఓ ఆపద వచ్చినప్పుడు, కష్టాలు చుట్టుముట్టినప్పుడు, ఒంటరిగా మిగిలినప్పుడు నాతో ఎవరైనా ఉంటే బాగుండు అనే ఆలోచనలో మునిగిపోతాం. ఏదైనా సమస్య తనదాక వస్తే గాని తెలియట్లేదు బంధాల విలువలు.

'ఏం తీసుకొని పోతాను నాతో నేను/ ప్రోది చేసుకొని/ ఒంటరిగా వెళ్లేప్పుడు/ చిటికెడు కన్నీళ్లు కార్చడానికైనా ఒకరు ఉండాలి...' అని కవితను ముగిస్తాడు. ఎంత లోతైన భావుకత, చదువుతుంటే మనతో సూటిగా మాట్లాడినట్టే ఉంటుంది. ఈ లోకాన్ని దాటి వెళ్లేటప్పుడు తోడెవరు రాకున్నా, కనీసం మనకోసం ఒక చిటికెడు కన్నీళ్లు రాల్చగలిగే మనుషులను సంపాదించుకోగలగాలి. మనకంటూ ఓ నలుగురు అయినవారు ఉండాలి అంటారు కవి. నాన్న గురించి మరో కవితలో..



'నాన్నొక దు:ఖ సంద్రం/ గంభీరంగా ఉండే సముద్రానికెంత దు:ఖం!?/ ఎన్ని బాధ్యతల/ నదుల ఘోషాల్ని/ తనలో ఇముడ్చుకోలేదు/ ఎన్ని కన్నీటి ప్రవాహాల్ని తన కన్నుల్లో దాచుకోలేదు నాన్న... అయినా/ నాన్న ఎప్పటికీ/ ఇంకిపోని అనురాగ జలనిధి.

నాన్న బాధ్యతల గురించి త్యాగాల గురించి ఎంత చెప్పినా తక్కువే. నాన్న కళ్ళల్లో కనిపించని ఎన్నో దు:ఖ సముద్రాలు దాగుంటాయి. అవేవీ తన బిడ్డలకు కనిపించనీయడు. తన పిల్లల కోసం నిత్యం పరితపిస్తూ, తనలాగా తన పిల్లలు ఇబ్బందులకు గురి కావొద్దని ఆకాంక్షించే నిస్వార్థపరుడు. పరిస్థితులు నాన్నని ఎంత క్షోభకి గురిచేసినప్పటికీ, తన పిల్లలకు మంచి భవిష్యత్ ఇయ్యాలనే కలలు కంటూ, మదన పడుతూ ఉంటాడు.

కొన్నింటిని అందరికీ చెప్పలేం/ దాచి దాచి లోలోపల/ కుమిలి పోతాం/ కొన్నింటిని కొంచెం కొంచెం అచేతనంలోకి నెట్టేయాలి/ విడవని బంక లాంటి ఊసుల్ని/ తీగలు తీగలుగా తొలగించాలి మరి/ అవును!/ జ్ఞాపకాలు తొరగా ఆరాలంటే/ వ్యాపకాల వింజామరతో విసరాలి.

మనసులో గూడుకట్టుకున్న అనేకానేక విషయాల్ని అందరితో పంచుకోలేం. అశ్రువులు నిండిన నయనాలు చూసి హేళన చేస్తారనో, లోకువైపోతామనో లోలోనే కుమిలిపోతాం. వాటిని ఏదొక వ్యాపకంతో కొద్దీ కొద్దిగా వదిలించుకోవాలి. అప్పుడే మనసు తేలికవుతుంది. కవిత్వం చాలామంది రాస్తారు, కానీ అనుభవాన్ని రంగరించి అలవోకగా అర్థమయ్యే విధంగా కొందరే రాస్తారు. అలాంటి కోవకే చెందిన కవి రాజేశ్వరరావు. ఊహించని విధంగా సూక్ష్మ దృష్టితో ఆలోచించి, తనదైన శైలిలో కవిత్వాన్ని అక్షరీకరిస్తాడు. ఈ కవి నుండి మరెన్నో అద్భుతమైన రచనలు రావాలని సాహిత్య అభినందనలు తెలియజేస్తూ...

కె.శివారెడ్డి కవిత్వస్ఫూర్తి పురస్కారం-2024

కె.శివారెడ్డిగారి పేరిట స్ఫూర్తి పురస్కారాల కోసం 35 సంవత్సరాల లోపు కవుల నుండి 2023 సంవత్సరంలో ముద్రితమైన కవితాసంపుటాలను ఆహ్వానిస్తున్నారు. మూడు ప్రతులను జులై 10వ తేదీలోపు ఇబ్రహీం నిర్గుణ్, 15.5.112/1/బి, స్కైలైన్ టవర్స్ ఎదురుగా, చైతన్యనగర్, ఖమ్మం-507002, తెలంగాణ చిరునామాకు పంపాలి. వివరాలకు: 9063696968.

పాలపిట్ట దాశరథి శతజయంతి సంచిక కోసం...

జులై 22న దాశరథి కష్ణమాచార్యులు శతజయంతి సంవత్సరం ఆరంభ సందర్భంగా సాహిత్యం, సంగీతం, నాటకం, సినిమా మొదలైన అన్ని రంగాలలో దాశరథికి సంబంధించిన ప్రతి అంశాన్ని రికార్డు చేయాలని పాలపిట్ట భావిస్తున్నది. దాశరథి కష్ణమాచార్యులతో సాహిత్య సంబంధం గలవారు, వారితో తాము పాల్గొన్న, కలిసి దిగిన ఫొటోలను, వారు రాసిన ఉత్తరాలను, దాశరథి తొలినాళ్ళ పుస్తకాల కవర్ పేజీలను పంపించవలసిందిగా కోరుతున్నారు. రచనలు, సూచనలు, ఫొటోలు పంపించవలసిన చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044. వివరాలకు : 9490099327.

గీతమ్ పురస్కారం కొరకు...

గీతమ్ సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ కథా సంపుటాల పోటీ నిర్వహించి గీతమ్ పురస్కారం నిర్వహిస్తున్నారు. పోటీ కొరకు 2016 - 2024 మధ్య కాలంలోని సంపుటాలను జులై 5 లోపు మూడు కాపీలను ఓలేటి వెంకటేశ్వర రావు, అధ్యక్షులు, గీతమ్ సాహితీ సంస్థ, పిఠాపురం - 533450 చిరునామాకు పంపాలి.

శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు - 2023

శివేగారి దేవమ్మ కథా పురస్కారాల కొరకు 2022, 2023 లో ప్రచురించిన కథా సంపుటాలు, బాలల కథా సంపూటాల పురస్కారాల ఫలితాలు వెలువరించారు. మునిసురేష్ పిళ్లె (గారడీ వాడు), కుసుమంచి నాగేంద్ర (చందమామలో మేనమామ), ఆర్.సి. కష్ణస్వామి రాజు (కార్వేటినగరం) రచించిన కథా సంపుటాలు ఎంపిక అయ్యాయి. - కె.వి. మేఘనాథ్ రెడ్డి, 6300318230

ఏడు రంగుల జండా పుస్తకావిష్కరణ

ఈ నెల 13 వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో అమరవాది నీరజ రచించిన 'ఏడు రంగుల జండా' పుస్తకావిష్కరణ జరుగుతుంది. భాషా సాంస్కృతిక శాఖ, అమరవాది ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఆచార్య సి.మృణాళినికి శ్రీమతి అమరవాది హైమవతీ- డా.ఎ.సి.ఎం.ఎల్.ప్రసాద్ సాహిత్య పురస్కారం, గరిపెల్ల అశోక్‌కి డా॥ఎ.సి.ఎం.ఎల్.ప్రసాద్-శ్రీమతి హైమవతి బాలసాహిత్య పురస్కారం అందజేస్తారు. ఈ సభలో మణికొండ వేదకుమార్, డా॥పత్తిపాక మోహన్, డా॥జుర్రు చెన్నయ్య, చొక్కాపు వెంకటరమణ పాల్గొంటారు.

నవతెలంగాణ
నమస్త తెలుగు దినపత్రిక
కరీంనగర్
సోమవారం జూన్ 10, 2024 www.navatelangana.com

తెలంగాణ బార్ అసోసియేషన్ సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పివి.రాజ్‌కుమార్




నవతెలంగాణ - భగత్‌నగర్

తెలంగాణ బార్ అసోసియేషన్ సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పివి.రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఆదివారం రంగారెడ్డి బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో తాజా మాజీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడుగా రంగారెడ్డి బార్ అసోసియేషన్ వై.కొండల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పివి.రాజ్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా రాజ్యవర్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పివి.రాజ్ కుమార్ మాట్లాడుతూ నూతన కార్యవర్గంతో కలిసి న్యాయవాదుల సంక్షేమానికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో 33 జిల్లాల బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ నుంచి కేంద్ర మంత్రిగా..

- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు మంత్రి పదవి
- సర్వత్రా హర్షాతిరేకాలు
- కార్యకర్తల సంబరాలు







నవతెలంగాణ - కరీంనగర్

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కేంద్ర మంత్రి పదవి దక్కడంపట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బండి సంజయ్‌ను తెలంగాణ దళపతిగా పిలుచుకునే బీజేపీ కార్యకర్తల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. సామాన్య కార్యకర్తకు దక్కిన గౌరవంగా వారు భావిస్తున్నారు. పార్టీలో కార్యకర్తగా చేరింది మొదలు ఏ పదవిలో ఉన్నా.. నిరంతరం ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేయడమే లక్ష్యంగా పనిచేసిన బండి సంజయ్‌కు మంత్రి పదవి లభించడం, కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి కావడం విశేషం. సంజయ్‌కి సామాన్య కార్యకర్త నుంచి కార్పొరేటర్ నుంచి ఎంపీగా కేంద్ర మంత్రి పదవి లభించడంపట్ల కరీంనగర్ పార్లమెంట్ ప్రజల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయి.

16వందల కిలోమీటర్లకు పైగా ప్రజాసంగ్రామయాత్ర..

ప్రజాసంగ్రామ యాత్రతో 16వందల కిలోమీటర్లకుపైగా పాదయాత్ర చేసి కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచారని, కేసీఆర్ పాలన అంతానికి బండి సంజయ్ పాదయాత్రతోనే అడుగులు పడ్డాయని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో పట్టణాలకే పరిమితమైన బీజేపీని మారుమూల పల్లెల్లోకి విస్తరింపజేయడంలో బండి సంజయ్ ప్రత్యేకత. సంజయ్ రైతుల పక్షాన అనేక దీక్షలు చేపట్టారు. నిరుద్యోగ మార్చ్ పేరుతో జిల్లాల వారీగా నిరసన కార్యక్రమాలతో నిరుద్యోగుల పక్షాన పోరాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీ ఎంపీగా కొనసాగుతూ ప్రజా సమస్యలపై పోరాడి రెండుసార్లు జైలుకు వెళ్లారు. ప్రజల కోసం, కార్యకర్తల కోసం కొట్లాడి అత్యధిక కేసులు ఎదుర్కొంటున్న ఎంపీ కూడా బండి సంజయ్ మాత్రమే కావడం గమనార్హం. అట్లాంటి వ్యక్తికి కేంద్ర మంత్రి పదవి రావడంతో కార్యకర్తల భావోద్వేగంతో ఉప్పొంగిపోతున్నారు.

కార్పొరేటర్ నుండి కేంద్రమంత్రిగా..

కరీంనగర్‌లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన బండి సంజయ్ సామాన్య బీజేపీ కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. రెండు సార్లు కార్పొరేటర్‌గా గెలిచిన బండి సంజయ్ మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 89వేలకుపైగా ఓట్ల మెజారిటీతో ఎంపీగా గెలిచారు. ఆ తరువాత బీజేపీ రాష్ట్ర పగ్గాలు చేపట్టారు. రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తప్పించాక జాతీయ ప్రధాన కార్యదర్శి వంటి ఉన్నత పదవిని కట్టబెట్టినప్పటికీ కార్యకర్తల్లో అసంతృప్తి తగ్గలేదు. అందుకే బండి సంజయ్ కు కేంద్ర మంత్రి పదవి దక్కగానే బీజేపీలో కష్టపడే కార్యకర్తలంతా తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. సంబురాలు చేసుకుంటున్నారు.

నీట్ ఫలితాలపై విచారణ చేపట్టాలి

డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి

నవతెలంగాణ - కరీంనగర్

నీట్ పరీక్ష 2024 ఫలితాలు, నీట్ పరీక్ష నిర్వహణపై విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున సమగ్ర విచారణ నిర్వహించి, విద్యార్థులందరికీ న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్‌లోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు డి.నరేష్ పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై దేశ వ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నవి అన్నారు. ఎన్టీఏ పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగువిధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రం గల ఒకే సీరియల్ నంబర్లతో కూడి ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని, లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు అని తెలిపారు. దేశ వ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితంతో ముడిపడి ఉన్న అంశం కనుక నీట్ పరీక్షల నిర్వహణ, ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఎన్టీఏ గతంలో నిర్వహించిన వివిధ రకాల పరీక్షల ఫలితాల నిర్వహణపై కూడా విచారణ జరగడం అవసరం అని, కనుక నీట్ పరీక్షల ఫలితాలపై అనేక గందరగోళాలు, అనుమానాలు అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నందున పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, దీనికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జి.లక్పతి నాయక్, భాస్కర్, రఘుపతి, నాయకులు అజయ్, రవీందర్, రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ఎస్సీ కాలనీ..





నవతెలంగాణ తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట ఎస్సీ కాలనీలో అంధకారం నెలకొంది. నెల రోజులుగా వీధిలైట్లు పనిచేయక పోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట నుంచి బయటికి రావాలంటే నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై గ్రామపంచాయతీ కార్యదర్శికి, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం ఉన్నప్పుడు వీధిలైట్లు సక్రమంగా వెలిగేవని.. ఇప్పుడు నెల రోజులైనా పట్టించుకోవడం వారే కరువయ్యాడని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో వీధిలైట్లు వేయించి, డ్రైనేజీలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ - గన్నేరువరం

మానకొండూరు శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ లింగాల మల్లారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, రాజకీయంగా ఉన్నత పదవులు అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి బొడ్డు సునీల్, కాంగ్రెస్ నాయకులు న్యాలపట్ల కనకయ్య, సుధగోని మల్లేశంగౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, తాళ్లపల్లి రవిగౌడ్, లింగంపల్లి హరీష్, బేతెల్లి రాజేందర్‌రెడ్డి, గొంటి సంతోష్, దుడ్డు మల్లేశం, ముసుకు కరుణాకర్‌రెడ్డి, వంగల సత్యనారాయణరెడ్డి, జంగిడి ప్రకాష్, బద్దం సంపత్‌రెడ్డి, పరిపూర్ణాచారి, సింగిరెడ్డి లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

కేశవపట్నంలో ఘనంగా పోచమ్మ బోనాలు



నవతెలంగాణ - శంకరపట్నం

శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనం తయారుచేసి పోచమ్మ గుడికి ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



ఐఐటీ అడ్వాన్స్ ఫలితాలలో అల్ఫోర్స్ అద్భుత విజయం





నవతెలంగాణ - కరీంనగర్

ఐఐటీ అడ్వాన్స్ 2024 ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయస్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థలు చైర్మెన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎం.హర్షిత్ 64వ ర్యాంకు సాధించగా, జి.శ్రీహాస్ 290, బి.భరద్వాజ్ 396, ఆర్.పునీత్ మనోహర్ 477. సుబోద్ చౌదరి 545. ఎ.శివవరుణ్ 557. పి.రాహుల్ 571. దేవదత్త 151, విశాల్‌రెడ్డి 838, డి.రిశ్వంత్ కుమార్ 1029, పి.మనోహర్ 1229, నిహాల్ 1379, ఆదిత్య వర్ధన్‌రావు 1523, లహరి 1609, అరుణ్ కుమార్ 1658, బి.అభినవ్ సిద్దార్థరెడ్డి 1851, సత్య అమూల్య 1933 ర్యాంకులు సాధించారని తెలిపారు. 1,000లోపు 9మంది విద్యార్థులు, 2,000లోపు 17 మంది విద్యార్థులు, 5,000లోపు 32 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం విశేషం. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అహర్నిష కృషి ఇంతటి ఘన విజయానికి తోడ్పడ్డాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

బీఆర్ఎస్ నుంచి సస్పెండ్..

నవతెలంగాణ - కరీంనగర్

పార్టీ క్రమశిక్షణా రాహిత్య చర్యలో భాగంగా ఆదివారం కరీంనగర్ 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్ జీత్ కౌర్‌ని, ఆమె భర్త సోహన్ సింగ్‌ని, సుడా మాజీ అడ్వైజరీ కమిటీ సభ్యుడు,నాయకులు కామరపు శ్యామ్‌ను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కార్పొరేటర్ కమల్ జీత్ కౌర్, సోహన్ సింగ్ చేసే కార్యకలాపాలు పార్టీకి తీవ్రంగా నష్టం వాటిల్లుతున్నవని, గతంలో జిల్లా పార్టీ నుంచి షోకాజ్ నోటీసు ఇచ్చినప్పటికీ వారి తీరు పార్టీ పట్ల మారలేదని కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణారావు తెలిపారు. ఇటీవల పత్రికా సమావేశంలో మాట్లాడిన తీరు, బాధ్యత గల స్థానంలో ఉన్న నాయకుని పట్ల మాట్లాడిన అంశాలను, కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి డిపాజిట్ వచ్చినప్పటికీ రాలేదని పత్రిక సమావేశంలో తప్పుడు సమాచారం ఇవ్వడం లాంటి అంశాలను జిల్లా పార్టీ చాలా సీరియస్‌గా పరిశీలించి, వారు ఉద్దేశపూర్వంగానే పార్టీకి నష్టం వాటిల్లేలా వారి ప్రవర్తన ఉంది కనుక ఇరువురిని పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు. కామారపు శ్యామ్ సుడా డైరెక్టర్ అయి ఉండి కూడా పార్టీ నుంచి ఎలాంటి లబ్ది పొందలేదని, బీఆర్ఎస్ పార్టీ మీటింగ్‌లో మాట్లాడి, పదే పదే జిల్లా అధ్యక్షుడి ఆడియో రికార్డింగ్లను గ్రూపులలో పెట్టి పార్టీ యొక్క ప్రతిష్టతను దెబ్బతీసేలా ప్రవర్తించినందుకు, క్రమశిక్షణా చర్యలకు పాల్పడినందున కమల్ జీత్ కౌర్, సోహం సింగ్, కామరాపు శ్యామ్ వీరి ముగ్గురుని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిపారు. వీరికి పార్టీతో ఎలాంటి సంబంధం లేదు అన్నారు.

స్పందన అనాథ అశ్రమంలో బెడ్‌షీట్‌లు పంపిణీ



నవతెలంగాణ - కరీంనగర్

సీఎస్ఆర్ మాన్‌కైండ్ ఫార్మా కంపెనీ సౌజన్యంతో స్పందన యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వారు ఆదివారం రామడుగు మండలం వెలిచాల గ్రామంలోని స్పందన అనాథా అశ్రమ వృద్దులకు బెడ్‌షీట్‌లతో పాటు పిల్లో కిట్‌లను ప్రముఖ వైద్యుడు డాక్టర్ రఘురామన్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వారు నిరుపేదలకు సేవలు అందించడం అభినందనీయం అన్నారు. ప్రతి ఒక్కరు సేవా గుణం కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్పందన యువసేన స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ - జమ్మికుంట

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం స్థానిక గాంధీ చౌరస్తాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో దహనం చేసి నిరసన తెలిపారు. పొన్నంపై మాట్లాడిన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే నియోజకవర్గంలో తిరగనియ్యబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిని రవి, మహమ్మద్ సజ్జు, రాచపల్లి రమేష్, బిట్ల మోహన్, తోట స్వప్న, పొన్నగంటి రవి, కుమార్ గౌడ్, భాస్కర్, దేవేంద్ర చారి, ఏబూసి ఓదెలు, రాజ కొమురయ్య, పొన్నగంటి కుమార్, పొన్నగంటి విష్ణువర్ధన్, సతీష్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు హెచ్‌ఎంగా ప్రమోషన్లు ఇవ్వాలి

డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి

గతంలో నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్‌ను ఆహ్వానిస్తూ సుదీర్ఘ సేవా కాలం ఉన్నప్పటికీ ఎస్జీటీ ఉపాధ్యాయులకు అవకాశం సన్నగిల్లిన సందర్భంలో గత ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం 5000 ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పోస్టులకు మరో 5000 పోస్టులు కలిపి మొత్తం 10000 ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పోస్టులకు ఈ షెడ్యూల్‌లోనే ప్రమోషన్లు కల్పించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కరీంనగర్‌లోని స్థానిక డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో డీటీఎఫ కరీంనగర్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పాఠశాల విద్యారంగాన్ని, ఉపాధ్యాయుల సమస్యలు.పట్టించుకోకపోవడం వల్ల ఉపాధ్యాయవర్గం తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనయ్యిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిలిచి పోయిన బదిలీలల, పదోన్నతుల షెడ్యూల్లోనే గత ప్రభుత్వం ఎస్జీటీల పదోన్నతుల అవకాశం పెంచడానికి ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎమ్ పోస్ట్ లను 10 వేలకు పెంచి పదోన్నతులు ఇస్తామని అసెంబ్లీలో ప్రకటించారని, ఆ మేరకు ఆ పోస్టులు కూడా కలిపి ఈ షెడ్యూల్ లోనే పదోన్నతులు ఇవ్వాలన్నారు. అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్స్, డైట్ లెక్చరర్స్ పదోన్నతులకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల్లో ఒకటి కంటే ఎక్కువ సబ్జెక్టులకు అర్హతలున్న సందర్భంలో అన్నింటికీ అవకాశం ఇవ్వాలని ముందే ఒకే సబ్జెక్టు కోసం ఆప్షన్ ఇవ్వాలనే నిబంధన ఉండకూడదని, ఆ మేరకు డీఇఓలకు మార్గదర్శకాలు జారీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.రఘుశంకర్ రెడ్డి మాట్లాడుతూ..పాఠశాల విద్యారంగ సంక్షోభం ఎదుర్కోవడంలో ఉపాధ్యాయులే ముఖ్య పాత్ర వహించాలని, నిబద్ధతతో పనిచేయడం, తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని కల్పించడం ద్వారా విద్యార్థుల సంఖ్య పెంచుకోవడం వలనే పాఠశాలలు కాపాడుకోవచ్చని సూచించారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి మాట్లాడుతూ..ఇటీవల కరీంనగర్ జిల్లాలో వేసవి సెలవుల్లో ఇద్దరు ఉపాధ్యాయులను వారి తప్పేమి లేకున్నా సస్పెండ్ చేయబడిన ఉపాధ్యాయులను తక్షణమే రీ ఇన్ స్టేట్ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి మాట్లాడుతూ..అన్ని పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, అన్ని పాఠశాలల్లో స్వీపర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఉన్నత పాఠశాలల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని, ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్ రెడ్డి, డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం.రఘుశంకర్ రెడ్డి, కె.నారాయణ రెడ్డి, రాష్ట్ర పూర్వ ఆడిట్ కమిటీ కన్వీనర్ డి.ఏసురెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు కె.రాజమౌళి, జిల్లా కార్యదర్శులు ఏ.దామోదర్, సీహెచ్.రాంమోహన్, ఎస్.అంజయ్య ఏ.శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్లు సదానందం, రమేష్, నర్సయ్య, రాంకిరణ్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.సంపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

నవతెలంగాణ - కరీంనగర్ / తిమ్మాపూర్





కరీంనగర్ జిల్లాలో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నోడల్ ఆఫీసర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఆదివారం కరీంనగర్ జిల్లా రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి, జ్యోతిష్మతి, తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలల్లో, కరీంనగర్‌లోని వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల, పారమిత స్కూల్‌లో జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. పరీక్షకు సంబంధించిన వివరాలు, సౌకర్యాల కల్పనపై అధికారులను నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులంతా టీజీపీఎస్సీ రూపొందించిన నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. అభ్యర్థుల ఫోటో వెరిఫికేషన్ సరిగా చేయాలని, హాల్ టికెట్‌పై ఫోటోలు సరిగా లేని వారి నుంచి మూడు పాస్ ఫోటోలు తీసుకోవాలన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని ఎట్టి పరిస్థితిలో అనుమతించ వద్దని సూచించారు. పరీక్ష పారదర్శకంగా జరిగేందుకు, నిరంతరం పర్యవేక్షించేందుకు పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు ఏర్పాటు చేశామని చెప్పారు. కరీంనగర్ జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా సజావుగా సాగిందన్నారు. బయోమెట్రిక్, సెంటర్ల వారీగా కేటాయించిన సిబ్బంది హాజరు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 36 మంది డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, 36 మంది అబ్జర్వర్లు, ఏడుగురు రూట్ ఆఫీసర్లు, ఏడుగురు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 208 ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. 18663 మంది గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 14577 మంది హాజరు కాగా 4086 మంది గైర్హాజరైనట్లుగా తెలిపారు. ఆదివారం ఉదయం కరీంనగర్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన ఓఎంఆర్ సీట్లు, ప్రశ్నాపత్రాలు ఇతర సామాగ్రిని ఆయా పరీక్ష కేంద్రాలకు తగిన పోలీస్ భద్రత మధ్య తరలించామని తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా సాగేలా సహకరించిన అధికారులు, సిబ్బంది, పోలీసు అధికారులకు అదనపు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.



నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

జగిత్యాల

సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com

ప్రమాదకరంగా మూల మలుపు

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండల కేంద్రం నుంచి భీమారం మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో వరద కాలువకు ప్రక్కన రెండు వరస రహదారులు ప్రమాదకరంగా మారింది. ఇటీవల వల్లంపల్లి సొసైటీ పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి బస్తాలను లారీలో తరలిస్తుండగా మూల మలుపు వద్ద ఎలాంటి సూచిక బోర్డు, రక్షణ గోడలు లేక పోవడంతో లారీ బోల్తా పడింది. అంతే కాకుండా గతంలో పలు వాహనాలు ప్రమాదాలు జరిగిన దాఖలాలు ఉన్నాయి. సంబంధిత జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక చొరవ చూపి ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయా మండల ప్రజలు కోరుచున్నారు.



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

క్రికెట్ టోర్నీ విజేతగా తొంబరావుపేట



కప్పు అందజేస్తున్న మండల అధ్యక్షుడు

నవతెలంగాణ-మేడిపల్లి

మండలంలోని కట్లకుంట గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా తొంబరావుపేట నిలిచింది. ఈ క్రికెట్ టోర్నీని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. తొంబరావుపేట జట్టు విన్నర్‌గా, మేడిపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల అధ్యక్షుడు ఏనుగు రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జలంధర్ రెడ్డి విన్నర్ టీంకు కప్పుతో పాటు రూ.10 వేల నగదు, రన్నర్ టీంకు కప్‌తో పాటు రూ.5 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మేడిపల్లి మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నోముల నరసింహారెడ్డి, చేపూరి నాగరాజు, మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మాదం వినోద్, మేడిపల్లి ఫ్యాక్స్ డైరెక్టర్ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నూతిపెల్లి శంకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాత

నవతెలంగాణ-పెగడపల్లి



మృతి చెందిన గేదె

మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన ముంజ తిరుపతిగౌడ్‌కు చెందిన గేదె ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఆదివారం మృతి చెందింది. గ్రామ సమీపంలోని ఎల్లమ్మ గుడి వద్ద మేతకు వెళ్లిన గేదె ట్రాన్స్ ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ఎర్త్ వైర్ తగిలి షాక్‌తో మృత్యువాత పడింది. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని రైతు తిరుపతి గౌడ్ కోరారు.

చేప ప్రసాదం వల్ల ఆస్తమా(ఉబ్బసం)నయంకాదు

భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్

నవతెలంగాణ- పెగడపల్లి



చేప ప్రసాదం వల్ల ఆస్తమా ఉబ్బసం నయం కాదని వెంటనే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ 5 గ్రౌండ్‌లో బత్తిన సోదరులు వేస్తున్న చేప ప్రసాదం పేరుతో ఆస్తమా (ఉబ్బసం) వ్యాధి నయం చేస్తామని ఇస్తున్న ప్రసాదంలో ఎటువంటి శాస్త్రీయత లేదన్నారు. దీనిని నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు.

జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట భద్రత



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతగా ఎలాంటి సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమినరీ వ్రాత పరీక్షకు 7692 మంది అభ్యర్థులు 22 పరీక్ష కేంద్రాల్లో పరీక్షకు హాజరు కావడం జరుగుతుందని, సుదూర ప్రాంతాల నుండి పరీక్ష వ్రాసేందుకు వచ్చిన అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సరైన సమయంలో చేరుకోనేందుకుగాను జిల్లా పోలీసుల అధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని ఇతర శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరీక్షను ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసు కున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట అదనపుఎస్పీ వినోద్ కుమార్, డిఎస్పీ రఘు చందర్, టౌన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ ఉన్నారు.

శాంతినికేతన్ స్కూల్ పూర్వ విద్యార్థినికి ఘన సన్మానం



పూర్వ విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఆల్ ఇండియా నీట్ ఫలితాలలో గోదురు గ్రామానికి చెందిన తేలుకంటి సుష్మ 540 మార్కులతో మెడికల్‌లో సీటు సాధించింది. అక్షర జ్ఞానం నేర్పిన శాంతినికేతన్ స్కూల్ యాజమాన్యానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన సుష్మను గ్రామ ప్రజలు పెద్దలు ఘనంగా సన్మానించారు. విద్యార్థిని శాంతినికేతన్ స్కూల్ కరస్పాండెంట్ భూరం నారాయణను అభినందించారు. ఈ కార్యక్రమంలో వీడిసి అధ్యక్షుడు ఓంకారి లక్ష్మణ్, సభ్యులు మాజీ ఎంపీపీ అడ్వకేట్ కోటగిరి వెంకటస్వామి, ఎంపీపీ జాజాల భీమేశ్వరి జగన్‌రావు, సినీ నటులు గోదూరి మురళి పాల్గొన్నారు.

గంగానాల ఆయకట్టు గేట్లకు మరమ్మతులు



గంగానాల ప్రాజెక్ట్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడ కుండా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గంగానాల ఆయకట్టు గేట్ల మరమ్మతులు చేపట్టారు. గేట్ల మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గంగనాల ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతం రైతులు ఇబ్బందులు పడొద్దని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ముందుకొచ్చి మరమ్మతులు చేయించారు. వేములకుర్తి గ్రామ సమీపంలోని గోదావరి నది తీరంపై గంగనాల ఆయకట్టు 1959 సంవత్సరంలో శంకుస్థాపన చేశారు. మండలంలోని వేములకుర్తి, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, మల్లాపూర్ మండలంలోని నడికుట, మొగిలిపెట్, ఓబులపూర్, సంగెం శ్రీరాంపూర్, దాంరాజు పల్లి గ్రామాలలోని ఆయకట్టు ప్రాంతాలకు సుమారు నాలుగువేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రాజెక్టు కాలువ క్రింద ప్రతి సవత్సరం ఖరీఫ్, రబీ కాలాలలో రెండు పంటలు పండుతాయి. ప్రస్తుతం మాటుకాలువ గేట్లు తుప్పు పట్టి నీరు గోదావరిలో కలుస్తుంది. సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు ఆయకట్టు రైతులు విన్నవించినా ఫలితం లేదు. రానున్న వర్షాకాలంలో రైతులు పంటలు వేసేందుకు దుక్కులు దున్నుతున్న నేపథ్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ రైతులు ఇబ్బంది పడద్దని గేట్లకు మరమ్మతులు చేయించింది.



పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అసోసి యేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో జిల్లాల అసోసియేషన్ ప్రతినిధులు పెన్షనర్ల వివిధ సమస్యలను పరిష్కరించాలని శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్.శాంతి కుమారి, సిఎంఓ. కార్యదర్శి శేషాద్రి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులకు ,పెన్షనర్లకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, జూలై తర్వాత మరో డీఏ కూడా కలిస్తే ఐదవుతాయని, ఆర్థిక పరమైన అంశాలు, ఆర్థికేతర అంశాలను పరిశీలించి ఆర్థికేతర అంశాలను వెంటనే పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఆర్థిక పరమైన అంశాల్లో పెండింగ్ డీఏలు, మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లుల సత్వర పరిష్కారం, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు, పీఆర్‌సి. ఆలస్యం అయితే మధ్యంతర భృతి పెంచడం, తదితర పెన్షనర్ల ప్రయోజన అంశాలపై సీ.ఎస్, సీ.ఎం.ఓ.లతో చర్చించామన్నారు. అన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, సహాయ అధ్యక్షుడు పిసి.హన్మంత రెడ్డి, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు వి.ప్రకాష్‌రావు, ఎండి యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పి.అశోక్‌రావు, సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 3112 కేసుల పరిష్కారం

జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



రాజీ పడదగిన కేసుల్లో ఉన్నవారు రాజీమార్గం ద్వారానే పరిష్కరించు కోవడమే మంచిదని, సమయం వృథా కాదని కక్షలు, కారుణ్యాలు తగ్గు తాయని తద్వారా స్నేహభావం పెంపొందుతుందని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. కోర్టులో కేసులు వేసి ఇబ్బందులకు గురయ్యే వారికి సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. శనివారం కోర్టులో నిర్వహించిన జాతీయ మెగాలోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో ఉన్న రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పకడ్బందీగా వ్యవహరించి నిందితులు, కక్షిదారులకు సమాచారం అందించి వారికి అవగాహన కల్పించి లోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో 3112 కేసులు పరిష్కరించడం జరిగిందని అన్నారు. ఇందులో డ్రంకెన్ డ్రైవ్‌కు సంబంధించి 1894 కేసులో ఉన్నవారికి కోర్టు వారు మొదటి తప్పుగా బావించి జరిమానాలు విధించడం జరిగిందన్నారు. మద్యం సేవించి వాహనం నడిపి మరోసారి పట్టుబడినట్లైతే వారికి జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. 538 ఈ- పెట్టి కేసులు, 680 ఐపిసి కేసులు జిల్లా వ్యాప్తంగా వివిధ సెక్షన్ల కింద నమోదు అయిన మొత్తం కేసులు 3112 కేసులు పరిష్కారించినట్టు తెలిపారు. గతంలో ఎప్పుడు లేని విధంగా కేసులను పరిష్కరించడంలో చక్కగా వ్యవహరించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కళాధార పబ్లిక్ స్కూల్ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-కథలాపూర్

కథలాపూర్ మండల కేంద్రంలో కళాధార పబ్లిక్ స్కూల్‌ను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, స్కూల్ చైర్మన్ గడ్డం భూమారెడ్డి, డైరెక్టర్ దివాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేంద్ర శర్మ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంత మంచి సువిశాలమైన వాతావరణంలో పాఠశాలను నెలకొల్పడం అభినందనీయం అన్నారు. నాణ్యమైన విద్య ఇప్పుడు కథలాపూర్‌లో అందించడం చాలా శుభపరిణామమని, దీన్ని విద్యార్థులు చక్కగా అందిపుచ్చుకోవాలన్నారు. ఎంతో మంది ఇంగ్లీష్ భాష పట్ల ప్రావీణ్యత లేకపోవడం అలాగే కమ్యూనికేషన్ స్కిల్స్ పైన అవగాహనా లేకపోవడం వల్ల చాలా వరకు వెనకబడి పోతున్నారు. పాఠశాల యాజమాన్యం లాభాపేక్షతో కాకుండా అర్హులైన నిరుపేద విద్యార్థులకు ఉచిత బోధన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పారమిత స్కూల్ అధినేత ప్రసాద్‌రావు, కర్నాకర్, జడ్పీటీసీ నాగం భూమయ్య, గడ్డం భూమారెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాయితీ నాగరాజు,శీలం వేణు, రాచమడుగు వెంకటేశ్వర్ రావు, పులి హరిప్రసాద్, పిడుగు గుణాకర్‌రెడ్డి, అంజయ్య, దేవారెడ్డి, సత్య నారాయణ, లింగారావు, వెల్చాల సత్యనారాయణ, వెంకటేశ్వర్ రావు, సంతోష్ పాల్గొన్నారు.



జిల్లా మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలో బీ.ఎల్.ఎస్.ఎల్ గార్డెన్స్‌లో ఆదివారం జిల్లా మున్నూరు కాపు సంఘం ప్రమాణ స్వీకారాన్ని ఘనంగా నిర్వహించారు. మున్నూరు కాపు కార్యవర్గ ప్రమాణ స్వీకారం, ఆత్మీయ సమ్మేళనంలో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల జిల్లా జెడ్పి చైర్పర్సన్ దావ వసంత, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జగిత్యాల మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వొద్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి చిట్ల రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లాపూర్ బీడీ టేకేదార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-మల్లాపూర్

మండల కేంద్రంలో స్థానిక వెంకటేశ్వరస్వామి టెంపుల్ వద్ద జరిగిన మల్లాపూర్ ఎస్‌జె, ఎస్పీ ఫ్యామిలీ ట్రస్ట్ బీడీ టేకేదార్ల సమావేశంలో బీడీ టేకేదార్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ అధ్యక్షుడిగా మిట్టపెల్లి దివాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సిరిపురపు భూమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా జిందం సత్యనారాయణ, కోశాధికారిగా సిరిపురపు ఆనంద్, ప్రధాన కార్యదర్శులుగా సిరిపురపు రాజేష్ కుమార్,ఎలిశెట్టి లింగేశ్వర్, ప్రచార కార్యదర్శిగా సంకె వివేక్‌లను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ.. బీడీ టేకేదార్లకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ గ్రామ టేకేదార్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణానికి చెందిన సిరిసిల్ల శ్రీనివాస్ సమీప బంధువు రిటైర్డ్ ఉపాధ్యాయుడు రుద్రంగి ప్రభాకర్ శర్మ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శించారు. అనంతరం జగిత్యాల పట్టణ మాజీ కౌన్సిలర్ హరీష్ భార్య పద్మ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట వెంట వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అంజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్



దర్శనం చేసుకుంటన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

నవతెలంగాణ-మల్యాల

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం విచ్చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ..కొండగట్టు ఆంజనేయ స్వామి వారిని దర్శించు కోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామి వారి దేవాలయన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జితేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి చల్మెడ పరామర్శ

నవతెలంగాణ-మేడిపల్లి



పరామర్శిస్తున్న చల్మెడ

మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గడిపెల్లి అంజయ్యగౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయలయ్యాయి. బాధితుడిని బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చెల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా జెడ్పి వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, ఉమ్మడి మేడిపల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కె .సత్తిరెడ్డి, భీమారం ఎంపీటీసీ పల్లి అర్జున్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు అజిత్‌రావు, సురేష్, రాజా గౌడ్ ,అభిలాష్, లక్ష్మీరాజం, రావు శ్రీనివాసరావు, ప్రభాకర్ రావు, మల్లేశం గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల మండలంలోని ధరూర్‌లో గల మౌంటెన్ కార్మల్ స్కూల్, జగిత్యాల పట్టణంలోని మానస పాఠశాల, నలంద డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఆల్ ఫోర్స్ జూనియర్ కాలేజ్, ఎస్.కె.ఎస్ ఆర్ బాయ్స్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలోని గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డిఓ పి.మధుసూదన్, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పద్మశాలి కమిటీ నియామకం

నవతెలంగాణ-మల్లాపూర్



నూతన కమిటీ సభ్యులు

మండల కేంద్రంలో శ్రీ శివ భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘ అధ్వర్యంలో నూతన అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా రుద్ర రమేష్ ,ఉపాధ్యక్షుడిగా సంబారి ప్రశాంత్, కోశాధికారిగా రుద్రరాజ్ కుమార్, దేవాలయ కమిటీ సభ్యులుగా తోట రవిని పద్మశాలి సంఘ సభ్యుల ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు రుద్ర రమేష్ మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని రాబోవు రోజుల్లో సంఘ సభ్యులను ఏకతటిగా నడుపిస్తూ పద్మశాలి కులాన్ని బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సంబారి శంకర్ ,మాజీ అధ్యక్షుడు రుద్ర లక్ష్మీరాజం, దేవాలయ కమిటీమాజీ సభ్యులు గుజ్జేటి నర్సయ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు నివాళులర్పించిన లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్



నివాళులర్పిస్తున్న శివ శ్రీనివాస్

నవతెలంగాణ-మల్లాపూర్

మండల కేంద్రంలో స్థానిక వాసవి మాత ఆలయంలో అక్షర యోధుడు రామోజీరావు చిత్రపటానికి లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్ ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో రీజన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, మండల సేవా సంఘాల గౌరవ అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్, శ్యాంసుందర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
రాజన్న సిరిసిల్ల
సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ - వేములవాడ రూరల్



వేములవాడ పట్టణంలోని జవహర్ లాల్ నెహ్రూ హై స్కూల్‌లో 2002-2003వ సంవత్సరంలో పదవతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. 21 సవంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరిం చుకుని, అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి, సత్కరించుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మెన్ నరహరిశర్మ, ఉపాధ్యాయులు జగన్మోహన్, వేణు, సూర్యప్రకాష్, రమేష్, శ్రీకాంత్, ఊర్మిళ, ఉమారాణి, విద్యార్థులు కీసరి అర్జున్, నేరెళ్ల మధు, సాగరం మహేష్, సురేష్, అయ్యప్ప, సాయి కృష్ణ, వంశీ, కర్ణ, మురళి, శిరీష, సాత్విక, అనుష, శ్రీనిత, స్వాతి, శ్వేత, శ్రావణి పాల్గొన్నారు.

కరీంనగర్ వాసికి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సిల్వర్ మెడల్

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కరీంనగర్‌కు చెందిన విద్యార్థిని సిల్వర్ మెడల్ సాధించారు. హన్మకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో కరీంనగర్ క్రీడాకారిణి సత్తా చాటింది. అండర్ 10 విభాగంలో లాంగ్ జంప్ కేటగిరిలో నూర్జైన్ అద్వితీయ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించారు.

ప్రయాణికులపై తేనే టీగల దాడి

రెండు గంటల పాటు జనం ఉక్కిరి బిక్కిరి

నవతెలంగాణ - చందుర్తి

రోడ్‌పై వెళ్తున్న వాహన దారులపై ఒక్కసారిగా తేనే టీగలు దాడి చేయగా వాహన దారులు ఉక్కిరి బిక్కిరై తలో దారి వైపుగా పరుగులు తీశారు. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రంలో భారత్ పెట్రోల్ బాంక్ వద్ద చోటుచేసుకుంది. దీంతో అక్కడే ఉన్న అజీమ్ అనే వ్యక్తి అప్రమత్తమై తన షాప్‌లోకి ప్రయాణికులకు ఆశ్రయం ఇవ్వడంతో తేనే టీగల దాడి నుంచి తప్పించుకున్నారు.

ప్రభుత్వం మారినా భూ సర్వేలు లేవు..

ఉమ్మడి జిల్లా రైతు నాయకుడు మెట్టు రామశర్మ

నవతెలంగాణ - ముస్తాబాద్

గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా భూమి సర్వే చేయించడానికి నిర్ణయించినట్టు తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూమి సర్వే చేయించడానికి నిధులు కేటాయిస్తున్నట్లు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినట్లు ఉమ్మడి జిల్లా రైతు నాయకుడు మెట్టు రామ శర్మ తెలిపారు.. ఆయన ముస్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఇద్దరూ ముఖ్యమంత్రులు మారినప్పటికీ ఇంతవరకు భూ సర్వే రాష్ట్రం వ్యాప్తంగా ఎక్కడా జరగలేదన్నారు. గ్రామాలలో భూ సమస్యలు పెరిగిపోతున్నాయని ధరణి పుణ్యమా అని ఒకరి పేరు మీద ఉన్న భూమి మరొకరి పేరు మీద రికార్డులలో ఉండడంతో రైతులు ఎంతో మనోవేదనకు గురవుతున్నారన్నారు. పాపం పేద రైతులకు రూల్స్ రెగ్యులేషన్స్ తెలియకపోవడంతో కార్యాలయాలు చుట్టు తిరుగుతూ ఎంతో బాధపడుతున్నారు. ఈ ప్రభుత్వమైనా పేద రైతులకు న్యాయం చేసేలా భూ సర్వేలను వెనువెంటనే చేపట్టాలని కోరారు.

మహిళలకు చేతినిండా పని

- యూనిఫామ్ దుస్తులు కుడుతున్న స్వశక్తి సంఘాల సభ్యులు
- 41,680 మంది విద్యార్థులకు డ్రెస్సులు
- 37 సంఘాలలో 520 మందికి పని
- వేసవిలో చేతినిండా ఉపాధి





నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ :

నిండు వేసవిలో మహిళలకు చేతినిండా పనిదొరుకుతోంది. ఇంట్లోనే యూనిఫామ్స్ కుడుతూ ఉపాధి పొందుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ దుస్తులు కుడుతూ ఎండాకాలంలో ఉపాధి పొందుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 41,680మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున 83,360 దుస్తులను 37స్వశక్తి సంఘాలకు చెందిన 520 మంది మహిళలు కుడుతున్నారు.

ఒకటి నుంచి ఇంటర్ వరకు..

ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులకు యూనిఫామ్ దుస్తులను ప్రభుత్వం అందజేస్తుంది. ప్రభుత్వమే వస్త్రాన్ని సరఫరా చేయగా.. నెల రోజుల క్రితం మహిళా సంఘాల్లోని సభ్యులు విద్యార్థుల కొలతలు తీసుకున్నారు. పొట్టి, పొడుగు లేకుండా సరైన కొలతలతో దుస్తులను అందించేందుకు డీఆర్డీఏ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. యూనిఫామ్ దుస్తులతో ఐకేపీ మహిళలు 19,550 మంది బాలురు. 22,130 మంది బాలికలకు యూనిఫామ్స్ సిద్ధం చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల దుస్తులు అందించనున్నారు.

రోజుకు పది డ్రెస్సులు..

ఒక్కో మహిళ రోజుకు పది నుంచి పన్నెండు డ్రెస్సులను కుడుతున్నారు. డ్రెస్సుకు రూ.50 కూలీ ప్రభుత్వం చెల్లిస్తోంది. అంటే ఒక మహిళ రోజుకు రూ.500 వరకు సంపాదించుకునే అవకాశం ఉంది. అయితే బట్టను కొలతల్లో ఒకచోట కత్తిరిస్తుండగా, కాజాలు, గుండీలు మరోచోట పెడుతున్నారు. ఈ లెక్కన స్వశక్తి మహిళలకు డ్రెస్సుకు రూ.40 వరకు వచ్చే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా ఒక్కో మండలంలో 20 నుంచి 40మంది వరకు మహిళలు పనిచేస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాల్టీల్లో మెప్మా ఆధ్వర్యంలో స్వశక్తి మహిళ లు యూనిఫామ్స్ కుడుతున్నారు. బాలురకు ప్యాంట్, షర్టు, బాలికలకు పంజాబీ డ్రెస్సులు అందజేయనున్నారు. 41,680 మంది విద్యార్థులకు దుస్తులు కొట్టడం ఇప్పటివరకు 35,848 దుస్తుల కుట్టు పని పూర్తయింది. వీటిలో 22,000 జతలు పాఠశాలలకు అందించాము.

కూలీ గిట్టుబాటు అవుతుంది.. : వాణి, నెహ్రూనగర్, సిరిసిల్ల



స్వశక్తి సంఘాల్లోని మహిళల్లో కుట్టు పని వచ్చే వారికి యూనిఫామ్స్ కుట్టే బాధ్యత అప్పగించారు. ఇప్పుడు యూనిఫామ్స్ కుడుతున్నాం. భవిష్యత్లో ప్రభుత్వ ఉద్యోగులు, పథకాలకు అవసమైన డ్రెస్సులు, ఇతర యూనిఫామ్ దుస్తుల పనులు అప్పగించాలి. ఇప్పుడైతే కూలీ గిట్టుబాటు అవుతుంది.

మహిళలకు మంచి ఉపాధి.. : రాజేశం, మెప్మా డీఎంసి, సిరిసిల్ల



స్వశక్తి సంఘాల మహిళలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రోజుకు కనీసం రూ.500 వచ్చేలా పనిని కల్పిస్తున్నారు. ఏ మండలానికి అవసరమైన యూనిఫామ్స్ అదే మండలంలో సిద్ధం చేశారు. పాఠశాలలు ప్రారంభమయ్యే లోపు డ్రెస్సులను సిద్ధం చేస్తాం.

70శాతం పూర్తి చేశాం.. : శేషాద్రి, డిఆర్డిఓ, రాజన్న సిరిసిల్ల జిల్లా



ప్రభుత్వం యూనిఫాం కుట్టు పనిని పూర్తిగా మహిళా సంఘాలకు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అనుభవమున్న మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేసి వారికి మండలాల వారీగా యూనిఫామ్ బట్టను అప్పగించాం. కుట్టుపని ఇప్పటికే చివరి దశకు చేరుకుంది. కొంతమంది పూర్తి చేసి పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. ఇప్పటికే 70 శాతం పని పూర్తి చేశాము. మరో రెండు మూడు రోజుల్లో దుస్తులను కుట్టడం పూర్తిచేసి పాఠశాలకు అందజేస్తాం.

మృతుడి కుటుంబానికి బియ్యం వితరణ



బియ్యం వితరణ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - ముస్తాబాద్

మండల కేంద్రానికి చెందిన కరికే నాంపల్లి ప్రమాదవశత్తు రోడ్డు ప్రమాదంలో వారం రోజుల క్రితం మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి , కూతురు మౌనిక ఉన్నారు. వారి ఆర్థిక పరిస్థితి దయనీయ స్థితిలో ఉన్నందున విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దీటి నర్సింలు ఆ కుటుంబానికి బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సద్ది మధు, మచ్చ కొండయ్య, ముక్క నర్సింలు, సుంచు శంకరి, నల్లబాలేశ్ల, పల్లటి రాజాం, బిస్కె, నాంపల్లి, మద్దికుంట రాజయ్య సారుగు రాకేష్, శీల బాను, మెంగని, వీవేక్, పాల్గొన్నారు.

బీడీ కార్మికుల వేతనాల పెంపుపై కార్మికుల సంబరాలు

నవతెలంగాణ - ముస్తాబాద్

బీడీ కార్మికులకు ప్యాకర్లకు, బట్టి,బీడీ టేకేదార్లకు,బీడీ కట్టలకు బుర్రలు పెట్టె,కార్మికులకు వేతనాలు పెంపుపై ముస్తాబాద్‌లోని దేశాయి, ఎంఎస్, లాంగర్, ఠాకూర్ సాదేకర్ బీడీ కార్మికులు సంతోషం వ్యక్తం చేసి సంబరాలను నిర్వహించుకున్నారు. అనంతరం ఒకరికి ఒకరు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలోతెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ,రాష్ట్ర అధ్యక్షులు, యస్, సిద్దిరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యం, ఆంజనేయులు,రాష్ట్ర పాధ్యక్షులు,బి,జగష్, పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన వలస జీవి మృతదేహం

నవతెలంగాణ - కొనరావుపేట

గంపెడాశలతో గల్ఫ్ దేశం వెళ్లిన వలస జీవి శవపేటికలో ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన విక్కుర్తి ఎల్లయ్య గౌడ్(45) అప్పులు తీర్చేందుకు ఆరు నెలల క్రితం కంపెనీ వీసాపై దుబాయ్ వెళ్ళాడు. జీతం తక్కువ ఉండడంతో అప్పులు తీరేలా లేవని తీవ్ర మనోవేదన గురై ఈనెల 4న రూమ్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతి చెందిన 5రోజులకు మృతదేహం ఆదివారం స్వగ్రామం చేరింది. మృతుడి కుటుంబ సభ్యులు శవపేటికపై పడి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుడికి భార్య రేణుక, కుమారుడు రేహ్వాన్ ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట పట్టణంలోని లయోలా పబ్లిక్ స్కూల్ 2004-05 సంవత్సరంలో పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం లయోలా పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించారు. 19 సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులందరూ ఆటపాటలతో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపక కరస్పాండెంట్ అనుమాస రేణుకరాజేందర్, ఉపాధ్యాయులు చంద్రమౌళి, శ్రీధర్‌రెడ్డి, శ్యామ్‌రావు, రమేష్, మూర్తి, రత్నాకర్, శేషాచార్యులు, షకీల్, తిరుపతి, నాగేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

నవతెలంగాణ - హుజురాబాద్ :

వైద్యులను దేవుళ్లతో సమానంగా కొలుస్తారని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కూరగాయల మార్కెట్ రోడ్డులో నూతన ఏర్పాటు చేసిన ప్రకృతి హాస్పిటల్‌ను ఆదివారం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ నందితరెడ్డి, కౌన్సిలర్లు ప్రతాప్ తిరుమల్‌రెడ్డి, కల్లేపల్లి రమాదేవి, మారేపల్లి సుశీల, ముత్యం రాజు, తొగరు సదానందం, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పోస్టులు మంజూరు చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి కేఎఫ్ జావీద్

నవతెలంగాణ - కరీంనగర్ : ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు గతంలో ప్రభుత్వం ప్రకటించినట్టు రాష్ట్ర వ్యాప్తంగా పదివేల పీఎస్‌హెచ్ఎం (ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల) పోస్టులను మంజూరు చేసి, దశాబ్దాలుగా ప్రమోషన్స్ పొందలేకపోతున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎఫ్ జావీద్ కోరారు. వెంటనే పీఎస్‌హెచ్ఎం పోస్టులు మంజూరు చేసి, ప్రస్తుతం జరగబోయే కౌన్సిలింగ్ లోనే ప్రమోషన్స్ కల్పించాలన్నారు. బదిలీలు, ప్రమోషన్స్ కౌన్సిలింగ్ పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంవత్సరాలుగా ఇ-కుబేర్ లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్ని వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ లను మంజూరు చేయాలన్నారు. పీఆర్సీ కమిటీ రిపోర్టును జాప్యం లేకుండా వెంటనే ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండో పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు ప్రజావాణి

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.. : కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ - భగత్ నగర్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ సోమవారం నుంచి యథావిధిగా కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిస్తామని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇన్ని రోజులు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని తెలిపారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ఇకపై ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

కేంద్ర మంత్రులకు వినోద్‌కుమార్ శుభాకాంక్షలు

నవతెలంగాణ - భగత్‌నగర్ : కేంద్ర మంత్రిగా సికింద్రాబాద్ ఎంపీ గంగాపురం కిషన్‌రెడ్డి, కేంద్ర సహాయమంత్రిగా బండి సంజయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర మంత్రులు తెలంగాణ అభివృద్ధి కోసం పాటు పడతారని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

చుక్క మురుగు మూలవాగులో కలవనియ్యం

- "జీవకళ కోల్పోతున్న పెద్దవాగు" శీర్షికన నవతెలంగాణలో కథనం
- స్పందించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- గంగాభవాని తల్లి బోనాల మహోత్సవానికి హాజరు

నవతెలంగాణ - వేములవాడ



ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌ను సన్మానించిన గంగపుత్ర సంఘం నాయకులు

ఒక చుక్క మురికి నీరు గుడి చెరువులోకి, మూల వాగులోకి చేరకుండా ప్రభుత్వం త్వరలోనే పనులను ప్రారంభిస్తుందనిప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. నవతెలంగాణ దిన పత్రికలో ఈనెల 7న "జీవకళ కోల్పోతున్న పెద్దవాగు" అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. ఆదివారం వేములవాడ పట్టణంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గంగాభవాని తల్లి బోనాల మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి దీవెనలు వలన సకాలంలో వర్షాలు పడి చెరువులు, కుంటలు, బావులు నిండి ప్రజాలంతా సుఖ సంతోషంగా ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు. గంగమ్మ తల్లి వద్దకు వచ్చేలా అనుబంధంగా బ్రిడ్జి నిర్మాణనికి గతంలోనే అంచనాలు రూపొందించి అధికారులకు పంపామని, ఎన్నికల కోడ్ కారణంగా కొంత ఆలస్యం అయ్యిందన్నారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయన్నారు.

గత ప్రభుత్వానికి చెప్పినా పట్టించుకోలేదు

మూల వాగులో, గుడి చెరువులో మురికి నీరు కలవకుండా చర్యలు చేపడుతున్నామని హామీ ఇచ్చారు. గుడిచెరువులోకి మురుగు నీరు చేరడం వలన చేపలకు ఆక్సిజన్ అందక చనిపోతున్నాయని, అలాగే సందర్శకులు కూడా మురుగు నీరు ద్వారా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 16కాలువల ద్వారా మురికి నీరు గుడి చెరువులోకి కలవకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని గత ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపానపోలేదన్నారు. చుక్కా మురికి నీరు గుడి చెరువులోకి, మూల వాగులోకి చేరకుండా ప్రభుత్వం త్వరలోనే పనులను ప్రారంభిస్తుదన్నారు. వచ్చే పండగ ఒక ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగేలా మా వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, గంగపుత్ర సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, పుల్కం రాజు, ధూమ్ మధు, చిలుక రమేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల



పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అంతకుముందు అన్ని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బయోమెట్రిక్ విధానంలో అభ్యర్థుల వివరాలు నమోదు చేసి, తరువాత లోపలికి అనుమతించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారం, సిరిసిల్లలోని జడ్పీ ఉన్నత పాఠశాల గీతా నగర్, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్, వికాస్ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్, నోడల్ ఆఫీసర్ పూజారి గౌతమి, అలాగే సిరిసిల్లలోని జడ్పీ ఉన్నత పాఠశాల వెంకంపేట్, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, శ్రీ కృష్ణ దేవరాయ జూనియర్ కాలేజీ, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ వేములవాడలోని పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పరిశీలించారు.

3780 మంది హాజరు

మొత్తం జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాలు ఏర్పాటు చేయగా, మహిళ అభ్యర్థులు 2034, పురుష అభ్యర్థులు 2,663, ట్రాన్స్ జెండర్స్ 2 మొత్తం 4699 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, మహిళ అభ్యర్థులు 1,644, పురుష అభ్యర్థులు 2,135, ట్రాన్స్ జెండర్స్ 1 హాజరు కాగా, మొత్తం 3,780 మంది పరీక్ష రాశారు. ఆర్సీఓ వడ్లూరి శ్రీనివాస్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రా చారి, పర్యవేక్షకులు వేణు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గ్రూప్-1 పరీక్ష 10గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను అధికారులు మూసివేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేసి 144సెక్షన్ అమలు చేశారు. జిల్లాలోని గ్రూప్ -1 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాటు చేసామని పరీక్ష కేంద్రాల వద్ద ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి, రూట్‌లలో ఎస్ఐ స్థాయి అధికారిని నియమించమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పలు పరీక్ష కేంద్రలను పరిశీలించి బందోబస్తులో ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రఘుపతి, ఏఈ మాధుకర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ..



నవతెలంగాణ - వేములవాడ రూరల్

వేములవాడ మున్సిపల్ పరిధి ఇస్లాం నగర్‌కు చెందిన షేక్ ఇమామ్ కొద్ది రోజుల క్రితం బావుపేట గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు గ్రానైట్ పడి తుంటి ఎముక విరిగింది. ఈ విషయం తెలుసుకున్న వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహరావు ఆదివారం ఇస్లాంనగర్‌కు చేరుకొని గాయపడిన షేక్ ఇమామ్‌ను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని, తన ఆసుపత్రిలో వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే 5వ వార్డు గొల్లపల్లికి చెందిన జెట్టి నర్సయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ శ్రీనివాస్, ఇస్లాంనగర్ బీఆర్ఎస్ నాయకులు షేక్ గోరేమియా, షేక్ అలీ,సయ్యద్ హైదర్ , గ్లోబల్ యూత్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ రహమాన్, అక్బర్, రషీద్ పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - భగత్‌నగర్ : స్టేట్ టీచర్స్ యూనియన్ ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సంఘ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పిఆర్ శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని, సంఘ సీనియర్ నాయకులు కటకం సత్యనారాయణ సంఘ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నిజాం నిరంకుశ విధానాలు కొనసాగుతున్న కాలంలోనే ఉపాధ్యాయుల ఆత్మగౌరవ రక్షణకు, హక్కుల సాధనకు మగ్దూం మొహియుద్దీన్ నివాసంలో ఏర్పడ్డ తొలి ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ అని పేర్కొన్నారు. శాస్త్రీయమైన ప్రతిపాదనలతో అవసరమైనప్పుడు ప్రభుత్వాలకు సూచనలు ఇస్తూ విద్యారంగ సంక్షేమం కోసం ఎస్టీయూ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎస్టీయూ సీనియర్ నాయకులు కటకం సత్యనారాయణ, ఖండేరావు భగవంతరావు, చిలగాని సాయిలు, మడ్డి కొమరయ్యలను జిల్లా శాఖ ఘనంగా సన్మానించింది. ఎస్టీయూ సంఘానికి వారు అందించిన సేవలను స్ఫూర్తిని ఈ సందర్భంగా అందరూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి ఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రాచారి రాష్ట్ర బాధ్యులు పిన్నింటి తిరుపతిరావు, సాన కిషన్, కందుకూరి దయానంద్, మహాదేవుని నారాయణస్వామి, వెలిచాల వెంకటస్వామి, కొట్టె లక్ష్మణరావు, యెనగంటి బాలాజీ, రసూల్, కందుకూరి శ్రీనివాస్, రాజేందర్రెడ్డి, మాధవస్వామి, సంజీవ చారి పాల్గొన్నారు.

పరిపాలనలో మత జోక్యం దేశానికి నష్టం

- విలువలు కలిగిన రాజకీయం కమ్యూనిస్టులతోనే సాధ్యం..
- యువతరం విప్లవ, రాజకీయాల వైపు నడవాలి..
- రెండవ రోజు కొనసాగిన శిక్షణ తరగతులు..
- సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్, స్కైలాబ్ బాబు

నవతెలంగాణ - వేములవాడ





పరిపాలనలో మత జోక్యం దేశానికి నష్టం.. మానవీయ విలువలు ప్రత్యామ్నాయ విధాన రాజకీయాలు కమ్యూనిస్టులకే సాధ్యమని నేటి యువతరం విప్లవ, రాజకీయాలవైపు పయనించాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్ , టి.స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం వేములవాడ మహాలింగేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజు "రోజు కులం, మతం, మతోన్మాదం" అనే అంశంపై బండారు రవి కుమార్, "సీపీఐ(ఎం) పార్టీ విశిష్టత" అనే అంశంపై టి.స్కైలాబ్ బాబు క్లాస్ బోధించారు. ఈ క్లాసులకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్, టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ దేశంలో ఓ వైపు మతోన్మాద కార్పొరేట్ శక్తులు దేశ సమైక్యతకు విఘాతం కలిగించే విధానాలు అమలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు దేశం జీడీపీ తగ్గి ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదాని ఆస్తులు పెరుగుతూ దేశ ప్రజల పరిస్థితి మరింతగా దిగజారడం అంటే బీజేపీ కార్పొరేట్ శక్తుల పంచన చేరిందని మండిపడ్డారు. నూతనంగా ఎన్నికైనా 543పార్లమెంట్ సభ్యుల్లో వందల కోట్లకు పడగలెత్తిన గద్దలు 475మంది ఉన్నారని, వారంతా బూర్జువా పార్టీలకు చెందినవారేనని వెల్లడించారు. కమ్యూనిస్టులు మాత్రమే పేదల తరుపున నికార్సుగా నిలబడి పోరాడుతారన్నారు. దేశ ప్రజల నుంచి మోడీ విధానాలపై ప్రతిఘటన ఎదురైందన్నారు. బలమైన ప్రతిపక్షం ఉండడం వల్ల మోడీకి ముకుతాడు వేస్తారన్నారు. కమ్యూనిస్టుల బలం తక్కువ ఉండడం వల్ల పేదల గొంతుకలు బలహీనపడ్డాయని తెలిపారు. కమ్యూనిస్టులు విలువలు ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించే రాజకీయాలు కమ్యూనిస్టులతోనే సాధ్యమని సూచించారు. నేటి యువతరం విప్లవ, రాజకీయాలు వైపు పయనించాలన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో సీపీఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, ముక్తికాంత అశోక్, ఎరవెల్లి నాగరాజు, కోడం రమణ, గురజాల శ్రీధర్, సూరం పద్మ, మల్లారపు ప్రశాంత్, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఏ గణేష్.. గుర్రం అశోక్ .రామంచ అశోక్, గాంతుల మహేష్, ఎలిగేటి రాజశేఖర్, రమేష్ చంద్ర, సత్యం, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాప్‌ను ప్రారంభించిన మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో మైదంబండ గ్రామానికి చెందిన ఎర్రం శేఖర్ నూతనంగా వినాయక ఫర్టిలైజర్స్, ఫెర్టిసైడ్స్ అండ్ సీడ్స్ షాప్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి హాజరై షాప్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అవసరమున్న రైతులు స్థానికంగా ఉన్న ఈ షాప్‌లో ఫర్టిలైజర్స్, ఫెర్టిసైడ్స్ అండ్ సీడ్స్ కొనుగోలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు ఉన్నారు.


ఫర్టిలైజర్ షాపును ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ

జాతీయ సంఘాలకు సేఫ్టీ కమిటీలలో ప్రాతినిధ్యం కల్పించండి

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి వ్యాప్తంగా ప్రమాదాల నివారణకు, నిర్మూలనకు సేఫ్టీ కమిటీలలో ప్రాతినిధ్యం కల్పించాలని డైరెక్టర్ (పా) ఎన్‌వికే శ్రీనివాసును బిఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆదివారం కలిసి వినతి అందజేసి కోరారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల వైఫల్యం, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, బొగ్గు గనులలో జాతీయ సంఘాలకు రక్షణ కమిటీలలో అవకాశం కల్పించాలని నిబంధనలు ఉన్నాయని, అమలు పరచుటకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న బొగ్గు సరఫరా డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత సాధించాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఆచరణలో పాటించకుండా యాజమాన్యం మొండిగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతుందని, అందుకే వైఖరిలో మార్పు రావాలని రక్షణతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించుటకు రక్షణ కమిటీలలో జాతీయ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ జాతీయ అంతర్జాతీయ నియమ నిబంధనలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.సారంగపాణి, ఆకుల హరిణ్, పల్లె శ్రీనివాస్, సంగాని సాంబయ్య, పోతరాజు భాస్కర్, మేడ రామ్మూర్తి, మాత్మ లింగయ్య, తాండ్ర మొగిలి, షేక్ రోహిత్ బాబా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభానికి నోచుకోని యోగా కేంద్రాలు


అడవీ శ్రీరాంపూర్ యోగా కేంద్రం

నవతెలంగాణ-ముత్తారం:
ప్రస్తుత జీవన విధానం అస్తవ్యస్తంగా మారడంతో శారీరక శ్రమ, మానసిక సమస్యలతో చిన్న వయసులోనే చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే యోగా చేయాలని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా 10 యోగా కేంద్రాలు నిర్మాణాలు చేపట్టగా, ఏడు పూర్తి చేయగా, మూడు షెడ్ల నిర్మాణాలలో టైల్స్‌వర్క్ పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాది గడుస్తున్నా ఏ ఒక్కటీ ప్రారంభానికి నోచుకోలేదు.

ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా...
ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆయుష్ ఆసుపత్రులను హెల్త్ వెల్నెస్ కేంద్రాలుగా అభివద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోగా కేంద్రాల కోసం నిధులు మంజూరు చేసింది. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా పెద్దపల్లి జిల్లాకు 10 కేంద్రాలను మంజూరు చేసింది. ఒక్కో కేంద్రం షెడ్డు నిర్మాణానికి రూ.6 లక్షల చొప్పున రూ.60 లక్షలు కేటాయించింది.

పూర్తయినవి ఇవే..
పెద్దపెల్లి జిల్లాలో పెగడపల్లి, పోత్కపల్లి ,అప్పన్నపేట, ధర్మారం, అడవీ శ్రీరాంపూర్, గర్రెపల్లి, పెద్దంపేటలో పూర్తి కాగా, ఆరెంద, రామగుండం, జూలపల్లిలో టైల్స్ వర్క్ పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రభుత్వం మారడంతో..
ఏడాది కిందటే కేంద్రాలు అందుబాటులోకి వచ్చినా శిక్షకుల నియామకంపై స్పష్టత లేకపోవడంతో తాళాలు వేశారు.గత ప్రభుత్వం స్థానికంగా ఉన్న ఆశాకార్యకర్తలను గుర్తించి పేర్లు ఎంపిక చేసి పంపించాలని ఆయుష్ విభాగం జిల్లా ఇన్‌ఛార్జిలను కోరింది. వారికే శిక్షణ ఇచ్చి శిక్షకులుగా నియమించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అంతలోనే ఎన్నికల కోడ్ రావడం, భారాస ప్రభుత్వం స్థానంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లీ కథ మొదటికొచ్చింది.

త్వరలోనే నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం
డాక్టర్ శ్రీవాణి, ఆయుష్ జిల్లా ఇన్‌ఛార్జి
రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎంపికైన ఆశాలకు శిక్షణ నిలిచి పోయింది. నూతన ప్రభుత్వానికి వెల్నెస్ కేంద్రాల వివరాలు పంపించాలని ఆదేశించడంతో నివేదించాం. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నారు.

సామాజిక అణిచివేతను ప్రతిఘటించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు



నవతెలంగాణ-గోదావరిఖని:
సామాజిక అణిచివేతను ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అన్నారు. సామాజిక ఉద్యమ సంఘీభావ నిధిని ఆదివారం సీఐటీయూ జిల్లా నాయకులు గోదావరిఖని ఆఫీసులో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ భారతదేశంలో వర్గ పోరాటాన్ని ఆటంక పరుస్తున్న సామాజిక సమస్యలపై సీఐటీయూ పోరాడుతుందని అన్నారు. సామాజిక అణిచివేత, కుల వివక్షకు వ్యతిరేకంగా కెవిపిఎస్ రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని కార్మికుల నుండి 26 వేల రూపాయలు, సామాజిక ఉద్యమ సంఘీభావ నిధిని సేకరించామని, దాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా కమిటీకి అందజేయడం జరిగిందని తెలిపారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమ నిధి అందించిన జిల్లాలోని కార్మికులకు, సీఐటీయూకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మెండే శ్రీనివాస్,ఎన్.బిక్షపతి, సహాయ కార్యదర్శి జి.జ్యోతి, నాయకులు సిపెల్లి రవీందర్, రాజమౌళి, సురేష్, శ్రీనివాస్, రవి, శివరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం

నవతెలంగాణ-మంథని



మంథని పట్టణంలోని పటేల్ ఐకేర్ సహకారంతో శస్త్రచికిత్సలు, బీపీ, షుగర్ టెస్ట్‌లు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.అవసరమైన వారికి హైదరాబాద్ పుష్పగిరి హాస్పిటల్‌కు కంటి ఆపరేషన్స్ కోసం పంపించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మేడగొని వెంకటేష్, కార్యదర్శి బుద్ధర్తి సతీష్ కుమార్, కోశాధికారి కొమురోజు సురేష్,సభ్యులు కుదుదుల రంజిత్, నార్ల భాస్కర్ పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన తొట్ల తిరుపతి యాదవ్

నవతెలంగాణ-రామగిరి



హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌తో సమావేశమైన మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, సింగరేణి వ్యాప్తంగా సింగరేణి భూ నిర్వాసిత అద్దెవాహనాల యజమానులు గత సంవత్సరం నుండి సమస్యల గురించి విన్నవించుకుంటున్న ఆ సమస్య పరిష్కారం కాకపోగా ఈ నెల 5వ తారీఖు కొత్తగూడెంలో సింగరేణి డైరెక్టర్‌ను కలిసి సమస్య గురించి చర్చలు జరపగా డైరెక్టర్ సానుకూలంగా స్పందించకపోవడంతో ఆరోజు నుండి వారు సమ్మెకు దిగారు. ఆదివారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు తొట్ల తిరుపతి యాదవ్ సారధ్యంలో సింగరేణి 11 డివిజన్ల సింగరేణి భూనిర్వాసిత వాహనాల యజమానులతో సింగరేణి సి అండ్ ఎండీ బలరాం నాయక్‌తో సమావేశం ఏర్పాటు చేసి ఆ సమస్య గురించి వివరించి పరిష్కారం చేసే విధంగా ఆలోచన చేయాలని కోరగా సీఎండీ వెంటనే సానుకూలంగా స్పందించి అద్దె వాహనాల యజమానుల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారని తిరుపతి అన్నారు.


బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-రామగిరి
రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన ఇజ్జగిరి ప్రతాప్ ఇటీవల జీడికే 11Aఇంక్లైన్‌లో ఎల్‌హెచ్‌డి ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ, ప్రమాదవశాత్తు గనిలో మృతిచెందగా ఆ కుటుంబ సభ్యుల ను పన్నూరు తాజా మాజీ సర్పంచ్ అల్లం పద్మ తిరుపతి ఆదివారం పెద్దకర్మకు హాజరై ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మాజీ ఎంపిటిసి పంజాల శ్రీనివాస్ గౌడ్,మాజీ ఉపసర్పంచ్ దామెర శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ చిందం సమన్న, చిందం రమేష్, పిట్టల రాజమౌళి, నాగుల శ్రీనివాస్,తదితరులున్నారు.

భేటీ పడావో, బేటి బచావోపై అవగాహన

నవతెలంగాణ-రామగిరి



కమాన్‌పూర్ మండలం నందులపల్లి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం సభ్యులచే పరిసరాల పరిశుభ్రత డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు, ఆడపిల్లలని పుట్టనిద్దాం ఎదగనిద్దాం చదవనిద్దాం బేటి బచావో, బేటి పడావో అని ప్రజలకు అవగాహన కల్పించారు. యువత తప్పుతోవ పట్టకుండా మంచి మార్గంలో నడవాలని నేటి యువత 30 సంవత్సరాలు నిండకుండానే యాక్సిడెంట్లతో, అనారోగ్యాలతో చాలామంది యువత మరణిస్తున్నారని, తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారని నేటి యువత రేపటి దేశ భవిత అని యువతరం గ్రహించాలని తల్లిదండ్రులు కన్న కలలు నిజం చేయాలని పాటల రూపంలో అవగాహన కల్పించారు. అలాగే వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులు కోండ్ర వెంకన్న గౌడ్, ఇల్లందుల మల్లేష్ గౌడ్, జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, బుర్ర శంకర్ గౌడ్, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, కట్కూరి శ్రీపల్లి, జిన్న రమా, కన్నూరి రేణుక తదితరులు పాల్గొన్నారు.

రామగిరి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి తొలగింపు

నవతెలంగాణ-రామగిరి
పార్టీలో క్రమశిక్షణను ఉల్లంఘించిన రామగిరి మండల యూత్ కాంగ్రెస్ అధ్యకుడు దాసరి శివకుమార్‌ను పార్టీ నుంచి తొలగించినట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి,పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జి తిప్పరాపు సంపత్, పెద్దేల్లి తేజశ్విని ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు జెమిని గౌడ్, మంథని నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ తెలిపారు. మండల యూత్ అధ్యక్షునిగా కొనసాగిన శివ కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవరించడం వల్ల అధిష్ఠానం అతన్ని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీపీ


పరీక్ష కేంద్రాలను సందర్శిస్తున్న రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధి గోదావరిఖనిలోని చైతన్య డిగ్రీ కళాశాల, పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మంచిర్యాల జోన్ మంచిర్యాల పట్టణ కేంద్రంలోని ఆర్‌బిహెచ్‌వి స్కూల్, ప్రభుత్వ బాలుర స్కూల్‌లలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాలను క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆదివారం పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్ల గురించి, పరీక్ష అనంతరం ఎగ్జామ్స్ షీట్స్ స్ట్రాంగ్ రూమ్ తరలింపు గురించి పోలీస్ అధికారులకు సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున 500 మీటర్ల లోపు ఎవరు కూడా గుమి కూడా వద్దని సూచించారు. సిపి వెంట పెద్దపల్లి డిసిపి చేతన, మంచిర్యాల డిసిపి అశోక్ కుమార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, గోదావరిఖని ఏసిపి రమేష్, పెద్దపల్లి ఏసిపి జి.కష్ణ, మంచిర్యాల ఏసిపి ఆర్.ప్రకాష్, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, పెద్దపెల్లి సిఐ కష్ణ, మంచిర్యాల ఇన్స్పెక్టర్ బన్సీలాల్, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, ఎస్ఐలు ఉన్నారు.

సింగరేణి ఆర్జీ-1లో క్వార్టర్స్ కౌన్సిలింగ్ క్రమం తప్పకుండా నిర్వహించాలి

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి డిమాండ్



నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో దాదాపు మూడు నెలలుగా క్వార్టర్ల కౌన్సిలింగ్ యాజమాన్యం నిర్వహించడం లేదని, మంచిగా ఉన్నాయనుకుంటున్న క్వార్టర్లు కౌన్సిలింగ్ రాకముందే దొడ్డిదారిన అలాట్మెంట్ అయిపోతున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ లేకుండా కార్వర్‌ల కేటాయింపులో అనేక అక్రమాలకు, అవినీతికి ఆస్కారమేర్పడుతున్నదని ఆయన పేర్కొన్నారు. క్వార్టర్ల అప్పగింత, కేటాయింపులు ఒక దందాగా నడుస్తున్నాయనేది కార్మిక వర్గంలో చర్చ జరుగుతున్నదని ఆయన పేర్కొన్నారు. ఒక పద్ధతి ప్రకారం, పారదర్శకంగా కేటాయింపులు జరగాల్సి ఉండగా, జరగడం లేదని ఆయన ఆరోపించారు. అదేవిధంగా ఖాళీ చేయబడిన ప్రతి క్వార్టర్ కౌన్సిలింగ్ లిస్టులో చేర్చాల్సి ఉండగా అలా జరగడం లేదని ఆయన అన్నారు. క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ నిర్వహించాలని కానీ ఈ విషయంలో యాజమాన్యం విఫలమవుతున్నదని ఆయన ఆరోపించారు.పర్సనల్ డిపార్టెంట్ అధికారులు ఇందుకు బాధ్యత వహించాలని, రికమండేషన్‌లకు పైరవీలకు తావు లేకుండా సీనియారిటీ కలిగిన కార్మికులకు న్యాయం జరగాలని, పైస్థాయి అధికారులు ఈ విషయమై దష్టి సారించి క్వార్టర్ల కేటాయింపులు అంటేనే కాసుల దందా అనే ఆరోపణలకు ముగింపు పలకాలని ఆయన డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన కార్మికులు క్వార్టర్లు అప్పగించేటప్పుడు లేనిపోని కొర్రీలు పెట్టి జాప్యం చేసి గ్రాట్యుటీ చెల్లింపులు మరింత ఆలస్యం చేసి వారిని మనోవేదనకు గురి చేయకూడదని ఆయన ఆ ప్రకటనలో యాజమాన్యాన్ని కోరారు.

విప్లవోద్యమ నిర్మాణానికి ప్రజలంతా రాజకీయంగా చైతన్యం కావాలి

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు కే.సూర్యం, ఎస్ఎల్ పద్మ, నంది రామయ్య


జెండా ఆవిష్కరిస్తున్న జూపాక శ్రీనివాస్

నవతెలంగాణ-గోదావరిఖని:
విప్లవోద్యమ నిర్మాణానికి ప్రజలంతా రాజకీయంగా చైతన్యం కావాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు కే.సూర్యం, ఎస్ఎల్ పద్మ, నంది రామయ్య అన్నారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజపంథా కరీంనగర్ ఉమ్మడి రాజకీయ తరగతులు అంతర్గాం మండలం ఏక్లాస్పూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా రాజకీయ తరగతుల సందర్భంగా సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ జెండా ఆవిష్కరించగా, మూడు అంశాలపై తరగతులను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో విప్లవోద్యమం విజయవంతం కావాలంటే ప్రజలంతా చైతన్యమై విప్లవోద్యమ నిర్మాణాన్ని కొనసాగించాలని, ప్రజల్లో చైతన్యవంతం చేసే బాధ్యత విప్లవకశక్తులు కొనసాగించాలని అన్నారు. ప్రజలకు పాలకులపై పార్లమెంటు వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని వారికి ఉన్న భ్రమలను పటాపంచలు చేయాలని అన్నారు. ఆ బాధ్యతలో భాగంగానే రాజకీయ తరగతులు నిర్వహించాలని అన్నారు. భారత దేశంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేయాలని అన్నారు. భారతదేశంలో విప్లవోద్యమ విజయవంతం అయినప్పుడే సమ సమాజం అవుతుందని అన్నారు. భారత రైతాంగం, కార్మిక వర్గం ఐక్యంగా పోరాడితే అమరులు కలలుగన్న సమాజం సాధ్యమవుతుందని అన్నారు. ఆ దిశగా కార్యకర్తలంతా రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు కే.సూర్యం, ఎస్-ఎల్ పద్మ, నంది రామయ్య, జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, పెద్దపెల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, అంతర్గాం మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న, జిల్లా నాయకులు ఆడెపు శంకర్, మార్త రాములు, గూడూరు వైకుంఠం, గొల్లపల్లి చంద్రయ్య, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మంథని
కరీంనగర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో శిక్షకులు కావేటిసమ్మయ్య ఆధ్వర్యంలో మంథనికి చెందిన జపాన్ సిటోరియో కరాట విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు,వెండి,కాంస్య, పథకాలు సాధించారు. పథకాలు సాధించిన వారిలో బ్లాక్ బెల్ట్ విభాగంలో ఎం.హాసిని బంగారు పతకం, వెండి పతకం, ఆల్ కలర్ బెడ్స్ విభాగంలో బండారి మణికంఠ బంగారు పతకం, బి.అక్షయ కీర్తన్ కాంస్య పథకం, కొండ అశ్విని బాబు కాంస్య పథకాలు సాధించారు. పథకాలు సాధించిన వారిని జపాన్ సిటోరియ కరాటే అధ్యక్షులు పాపయ్య అభినందించారు.



ఓదెల మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

నవతెలంగాణ-ఓదెల



శ్రీ ఓదెల భ్రమరాంభ మల్లి కార్జున స్వామి ఆలయం లో ఆదివారం భక్తుల రద్దీతో ఆలయం కిటకిట లాడింది. వేసవి సెలవులు ముగుస్తుం డడంతో వివిధ రాష్ట్రాల, జిల్లాల,గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పట్నాలు, బోనాలు సమ ర్పించుకొని స్వామి వారికి తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని సౌకర్యాలు కల్పించారు.

అఖిల భారత చిత్రకళా పోటీలో జీలకుంట


ఫోటోగ్రాఫర్‌కు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం





నవతెలంగాణ-ఓదెల
రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ నిర్వహించిన అఖిల భారత చిత్రకళా పోటీలో ఇరుకుల్ల వీరేశం తీసిన ఛాయాచిత్రం తృతీయ బహుమతిని గెలుచుకోగా 20 వేల రూపాయలు నగదు గెలుచుకున్నాడు వెళ్లారు అక్కడ ఉన్న.ఓదెల మండలం జిలకుంట గ్రామానికి చెందిన గ్రామీణ యువ ఫోటోగ్రాఫర్ ఇరుకుల్ల వీరేశం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మకమైన అవార్డు సాధించాడు. 2018లో ప్రారంభమైన ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటీషన్ అండ్ ఎగ్జిబిషన్ దేశంలోని సమకాలీన కళా పద్ధతులను అనుసంధానించడానికి ప్రతి ఏటా చిత్ర కళాకారులను గుర్తించి సన్మానిస్తోంది. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన 5వ ఎడిషన్ పోటీలో వీరేశం బహుమతి గెలుపొందారన్నారు. శనివారం హైదరాబాదులోని మాదాపూర్ లో అంగరంగ వైభవంగా నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా వీరేశం 20 వేల రూపాయల నగదు తో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా బహుమతి విజేత వీరేశం మాట్లాడుతూ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తాము తీసిన ఛాయాచిత్రానికి తృతీయ బహుమతి రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువ కళాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్



నవతెలంగాణ-ఓదెల
ఓదెల మండలంలోని హరిపురం గ్రామంలో స్వర్గీయ ఆసరి శ్రీకాంత్ యాదవ్ 9 వర్ధంతి సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ గ్యారవేణి నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి 5,016,రెండవ బహుమతి 2,516 నిర్ణయించారు. ఈ టోర్నమెంట్ నిర్వాహకుడు మాజీ ఉపసర్పంచ్ గ్యారవేణి నాగరాజు యాదవ్ మాట్లాడుతూ ఆసరి శ్రీకాంత్ యాదవ్ స్మార కార్థం ప్రతి సంవత్సరం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా విన్నర్ కప్ 5016 గెలుచుకొనగా, రెండో బహుమతి దగడ్ టీం 2016 గెలుచుకున్నారు. టోర్నమెంట్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారునికి, యువతకు, గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్పుల ఐలయ్య, పర్వతాలు,అసరి మహేందర్, బేరం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

9

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కరీంనగర్

సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com

ముందస్తుగా కవ్వంపల్లి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - తిమ్మాపూర్

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని నుస్తులాపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని వేడుకున్నారు. అలాగే



భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తుమ్మనపల్లి శ్రీనివాస రావు అభిమానులు గుంటి మధుకర్, తాళ్లపల్లి కిరణ్‌గౌడ్, సాగర్, నిస్సార్, సందీప్ రావు, అజయ్, వరాల అనిల్, రొడ్డ అనిల్, అస్లాం, రావుల క్రిష్ణ పాల్గొన్నారు.

సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలు

పెరుగుతున్న వరి సాగు

నవతెలంగాణ - చొప్పదండి

జూన్ మొదటి వారంలో తొలకరి జల్లులతో మండలంలో రైతన్నలు దుక్కులు దున్ని ఖరీఫ్ సాగుకు పొలం మడులను చదును చేసి నారు పోసేందుకు సిద్ధమవుతున్నారు. గత సంవత్సరం జూన్ మొదటి వారం తర్వాత వర్షాలు మొదలయ్యాయి. ఈ సంవత్సరం మృగశిర కార్తిలో వాతావరణం మార్పుతో వర్షాలు పడతాయని మండలంలో వ్యవసాయ పనుల్లో రైతులు పనులు చేసేందుకు ముందుకు సాగుతున్నారు. చొప్పదండి మండలంలో మొత్తం 25వేల ఎకరాల్లో సాగుభూమి ఉంది. వరి 18వేలా 900ఎకరాలు, పత్తి 3031 ఎకరాలు, మొక్కజొన్న 625 ఎకరాలు, మామిడి 1120 ఎకరాలు, ఆయిల్ పామ్ 210 ఎకరాలు, పెసర 25 ఎకరాలు, కంది125 ఎకరాలలో సాగు చేయనున్నారు.

సబ్సిడీపై జీలుగా

ఈ సంవత్సరం మండలంలో సబ్సిడీపై 200 క్వింటాళ్ల జీలుగా విత్తనాలు రాగా, మొదటి వారం లోనే అయిపోయాయి. మళ్లీ వస్తాయని వ్యవసాయ అధికారులు తెలిపారు.

పెరుగుతున్న వరి సాగుచొప్పదండి మండలంలో 3లక్షలా 400క్వింటాళ్ల వరకు వరి ధాన్యాన్ని రెట్టింపు స్థాయిలో కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం 100 నుంచి 200 ఎకరాల వరకు వరి సాగు పెరుగనున్న వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గత సంవత్సరంలో రబీలో లక్షా 80 వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఈ సంవత్సరం వడగళ్ల వర్షం బీభత్సంతో వరి



నారు పోసేందుకు సిద్ధంగా ఉన్న పొలం మడి

ధాన్యం తగ్గి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో సాగు చేసే వరి ధాన్యం రకాలు 1010, ఐఆర్64, కూనారం118, బీ25204, కేఎన్ఎం 1638, జైశ్రీరామ్, ఆర్ఎన్ఆర్ 15048 రకాల వరి ధాన్యం వంగడాలను చొప్పదండి మండలంలో రైతులు ఎక్కువగా పండిస్తున్నారు.

మండలంలో జూన్ మొదటి వారంలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లుగా వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ప్రభుత్వం రైతుకు భరోసా కల్పించేనా

రైతుకు విత్తనం నుండి పంట చేతికి వచ్చే వరకు అన్ని ఖర్చులతో మిగిలింది ఏమి లేదు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రైతులకు అందడం లేదు. పండించిన పంట కోసం గిట్టుబాటు ధర, బోనస్ కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చేందుకు పాలకులు ముందుకు రావాలని రైతన్నలు ఎదురు చూస్తున్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

-మండల వ్యవసాయ అధికారి వి. వంశీకృష్ణ



రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి రైతులు తమ పంట పొలాల్లో జనుము, పెసర, జీలుగా వంటి విత్తనాలను వేసుకోవాలి. వీటి ద్వారా భూమిలో నత్రజని శాతాన్ని తగ్గించి భూమి సారవంతమై సూక్ష్మ పోషకాలు రెట్టింపై రైతులకు అధిక దిగుబడులు సాధించవచ్చు. ఈ మేరకు మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

- బోనస్ కోసం ఎదురు చూస్తున్నాం

నిట్టు శ్రీనివాస్, రైతు



ఈ సంవత్సరం ఆరు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ఆశించిన మేర దిగుబడి వచ్చింది. గత సంవత్సరం 5 ఎకరాల్లో వరి పంట వేశాను. అకాల వడగళ్ల వర్షంతో పంట మొత్తం దెబ్బతిన్నది. ప్రభుత్వం వరి పంటకు బోనస్ కల్పిస్తుందని ఎదురు చూస్తున్నాం.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యుడు మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన బైరగోని ఆనంద్ మృతి చెందాడు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులకు సింగిల్‌విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి సంఘం తరపున పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఉపాధ్యక్షుడు ముద్దం మహేష్, డైరెక్టర్ నాంపల్లి మల్లయ్య ఏలేటి తిరుపతిరెడ్డి, మునిగాల చందు, కిట్టుగౌడ్, సీఈఓ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న సింగిల్ విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి

ఘనంగా పోచమ్మ బోనాలు

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్

కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లిలో గ్రామస్తులందరూ పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి ఓదయ్య ఇటీవల వడదెబ్బతో మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి నాయకులతో కలిసి పరామర్శించారు. 50కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు కనకయ్యగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, లింగంపల్లి హరీష్, తాళ్ళపల్లి రవి, రాజు, రాజయ్య, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ - శంకరపట్నం

మండలంలోని తాడికల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాటి విద్యార్థులు తమకు విద్యను బోధించిన ఆనాటి గురువులే శ్యాంసుందర్, రామయ్య, ఐలయ్య, కాళిదాస్, జమదగ్ని, ప్రభాకర్, రాజయ్య, సత్యంను పూలమాలతో సన్మానించారు. కన్వీనర్ వడ్నాల వాసుదేవ్, కీసర సంపత్, బుర్ర శ్రీనివాస్, రావణవేణి అంజయ్య, బుర్ర మధుకర్, తాడూరి ధర్మవీర్, తాటిపల్లి శ్రీనివాస్, సంపత్, గణపతి, సలీం, మోహిన్, వెంకటరమణారెడ్డి, టి.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో బీజేపీ నాయకుల సంబరాలు

నవతెలంగాణ - తిమ్మాపూర్

భారత దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం తో పాటుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు కేంద్ర మంత్రి పదవులు వస్తున్న సందర్భంగా ఆదివారం కొత్తపల్లిలో బీజేపీ కార్యకర్తలు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కిన్నెర అనిల్, గొట్టిముక్కల తిరుపతిరెడ్డి, గడ్డం అరుణ్, బండి సాగర్, తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ - హుజురాబాద్

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను పట్టణంలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్లూరి కిరణ్ కుమార్, సొల్లు బాబు, కొలిపాక శంకర్, సందమల్ల బాబు, నేరేళ్ళ మహేందర్‌గౌడ్, పానుగంటి కిరణ్, మిడిదొడ్డి రాజు, పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో రామోజీరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న నరేందర్ రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లోని నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మెన్ రామోజీరావుకు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుడా చైర్మెన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మీడియాలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు రామోజీరావు అని, సినీ పత్రికా రంగాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. ఈనాడు ద్వారా ఎన్నో సమాజ హిత కార్యక్రమాలు చేపట్టి ప్రజలను జాగృతం చేసిన ఘనత రామోజీరావుది అని తెలిపారు. తెలుగు ప్రజలు గర్వించే విధంగా హాలీవుడ్‌కు తీసిపోని విధంగా రామోజీ ఫిల్మ్ సిటీ నిర్మాణం చేయడమే కాకుండా సినీ, టీవీ రంగాలలో వినూత్న మార్పులు తీసుకు వచ్చిన దార్శనికుడు అని కొనియాడారు. కార్యక్రమంలో బొబ్బిలి విక్టర్, కుర్ర పోచయ్య, మామిడి సత్యనారాయణరెడ్డి, మెతుకు కాంతయ్య, ముక్క భాస్కర్, షబానా మహమ్మద్, జ్యోతిరెడ్డి, రజితారెడ్డి, హసీనా, జిలకర రమేష్, లింగమూర్తి, షెహెన్న, బషీర్, సతీష్‌రావు, సుదర్శన్, ఆంజనేయులు, సొహెల్ పాల్గొన్నారు.

సమాజానికి ప్రేరణ కావాలి

ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

నవతెలంగాణ - కరీంనగర్

ప్రముఖ అంతర్జాతీయ ఉపన్యాసకుడు మునవర్ జమ ప్రసంగం యావత్తు సమాజానికి మార్గనిరదేశకత్వం కావాలని, మంచి బాటలో పయనించడానికి ప్రేరణ అవ్వాలని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని స్థానిక మైత్రి కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన గులామ్ అహ్మద్ హుస్సేన్, మునవర్ జమాను ఆత్మీయంగా సన్మానించారు. సౌదీ అరేబియాలోని మక్కా నుంచి తెప్పించిన పవిత్రమైన జంజం నీటిని అందజేశారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. శనివారం రాత్రి అంబేద్కర్ స్టేడియంలో ప్రముఖ లక్ష్ స్కూల్ అధినేత ముస్తాక్ అలీ నేతృత్వంలో నిర్వహించిన విద్యార్థులకు, యువకులకు విద్యా శిక్షణ అవగాహన కార్యక్రమం విజయవంతం కావడంపై గులాం అహ్మద్ మోటివేటర్ మునవర్ జమాను, నిర్వాహకుడు ముస్తాక్ అలీని ప్రత్యేకంగా అభినందించారు. జీవితంలో ఎలా బతకాలి ఏ విధంగా గెలవాలి, సమాజ హితం కోసం ఏం చేయాలి, సమాజానికి



మునావర్‌ను సన్మానించిన సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

మార్గ నిర్దేశకత్వం ఏ విధంగా వహించాలి, చదువును బాధ్యతగా ఎలా జయించాలి అనే అంశాలపై మునవర్ జమ ఇచ్చిన సందేశం గొప్పదని కొనియాడారు. ఈయన ఇచ్చిన స్ఫూర్తితో విద్యార్థులు, యువకులు ప్రేరణగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మంచితనంతో ముందడుగు వేయాలని గులాం అహ్మద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, మహమ్మద్ షర్ఫుద్దీన్, ఆతిన అలీ బాబా తదితరులున్నారు.

'యాదవులకు జనాభా ప్రాతిపదికను అవకాశం కల్పించాలి'



నినాదాలు చేస్తున్న యాదవ సంఘం నాయకులు

నవతెలంగాణ - భగత్‌నగర్

స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు జనాభా ప్రాతిపదికను అవకాశం కల్పించాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు నాగారపు సత్యనారాయణ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ పట్టణంలోని యాదవ సంఘం భవనంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా జాతీయ కౌన్సిల్ సభ్యుడు కన్నెబోయిన ఓదెల యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో యాదవుల జనాభా రాజకీయ పార్టీల గెలుపోటములలో నిర్ణయాత్మకమైన స్థానంలో ఉన్నందున అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మంచాల రవీందర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి వెంకటమల్లు యాదవ్, మహిళా అధ్యక్షురాలు సంధవేణి గీతాంజలి యాదవ్, జిల్లా కార్యదర్శి బోయిని పోచమల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

బడితపూజ చేయడం ఖాయం..

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్

నవతెలంగాణ - కరీంనగర్

'పాడి కౌశిక్ రెడ్డి ఓట్ల కోసం కుటుంబంతో ఆత్మహత్య చేసుకుంటా నన్న నీవు పొన్నంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే గుడ్డలూడదీసి బడితే పూజ చేయడం ఖాయం' అని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ అన్నారు. పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఆదివారం తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మంత్రి పొన్నం



ప్రభాకర్‌పై చేసిన ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్న మీద నిరాదరమైన ఆరోపణలు చేస్తున్న పాడి కౌశిక్ 'నీవు తెలంగాణ ఉద్యమ ద్రోహివి, తెలంగాణ ఉద్యమ కారులపై రాళ్లతో దాడి చేసిన దుర్మార్గుడివి అని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డ నీకు దమ్ముంటే గత మీ ప్రభుత్వంలో జరిగిన అరాచకాలపై చర్చకు సిద్ధమా అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వసీం ఇమ్రాన్, హరీష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ పట్టణంలోని క్లబ్‌లో ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1974 బ్యాచ్ ఎస్ఎస్‌సి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. అలాగే ఇదే బ్యాచ్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను 1974 - 1976 విద్యా సంవత్సరంలో విద్యను పూర్తి చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఆర్.దేశ్‌ముఖ్ అప్పుడు పని చేసేవారు. కార్యక్రమంలో తమకు విద్య నేర్పిన గురువులను పూలదండలతో సన్మానించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సబ్బని శివాజీ, మంచికట్ల వెంకటరాజం, మేకల రాజిరెడ్డి, కల్లెపు రవీందర్‌రావు, మోకిలా రాజేందర్, భీమోజు సదానందం, డి.ఉపేందర్, కొత్త అశోక్ రెడ్డి, గంగాధర్, వి.వెంకటేశ్వరరావు, అంగీరస రాజేంద్రప్రసాద్, కొమురవెల్లి సుధాకర్, సాదుల రవీందర్, మంచికట్ల రామ్మూర్తి, కే.కృష్ణ కుమార్, జునూతుల రంగారెడ్డి తదితర విద్యార్థులు పాల్గొన్నారు. ఆనాటి అధ్యాపకులైన సి.వీరయ్య కిషన్‌రావు, ఈదారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీరిని విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

చలివేంద్రంలో నిమ్మరసం పంపిణీ



నిమ్మ రసం పంపిణీ చేస్తున్న మిత్రబందం సభ్యులు

నవతెలంగాణ - మానకొండూరు

మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన బాల్య మిత్రుల ఆధ్వర్యంలో మానకొండూర్ పల్లెమీద ఏర్పాటు చేసిన చలి వేంద్రంలో ఆదివారం ప్రజలకు నిమ్మరసం పంపిణీ చేశారు. తమవంతు సహాయంగా చలివేంద్రాన్ని ప్రారంభించి సుమారు 40రోజుల పాటు నీరు, మజ్జిగ తోపాటు నిమ్మరసం అందజేశారు. చలివేంద్రం నిర్వహణ ముగింపు రోజు సందర్భంగా మంచి సేవా కార్యక్రమాన్ని చేపట్టిన ముంజంపల్లి బాల్య మిత్ర బృందాన్ని పలువురు అభినందించారు ఈ కార్యక్రమంలో కైరి తిరుపతి గౌడ్, దాసరి కుమార్, సంద శివశంకర్, గాలిపెల్లి సంతోష్, యాళ్ళ నర్సింహారెడ్డి, కాసం సుధాకర్‌రెడ్డి, వేణువంక వీరస్వామి, రాజమౌళి, మత్రోజు చిరంజీవచారి, కొత్త రాజిరెడ్డి, జంషీద్, నాగాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ - జమ్మికుంట

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి స్థానిక గాంధీ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ సజ్జు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మొలుగురి సదానందం, దొడ్డే నవీన్, రంజాన్, పింగిలి రమేష్, బుర్ బుర్ర కుమార్ గౌడ్, కల్లపల్లి వినోద్, రాజేశ్వరరావు, శ్రీకాంత్, మహమ్మద్ జావిద్, శివ, సంజయ్ సాహూ, శ్రీధర్, పర్వేజ్, జియా అలీ, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి శుభాకాంక్షలు తెలిపిన జమ్మికుంట నాయకులు



నవతెలంగాణ - జమ్మికుంట

కరీంనగర్ లోకసభ నుండి రెండోసారి ఎంపీగా ఎన్నికై ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బండి సంజయ్ కుమార్‌ను జమ్మికుంట బీజేపీ నాయకులు ఆదివారం ఢిల్లీలోని ఆయన గృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి, సన్మానం చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి చెన్నమాధుని నరసింహారాజ్, నాయకులు ఆకుల రాజేందర్, మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్‌రావు, రామిడి ఆదిరెడ్డి, శివరాత్రి శంకర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు'

నవతెలంగాణ - జమ్మికుంట

హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీగా, విప్‌గా, ఎమ్మెల్యేగా తనదైన ముద్ర వేసుకొని ప్రజలలో మన్ననలు పొందుతున్న నాయకుడు కౌశిక్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని టీఆర్ఎస్ నాయకుడు మొలుగు దిలీప్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాజకీయ స్వార్థాల కోసం జిల్లా మంత్రి కాకపోయినా సిద్ధిపేట జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ మన్ననలు పొందడం కోసం మా నాయకుడిని విమర్శించడం సరికాదన్నారు. అక్రమంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లారీలు నడుస్తున్నాయని చెప్పితే మీరు కౌశిక్‌రెడ్డి ని విమర్శించడం సరికాదని అన్నారు. ఆయనవెంట సరిగొమ్ముల వెంకటేష్, గాజుల భాస్కర్ ఉన్నారు.

'నీట్' ఫలితాలపై విచారణ చేపట్టాలి

- డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌టీఏపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగువిధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాల్లో ఒకే పరీక్షా కేంద్రం, ఒకే సీరియల్ నంబర్లతో ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావటం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు.

లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితంతో ముడిపడి ఉన్న ఈ సమస్య పట్ల ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

10 నుంచి 13 వరకు ఫిజికల్ ఫిట్నెస్, స్కిల్ టెస్ట్

- టీజీపీఈసెట్ -2024 కన్వీనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీ.పీ.ఇడీ, డీ.పీ.ఇడీ కోర్సుల్లో ప్రవేశానికిగాను ఈ నెల 10 నుంచి 13 వరకు శాతవాహనా యూనివర్సిటీ వద్ద ఫిజికల్ ఫిట్నెస్, స్కిల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు టీజీపీఈసెట్ -2024 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ టెస్ట్ ఉంటుందని వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు : తపస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పండిత్, పీఈటీ పోస్టుల అప్ గ్రేడేషన్ చేసి పదోన్నతులు కల్పించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షులు, హన్మంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన బీ.ఇడీ ఉండి నష్టపోతున్న ఎస్జీటీలకు న్యాయం చేయాలని వారు కోరారు.

నవతెలంగాణ బ్యూరో
విద్యార్థులతో చెలగాటమాడటం ఆపాలి

- ఏఐడీఎస్ఓ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ ప్రవేశ పరీక్షల్లో అవినీతి, అక్రమాల ఆరోపణలపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఎయిడ్సో రాష్ట్ర అధ్యక్షులు జె.మల్లేశ్, రాష్ట్ర కార్యదర్శి ఎ.సత్యనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది గ్రేస్ మార్కులను ఇచ్చినందున ఆశ్చర్యం కలిగించే స్కోర్ చాలా మంది సాధించినట్టు ఎన్.టీ.ఏ చెబుతున్న సమాధానం విడ్డూరంగా ఉందని విమర్శించారరు. ప్రవేశ పరీక్షకు ముందే ప్రశ్నాపత్రాల లీక్ ఆరోపణలున్నాయని గుర్తుచేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటడాటం ఆపాలని డిమాండ్ చేశారు.

కేంద్ర సహాయ మంత్రులు

(మొదటిపేజీ తరువాయి)

పంకజ్ చౌదరి	- యూపీ
క్రిషన్ పాల్	- హర్యానా
రాం దాస్ అత్వాలే	- రాజ్య సభ (ఆర్పీఐ, మిత్రపక్షం)
రాంనాథ్ ఠాకూర్	- రాజ్యసభ (జేడీయూ, మిత్రపక్షం)
నిత్యానంద్ రాయ్	- బీహార్
అనుప్రియా పాటిల్	- యూపీ (అప్నాదళ్, మిత్రపక్షం)
వి సోమన్న	- కర్ణాటక
పెమ్మసాని చంద్రశేఖర్	- ఏపీ (టీడీపీ, మిత్రపక్షం)
భూపతి రాజు శ్రీనివాస్ వర్మ	- ఏపీ
ఎస్పీ సింగ్ భగేల్	- యూపీ (ఎస్సీ)
శోభ కరణ్ లాజే	- కర్నాటక
కీర్తి వర్దన్ సింగ్	- యూపీ
బీఎల్ వర్మ	- రాజ్యసభ
శాంతన్ ఠాకూర్	- పశ్చిమ గోదావరి
సురేశ్ గోపి	- కేరళ
ఎల్. మురుగన్	- తమిళనాడు (ఎస్సీ) ఓటమి
అజయ్ టంటా	- ఉత్తరాఖండ్
బండి సంజయ్	- తెలంగాణ
కమలేశ్ పాశ్వాన్	- యూపీ
భగీరథ్ చౌదరి	- రాజస్థాన్
సతీష్ చంద్ర దూబే	- రాజ్యసభ
సంజయ్ సేత్	- జార్ఖండ్
రవ్ నీత్ సింగ్	- పంజాబ్ (లుథియానా నుంచి ఓటమి)
దుర్గాదాస్ యూకే	- మధ్యప్రదేశ్
రక్షా నిఖిల్ ఖడ్సే	- మహారాష్ట్ర
సుకాంత ముజుందార్	- పశ్చిమ బెంగాల్
సావిత్రి ఠాకూర్	- మధ్యప్రదేశ్
టోఖన్ సాహూ	- చత్తీస్‌గఢ్
రాజ్ భూషణ్ చౌదరి	- బీహార్
హర్ష్ మల్హోత్రా	- ఢిల్లీ
నీముబెన్ జయంతి భాయ్ బాంభానియా	- గుజరాత్
మురళీధర్ మోహన్	- మహారాష్ట్ర
జార్జ్ కొరియన్	- కేరళ
పవిత్ర మార్గేరిటా	- రాజ్యసభ

చింతచెట్టు తెచ్చిన గొడవ

- దంపతుల మధ్య వాగ్వాదం
- ఆపేందుకు ప్రయత్నించిన తల్లి
- అడ్డొచ్చిన తల్లిని కొట్టి చంపిన కొడుకు

నవతెలంగాణ-శాయంపేట

ఇంటి పక్కనే ఉన్న చింతచెట్టు విషయంలో ఇరువురి మధ్య గొడవ జరుగుతుండగా, గొడవ ఆపడానికి భార్య తన భర్తను ఇంట్లోకి తీసుకెళ్లడంతో ఆవేశంలో భార్యను కొట్టేందుకు భర్త ప్రయత్నించాడు. గమనించిన అతని తల్లి అడ్డు రావడంతో మంచం అడ్డపట్టెతో ఆమె తలపై కొట్టగా తీవ్ర రక్తస్రావం అయింది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకి తీసుకెళ్లారు. అప్పటికే వృద్ధురాలు మోతే అమృతమ్మ (85) మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. శనివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ సీహెచ్ ప్రమోద్ కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన మోతే తిరుపతిరెడ్డి ఇంటి పక్కనే ఉన్న చింతచెట్టు విషయంలో బేతు జయపాల్ రెడ్డితో గొడవపడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన తిరుపతిరెడ్డి భార్య నాగరాణి గొడవ సద్దుమణిగేందుకు భర్తను ఇంట్లోకి తీసుకువెళ్లింది. ఆవేశంలో ఉన్న తిరుపతిరెడ్డి తన భార్యతో గొడవపడి కొట్టేందుకు ప్రయత్నించగా, అతని తల్లి అమృతమ్మ ఆపేందుకు అడ్డు వచ్చింది. కోపంలో పక్కనే ఉన్న మంచం అడ్డపట్టెను తీసుకొని తల్లి తలపై కొట్టాడు.

తలకి బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆటోలో పరకాల పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షించి ఆమె పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. తల్లిని సోదరుడు తిరుపతిరెడ్డి కొట్టి హత్య చేశాడని, కూతురు దూదిపాల రాణి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. పరకాల రూరల్ సీఐ పి.రంజిత్ రావు సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇక పాలనపై దృష్టి

- ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇక పాలన పరుగులు
- మూడేండ్లుగా ఒకే చోటున్న అధికారుల బదిలీలు
- సంక్షేమం -అభివృద్ధి జోడెద్దులుగా సాగాలని సర్కారు నిర్ణయం
- మధిరలో అధికారులతో సమీక్షలో : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరుగ్యారంటీల అమలుపై దృష్టి పెట్టిందని, ప్రమాణ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచుతూ అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులతో ఆదివారం మధిరలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో భట్టి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇక పాలనపై దృష్టి సారించాలని నిర్ణయించినట్టు తెలిపారు. గత ప్రభుత్వాల మాదిరిగా మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన అన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. దీనిలో భాగంగానే మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే రూ. 500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించుకునే వారికి జీరో బిల్లు మంజూరును అమల్లోకి తెచ్చామన్నారు. హామీ ఇవ్వకపోయినా డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల బకాయిలను మంజూరు చేశామని తెలిపారు. 30 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు అందజేశామన్నారు. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో ఒకసారిగా పాలనకు బ్రేక్ పడటంతో కొంత స్తబ్దత ఏర్పడిందని చెప్పారు. కోడ్ ముగిసిన వెంటనే ఈ నెల 9 నుంచి 'సంక్షేమం- అభివృద్ధి' జోడేడ్ల తరహాలో రాష్ట్రంలో పాలన ముందుకు సాగాలని సీఎం రేవంత్ రెడ్డి, తాను ప్రణాళికలు రూపొందించి వరుస సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలకు రంగం సిద్ధం చేశామని అన్నారు.

నెలాఖరులోగా ఉద్యోగుల బదిలీలు

ఈ నెలాఖరులోగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున అధికారులు, ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం అన్నారు. మూడేండ్లకు పైగా ఒకే చోట పాతుకుపోయిన అధికారులందరినీ కదిలించాలని నిర్ణయించినట్టు చెప్పుకొచ్చారు. దీనిలో భాగంగా ఆదివారం నుంచి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు కార్యాచరణ ప్రారంభమైందన్నారు. ఈనెల చివరకు ఈ ప్రక్రియ ముగియనున్నట్టు చెప్పారు.

వైరా రిజర్వాయర్‌కు ఎన్నెస్పీ నీరు..

నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా వైరా రిజర్వాయర్‌కు సాగునీరు మళ్లించేందుకు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల కోడ్‌కు ముందే రూ. 75 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పనుల పైన సమీక్ష నిర్వహించనున్నారు. ఖమ్మంలో సమీక్ష చేపట్టిన మరుసటిరోజే ఈనెల 13న సాగునీటి ప్రాజెక్టుల పనులు, వాటి ప్రగతిని తెలుసుకునేందుకు డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు సంయుక్తంగా క్షేత్రస్థాయి పర్యటన చేపట్టనున్నారు. నీళ్లు, నియామకాల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన గత పాలకులు ఖమ్మం జిల్లాలో ఇందిరా, రాజీవ్ సాగర్ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేశారని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు ముందుకు పడలేదని తెలిపారు. ఈనెల 12న.. సీతారామ ప్రాజెక్టు పరిధిలో దుమ్ముగూడెం నుంచి జూలూరుపాడు వరకు జరుగుతున్న పనులు, ఏన్కూరు నుంచి వైరా రిజర్వాయర్‌కు నాగార్జునసాగర్ ఎడమ కాలువను లింక్ చేయడం, కల్లూరు మీదుగా మధిర, సత్తుపల్లి నియోజకవర్గం నాగార్జునసాగర్ ప్రాజెక్టు జోన్-3 ద్వారా కృష్ణా జలాలను అందించడం, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు సాగునీటి సరఫరా అంశాలు వంటి పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులతో సమీక్షించనున్నారు.

ఆయిల్ ఫామ్ రైతులపై చిన్నచూపు

మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ-నంగునూరు

ఆయిల్ ఫామ్ రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో రైతు తిప్పని నాగేందర్ ఆయిల్ ఫామ్ తోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆయిల్ ఫామ్‌ల నిర్వహణకు ఏడాదికి రూ.4200 ఇచ్చేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అవి చెల్లించడం లేదన్నారు. వెంటనే పెండింగ్ డబ్బులు విడుదల చేయాలని కోరారు. కొత్త రైతులకు డ్రిప్ రావడం లేదని, ఆ కంపెనీలకు డబ్బులు చెల్లించకపోవడం వల్ల వారు ముందుకు రావడం లేదన్నారు. బకాయి పడ్డ నిధులు వెంటనే విడుదల చేయాలని, మొక్కల సబ్సిడీ కూడా పెండింగ్‌లో ఉందని, త్వరగా ఇవ్వాలని కోరారు. వానాకాలం వచ్చింది, కానీ రైతులకు పంట పెట్టుబడి సహాయం గురించి కాంగ్రెస్ నోరు మెదపడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాన చినుకు పడితే రైతు బంధు పైసలు పడేవని, ఇప్పటికైనా ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా ఎకరాకు రూ.7500 ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రసంగాల్లో, మ్యానిఫెస్టోల్లో పంట కాలానికి ముందే ప్రతి ఎకరాకు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రైతులను మోసం చేయడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, రైతు సమస్యల మీద దృష్టి సారించాలని సూచించారు. జనుము, జీలుగ విత్తనాల కొరత ఉందని, సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు రూ.500 బోనస్ అని, ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తామంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లే పండిస్తారని సిద్దిపేట జిల్లాలో కూడా దొడ్డు రకం వరినే పండిస్తారని గుర్తు చేశారు. బోనస్ విషయంలో మంత్రులు తలో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, రైతులను దగా చేయడం మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వేలేటి రాధా కృష్ణ శర్మ, జాప శ్రీకాంత్ రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి, ఆనగోని లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన ట్యాంకర్..

- లారీ, ట్యాంకర్ మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయిన కారు
- ఇద్దరు మృతి.. మరో నలుగురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-సదాశివపేట

యూటర్న్ తీసుకుంటున్న కారును వెనుక నుంచి వచ్చిన ఓ ట్యాంకర్ ఢీకొట్టగా.. అదే సమయంలో ఎదురుగా లారీ వచ్చింది.. దాంతో లారీ, ట్యాంకర్ మధ్య కారు ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్, కారులోని మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ భయానక ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నందికంది శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటకలోని దేవరిప్పరిగి తాలూకాకు చెందిన హాజీ శభాజ్, తన భార్య సమ్రిన్, ఇద్దరు కుమారులతో కలిసి కేఏ35ఎన్6126 నెంబర్ గల షిఫ్ట్ డిజైర్ కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. ఫేమస్ హోటల్ దాటాక నందికంది శివారులో ఉన్న నాగ్సన్పల్లి చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకోబోయారు. కారు వెనక హైదరాబాద్ నుంచి సదాశివపేట వైపు వస్తున్న ఎంహెచ్04ఎఫ్‌యు8804 నెంబర్ గల ట్యాంకర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టాడు. అదే సమయంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు టీఎస్52బీ8496 నెంబర్ గల లారీ ఎదురుగా వచ్చింది. ఆ సమయంలో కారు.. లారీ, ట్యాంకర్ మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ మహారాష్ట్ర నివాసి మృత్యుంజయ దుబే(45), కారులో ఉన్న సమ్రిన్(45) అక్కడికక్కడే మృతి చెందారు. కారులోని ఇద్దరు పిల్లలతో పాటు హాజీ శభాజ్, లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో వారిని ఆస్పత్రికి తరలించారు. కారును ట్యాంకర్ ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక అంచనాకు వచ్చినా.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గాజాలో ఊచకోత ఆపండి

- వైట్ హౌస్ ఎదుట 'భారీ'నిరసన ర్యాలీ

వాషింగ్టన్: గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణ మారణ కాండకు నిరసనగా, నెతన్యాహుకు పెద్ద మద్దతుదారుగా ఉన్న బైడెన్ ప్రభుత్వ విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా శనివారం అమెరికా అధ్యక్ష భవనం (వైట్ హౌస్) ఎదుట వేలాది మంది ప్రదర్శన నిర్వహించారు. అమెరికా పీపుల్స్ రెడ్ లైన్ ఇచ్చిన పిలుపుమేరకు వేలాది మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. యూదు దురహంకార నెతన్యాహు ప్రభుత్వం అన్ని అంతర్జాతీయ చట్టాలను, న్యాయ నియమాలను ఉల్లంఘిస్తూ పాలస్తీనీయులను ఊచకోత కోస్తుంటే బైడెన్ నిర్దేశించిన రెడ్ లైన్‌ను నెతన్యాహు దాట లేదంటూ వైట్ హౌస్ సన్నాయి నొక్కులు నొక్కడంపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

శనివారం సెంట్రల్ గాజాలో నుసిరాత్‌లో శిబిరంలో సజీవంగా ఉన్న నలుగురు బందీల విడుదల కోసం 250 మందికిపైగా అమాయక పాలస్తీనా పౌరులను ఇజ్రాయిల్ పొట్టన పెట్టుకుంది. ఈ దాడుల్లో మరో 400 మంది దాకా గాయపడ్డారు. ఇజ్రాయిల్ దాష్టీకం పట్ల అమెరికా, బ్రిటన్, చిలీతో సహా పలు దేశాల్లో నిరసనాగ్రహాలు వ్యక్తమయ్యాయి.

వైట్ హౌస్ ఎదుట జరిగిన ర్యాలీలో నిరసనకారులు పాలస్తీనా జెండా పట్టుకుని గాజాపై దాడులు ఆపండి. పాలస్తీనాకు విముక్తి కల్పించండి , తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయండి అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. చిలీ రాజధాని శాంటియాగోలో ఆందోళనకారులు పాలస్తీనాకు నరహంతక ఇజ్రాయిల్ నుండి విముక్తి కల్పించాలని కోరుతూ శనివారం ప్రదర్శన నిర్వహించారు.

హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను సైతం ఇజ్రాయిల్ బేఖాతరు చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలీలోని బోరిక్ ప్రభుత్వం పాలస్తీనాకు పూర్తి మద్దతు ప్రకటించింది. శాంటియాగో విశ్వవిద్యాలయం ఇజ్రాయిల్ టెక్నాలజీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాలను తాత్కాలికంగా నిలిపివేసింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెల్లడి

(మొదటిపేజి తరువాయి)

ఉన్నారు. అలాగే ఉత్తీర్ణత సాధించిన వారిలో 14,083 మంది జనరల్ కేటగిరి అభ్యర్థులు. 9,281 మంది ఓబీసీ, 5,423 మంది ఆర్థికంగా బలహీన తరగతులు, 13,794 మంది ఎస్సీలు, 5,073 మంది ఎస్టీ అభ్యర్థులు. ఇక, కామన్ ర్యాంక్ లిస్ట్ (సీఆర్ఎల్)లో ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోతి టాప్ ప్లేస్ (ఆల్ ఇండియా ర్యాంక్ 1)ను సొంతం చేసుకున్నారు. 17 ఏండ్ల లహోతి తొలి ప్రయత్నంలోనే

ఈ ఘనత సాధించాడు. మొత్తం 360 మార్కులకు 355 మార్కులను సొంతం చేసుకున్నారు. అలాగే మహిళా అభ్యర్థుల కేటగిరిలో ఐఐటీ బాంబే జోన్‌కు చెందిన ద్విజ ధర్మేష్‌కుమార్ పటేల్ టాప్ ప్లేస్‌ను సాధించారు. 360 మార్కులకు గాను 332 మార్కులు సాధించారు. ఫలితాలను జేఈఈఏడీవీ.ఏసీ.ఇన్ అనే వైబ్‌సైట్‌లో అభ్యర్థులు వీక్షించవచ్చు.

కేంద్రమంత్రులకు శుభాకాంక్షలు : బోయినపల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర మంత్రులుగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన సికింద్రాబాద్, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు బీఆర్‌నేత బోయినపల్లి వినోద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రులుగా తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడతారని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

మహారాష్ట్రలో భారీ వర్షాలు ..

- 24 గంటల్లో ముంబయిలో అత్యధికంగా 60మి.మీ వర్షపాతం

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయి సహా సమీప ప్రాంతాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. గత 24 గంటలుగా భారీ వర్షాలు కురుస్తున్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, తేమతో కూడిన వాతావరణం నుండి ప్రజలకు ఈ వర్షాలు ఉపశమనం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. థానే, పల్ఘార్ జిల్లాల్లోని పలు రోడ్లపై వరద నీరు ముంచెత్తినట్టు అధికారులు తెలిపారు. థానేలో పలు చోట్ల చెట్లు నేలకూలాయి.అయితే భారీ వర్షాల కారణంగా మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలోని మల్జిపాడ ప్రాంతంలో రహదారి కుంగిపోయింది. ఈ ప్రాంతంలో మరమ్మత్తులు చేపట్టినట్టు అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్-1పరీక్షలు

- దరఖాస్తు చేసుకున్న వారు 4.03 లక్షల మంది
- హాజరైన అభ్యర్థులు 3.02 లక్షలు
- త్వరలో కమిషన్ వెబ్‌సైట్లో ప్రిలిమ్స్ కీ
- షెడ్యూల్ ప్రకారమే అక్టోబర్ 21న మెయిన్స్
- వివరాలు వెల్లడించిన టీజీపీఎస్సీ
- నిమిషం ఆలస్యం నిబంధన నిక్కచ్చిగా అమలు
- పలు చోట్ల నిరాశతో వెనుదిరిగిన అభ్యర్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 563 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 31 జిల్లాల్లో ఏర్పాటు చేసిన 897 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగింది. మొత్తం 4.03 లక్షల మంది అభ్యర్థులకుగాను 3.02 లక్షల మంది అభ్యర్థులు (74 శాతం) హాజరయ్యారని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వెల్లడించింది. ఉదయం 10 గంటల వరకే అనుమతిస్తామని ప్రకటించిన నేపథ్యంలో అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఐతే కొన్ని పరీక్షా కేంద్రాల వద్ద కొందరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని అనుమతించలేదు. ఒక్క నిమిషం నిబంధనతో చాలా మంది పరీక్ష రాయలేక పోయారు. ప్రతి కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్ బందంతో పాటు 3 నుంచి 5 కేంద్రాలకు ఓ ఫ్లయింగ్ స్క్వాడ్ బందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహించారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసేయడంతో పాటు 100 మీటర్ల వరకు144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షకు సంబంధించిన ప్రిలిమినరీ కీని త్వరలో కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు టీజీపీఎస్సీ తెలిపింది. షెడ్యూల్ ప్రకారమే అక్టోబర్ 21న మెయిన్స్ నిర్వహించనున్నట్టు కమిషన్ పేర్కొంది.

అక్కడక్కడా అపశ్రుతులు

పరీక్ష నిర్వహణ విషయంలో రాష్ట్రంలో అక్కడక్కడా అపశ్రుతులు నెలకొన్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలో పరీక్షా కేంద్రం ముందు అభ్యర్థులు ఆందోళనకు దిగారు. అరగంట టైమున్నా ఐదు నిమిషాలు మాత్రమే ఉందని ఇన్విజిలేటర్ చెప్పడంతో తొందరగా ఆన్సర్ చేశామని వారు ఆరోపించారు. అబిడ్స్ స్టాన్లీ కాలేజ్ పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు గంట ముందే తరలివచ్చారు. అధికారులు విధించిన నిబంధనలు పాటించాలని పరీక్షా కేంద్రాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఏర్పాటు చేసిన కేంద్రానికి పలువురు అభ్యర్థులు ఆలస్యంగా రాగా అనుమతించ లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆలస్యంగా వచ్చివారికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటకి పంపంచారు.

రెండు సార్లు రద్దు

గ్రూప్1 పరీక్ష రెండు సార్లు రద్దయింది. 2022లో కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత అక్టోబర్‌లో ప్రిలిమ్స్ నిర్వహించి మెయిన్స్ కోసం 1:50 నిష్పత్తితో అభ్యర్థులను ఎంపిక చేశారు. అయితే పరీక్షా పత్రాలు లీకేజీ వ్యవహారంలో పరీక్షను కమిషన్ రద్దు చేసింది. ఆ తర్వాత గతేడాది జూన్ 11న రెండోసారి ప్రిలిమ్స్ నిర్వహించగా, ప్రక్రియలో లోపాలు జరిగాయని కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ పరీక్షను సైతం రద్దు చేశారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయడంతో పాటు కొత్తగా 60 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. దీంతో కమిషన్ 563 గ్రూప్ 1 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది.

పీఎఫ్ ఐఆర్ పెన్షన్ కుదింపు చర్యలు విడనాడాలి

- ఎం సాయిబాబా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎంప్లాయిస్ పెన్షన్ స్కీములోని ఐఆర్ పెన్షన్ కుదింపు చర్యలను ప్రభుత్వం విడనాడాలనీ, ఆ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం సాయిబాబా డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఐఆర్ వెన్షన్ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సరైన పద్ధతిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ కుదించే చర్యలు విడనాడాలని సూచించారు. కనీస పెన్షన్ రూ. తొమ్మిదివేలు ఇవ్వాలనీ, పెన్షన్ కరువు భత్యం లింక్ చేయాలన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారానికై నిర్వహించనున్న ఆందోళనలో కార్మికుల పెద్దఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలుడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌వి రమ, పి.జయలక్ష్మి, భూపాల్, జె.వెంకటేష్, జె.మల్లికార్జున్, వి.ఎస్ రావు, కె ఈశ్వరరావు, కళ్యాణ వెంకటేశ్వరరావు, గోపాలస్వామి, ఏజే రమేష్, కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డెస్టినేషన్ వెడ్డింగ్ హబ్‌గా తెలంగాణ

- మెడికల్, ఏకో టూరిజంపై ప్రత్యేక దృష్టి : పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం బేగంపేటలోని హోటల్ హరిత ప్లాజాలో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో 3వ సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వివాహ వేడుకలకు గమ్యస్థానంగా ఉన్నప్పటికీ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉన్న ఫంక్షన్ హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, రిసార్టుల్లో మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సుందరమైన ప్రదేశాలు, పుష్కలమైన వనరులున్నాయని తెలిపారు. వెడ్డింగ్ టూరిజానికి అనువుగా ఉండే సాగర్, కొల్లాపూర్‌లోని సోమశిల తదితర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరముందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మెడికల్ టూరిజం, ఎకో టూరిజం, అడ్వెంచర్ టూరిజం, సహా వివిధ టూరిజం రంగాలపై దృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు. డెస్టినేషన్ వెడ్డింగ్‌లను ప్రోత్సహించడానికి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పర్యాటకాభివృద్ధితో ఆదాయం పెరగడంతో పాటు యువతకు గణనీయమైన ఉపాధి అవకాశాలను లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండీ రమేష్ నాయుడు, డైరెక్టర్ కె.నిఖిల, టీసీఈఐ అధ్యక్షులు ఆళ్ల బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి బురా తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బ

బెంగుళూరు : కర్నాటక లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ కేవలం ఒక స్థానంలోనే విజయం సాధించింది. ఇటీవల కౌన్సిల్‌లోని మొత్తం ఆరు ఖాళీలకు ఎన్నికలు నిర్వహించారు. మూడు పట్టభద్రులు నియోజకవర్గాలకు, మూడు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఈ ఎన్నికలు జరిగాయి. మొత్తం ఆరు స్థానాల్లో మూడు స్థానాలను అధికార కాంగ్రెస్ గెలుచుకుంది. జెడి(ఎస్)కు రెండు స్థానాలు, బీజేపీకి ఒక స్థానం దక్కింది. అయితే కౌన్సిల్‌లో ఎన్‌డిఎ మెజార్టీ కొనసాగుతోంది. కర్ణాటక లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొత్తం 75 మంది సభ్యులు ఉన్నారు. తాజా ఎన్నికల తరువాత ఎన్‌డిఎకు మొత్తంగా 38 సభ్యులు ఉన్నారు. ఇందులో బీజేపీ సభ్యులు 30 మంది, జెడి(ఎస్) సభ్యులు ఎనిమిది మంది. అధికార కాంగ్రెస్‌కు 34 మంది సభ్యులు. కౌన్సిల్ ఇంకొంక ఖాళీ ఉంది. లోక్‌సభ ఎన్నికల తరువాత జగదీష్ షెట్టర్ రాజీనామా చేయడంతో ఒక స్థానం ఖాళీ అయింది. దీనికి త్వరలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికలు జరిగితే ఇది కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లనుంది. ఈ స్థానానికి అభ్యర్థిగా బసనగౌడ బాదర్లీని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది.

వానాకాలంలో...

వాతావరణం మారుతోంది. వర్షాలు ప్రారంభమయ్యాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ కాలంలో పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. జ్వరం, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, తదితర సమస్యలు పిల్లలను ఈ కాలంలో వేదిస్తాయి. ఈ వర్షాకాలంలో పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

- కాచి చల్లార్చిన నీరు తాగేలా చూడాలి.
- మలేరియా, డెంగ్యూ ఇతర వ్యాధుల వ్యాప్తిని నివారించేలా పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.
- ఫంగల్ ఇన్ఫెక్షన్లు రాకుండా తడి బట్టలు, బూట్లు తప్పనిసరిగా ఆరుబయట ఆరబెట్టాలి.
- భోజనానికి ముందు చేతులు బాగా కడుక్కునేలా చూడాలి.
- స్కిప్పింగ్, హెూపింగ్, టేబుల్ టెన్నిస్ మొదలైన ఇండోర్ ఫిజికల్ యాక్టివిటీస్ వంటి శారీరక శ్రమ కలిగించే క్రీడలను ప్రోత్సహించాలి.
- వర్షాలు పడుతున్న సమయంలో తప్పనిసరిగా బయటికి వెళ్తున్నప్పుడు రెయిన్‌కోట్‌లు, గొడుగులు, గమ్ బూట్లు ఉపయోగించాలి.
- ఆహారంలో తులసి, దాల్చిన చెక్క, నిమ్మ, అల్లం, ఇతర మసాలా దినుసులు చేర్చాలి.
- దోమలు కుట్టకుండా దోమతెర ఉపయోగించాలి.
- బయటి నుండి వచ్చిన పిల్లల కాళ్లను గోరువెచ్చని నీళ్లతో కడగాలి.
- అలెర్జీలు రాకుండా ఇంటి వాతావరణంలో తేమ లేకుండా చూడాలి. ముఖ్యంగా గోడలు, తివాచీలు, కర్టెన్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి.

నా సంఘీభావం ప్రకటించానంతే..

కని కస్రుతి... తన రాజకీయ ఆలోచనలకు, మతసామరస్యానికి భిన్నంగా వుందని కేరళ స్టోరీలో నటించేందుకు తిరస్కరించారు. ఇటీవలే 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ ప్రిక్స్ అవార్డును గెలుచుకున్న 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్' ప్రధాన పాత్ర పోషించారు. ఆ ఫిల్మ్ ఫెస్టివల్లో పుచ్చకాయ బ్యాగ్ ధరించి పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలియజేసినందుకు అనేక విమర్శలకు గురయ్యారు. అయినా నికార్సైన నటిగా సమాజంలో జరిగే ప్రతి అన్యాయంపై తనదైన శైలిలో గొంతెత్తుతున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



ఇటీవల ముగిసిన కేన్స్ వారి 77వ ఎడిషన్‌లో చిత్రనిర్మాత పాయల్ కపాడియా 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్' గ్రాండ్ ప్రిక్స్‌ను గెలుచుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఎందుకంటే 30 ఏండ్ల తర్వాత కేన్స్ పోటీలో గెలుపొందిన మొదటి భారతీయ చిత్రం ఇది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడిన ఈ చిత్రం ప్రేక్షకుల నుండి ఎనిమిది నిమిషాల స్టాండింగ్ ఒవేషన్‌ను అందుకుంది. 'ఇదంతా నమ్మలేకపోతున్నాను. ఇంత లాంగ్ స్టాండింగ్ ఒవేషన్ వస్తుందని ఊహించలేదు. ప్రీమియర్ చూసిన తర్వాత ఇతర దేశాల నుండి ఎంతో అనుభవం ఉన్న నటులు నా వద్దకు వచ్చి నా నటనలోని సూక్ష్మ నైపుణ్యాల గురించి నాతో పంచుకున్నారు. వారితో జరిగిన ఈ చర్చలు చాలా విలువైనవిగా భావించాను' అంటూ కని పంచుకున్నారు.

థియేటర్ విద్య పూర్తి చేసి

కని కేరళలోని తిరువనంతపురంలోని చెరువక్కల్ గ్రామంలో పుట్టారు. తల్లి జయశ్రీ ఎకె, తండ్రి మైత్రేయ మైత్రేయన్. వీరిద్దరూ అభ్యుదయ భావాలు కలిగిన సామాజిక కార్యకర్తలు. అందుకే తమ బిడ్డకు ఇంటి పేరు కానీ, వెనక తల్లిదండ్రుల పేర్లు తోకలుగా వచ్చే సాంప్రదాయాన్ని బద్దలు కొట్టి కేవలం కని అని పేరు పెట్టుకున్నారు. ఆమె 15 ఏండ్ల వయసులో పదో తరగతి పరీక్షలు రాసే సమయంలో తప్పని పరిస్థితుల్లో ఆమె పేరు వెనుక కుస్రుతి (మలయాళంలో కొంటె అని అర్థం) అని చేర్చాల్సి వచ్చింది. తిరువనంతపురంలో అభినయ థియేటర్ రీసెర్చ్ సెంటర్ చెందిన థియేటర్ ప్రాక్టీషనర్లకు ఒక సాధారణ వేదిక ఉండేది. ఆమెకు వారితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో 2005 నుండి 2007 వరకు త్రిసూర్ స్కూల్ ఆఫ్ డ్రామాలో థియేటర్ ఆర్ట్స్ ప్రోగ్రామ్‌లో చేరారు. తన థియేటర్ విద్యను ఎల్‌కోల్ ఇంటర్నేషనల్ డి థియేట్రే జాక్వెస్ లెకాక్‌లో పూర్తి చేశారు. తర్వాత రెండేండ్ల పాటు ఫిజికల్ థియేటర్‌ను పూర్తి చేశారు. తర్వాత నటిగా, మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు.

పుచ్చకాయ బ్యాగుతో...

కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్‌లో కని ఓ బ్యాగ్ పట్టుకున్నారు. అదే పుచ్చకాయ బ్యాగ్. పుచ్చాకాయను పోలి ఉన్న బ్యాగ్‌తో ఆమె రెడ్ కార్పెట్‌పై నడిచారు. పుచ్చకాయ ముక్క పాలస్తీనా ప్రతిఘటనకు చిహ్నం. ఆ దేశానికి సంఘీభావంగా ఆమె ఆ బ్యాగ్ పట్టుకున్నారు. అయితే దానిపై సోషల్ మీడియాలో కాంట్రవర్సీ నడిచింది. ఆమె పాలస్తీనాపై కపట ప్రేమ చూపిస్తున్నారు అంటూ విమర్శలు వచ్చాయి. దానిపై స్పందిస్తూ 'అక్కడ చాలామంది చాలా వాటికి సపోర్ట్ చేశారు. బ్యాడ్జెస్ వేసుకున్నారు. రకరకాల వస్తువులతో తమ సంఘీభావాన్ని తెలిపారు. నేను పాలస్తీనాకి సంఘీభావం తెలపాలి అనుకున్నాను. చాలామంది వర్క్ ప్లేసుల్లో మహిళలపై జరుగుతున్న దారుణాల గురించి, కేన్స్‌లో వర్కర్లకు ఇస్తున్న తక్కువ జీతాల గురించి ఇంకా చాలా విషయాలపై గొంతెత్తారు. నేను పాలస్తీనాకి సంఘీభావం తెలపాలి అనుకున్నాను అంతే. ఒక వ్యక్తిగా నేను కొన్నిసార్లు అనేక ఆలోచనలను పంచుకుంటాను. కొన్ని సమస్యలపై ఎలా నిలబడాలో నిర్ణయించుకుంటాను. విపరీతమైన సంఘటనలు ఏకకాలంలో జరుగుతున్న ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. నేటి పరిస్థితులు ఎవరికీ అనుకూలంగా లేవు. వీటిని మనం లైట్‌గా తీసుకుంటే కుదరదు. అందుకే నా సంఘీభావం ప్రకటించాను' అంటూ పంచుకున్నారు.



నాలాంటివారెందరో...



తన సినీ కెరీర్ గురించి మాట్లాడుతూ 'నేను ఆర్థికంగా స్వతంత్రంగా ఉన్నప్పుడే ప్రశాంతంగా ఉండగలను. జీవనోపాధి కోసమే సినిమాల్లో నటించాల్సి వచ్చింది. 2020లో నేను నటించిన మలయాళ చిత్రం 'బిరియాని'కి కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డు, మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ నటి అవార్డును గెలుచుకున్నాను. కానీ అంతకు ముందు నా జీవితమంతా కన్నీళ్లతో పోరాటమే. నా దగ్గర డబ్బు లేని సమయంలో సజిన్(సజిన్ బాబు) నన్ను సంప్రదించారు. స్క్రిప్ట్ చదివిన తర్వాత ఈ క్యారెక్టర్ చేయలేనని చెప్పా. ఎందుకంటే అది ముస్లింల హక్కుల గురించి మాట్లాడే సినిమా. అయితే నన్ను కలిసిన సజిన్ ఓ ముస్లిం. ఇవన్నీ వాస్తవ జీవితాలని నాకు చెప్పారు. అయినా నేను ఒప్పుకోలేదు. అయితే మూడు నెలల తర్వాత చిత్ర నిర్మాత మళ్లీ నన్ను సంప్రదించారు. ఆ సినిమాలో నటిస్తే 70 వేలు ఇస్తామన్నారు. అప్పుడు నా అకౌంట్‌లో మూడు వేలు మాత్రమే ఉన్నాయి. దాంతో సినిమా చేసేందుకు ఒప్పుకున్నాను. ఇలా నాలాంటి నటులు సినీ పరిశ్రమలో ఎంతో మంది ఉన్నారు. ఒకవేళ థియేటర్ ఆర్టిస్టుగా నాకు సంపాదన బాగుండి వుంటే సినిమాల్లోకి వచ్చి ఉండేదాన్ని కాదేమో' అంటూ ఆమె పంచుకున్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా తీసిన కేరళ స్టోరీ చిత్రంలో అవకాశం వస్తే ఆమె దాన్ని సీరియస్‌గా తిరస్కరించారు. తన రాజకీయ ఆలోచనలకు ఈ సినిమా పూర్తి భిన్నంగా ఉందన్నారు. ఆమె అన్నట్టుగానా ఆ చిత్రం తర్వాత కాలంలో అనేక ప్రాంతాల్లో నిషేధానికి గురయ్యింది.

మదర్ థెరిసా పాత్రతో...



థియేటర్ ప్రొడక్షన్స్ భగవదజ్జుకం, లాస్ ఇండాస్, హెర్మాన్ హెస్సే, సిద్ధార్థ వారి రంగస్థల వేదికలపై నటించారు. ఆమె బర్నింగ్ ఫ్లవర్స్ - 7 డ్రీమ్స్ ఆఫ్ ఎ ఉమెన్ అనే ఇండో-పోలిష్ ప్రొడక్షన్‌లో పరిశోధించి, అభివృద్ధి చేసి నటించారు. ఆంథాలజీ చిత్రం కేరళ కేఫ్‌లో కనిపించిన తర్వాత కనికి నటిగా గుర్తింపు వచ్చింది. తర్వాత శిక్కర్, కాక్‌టెయిల్ వంటి సినిమాల్లో ముఖ్యమైన పాత్రలను పోషించారు. ఈశ్వరన్ సాక్షియై అనే మలయాళ ధారావాహికలో మదర్ థెరిసా పాత్రతో ప్రజాదరణ పొందారు.

కిందకు దిగేందుకు సిద్ధపడం

థియేటర్ నేపథ్యం నుండి రావడంతో సరైన ఎంపికలు చేయడంలో ఆమెకు బాగా సహాయపడింది. 'ఇది నాకు స్థిరంగా ఉండటంలో, సవాళ్లను ఎదుర్కోవడం, ఎలాంటి పరిస్థితులనైన తట్టుకొని నిలబడంలో సహాయపడింది. థియేటర్ నటులుగా మేము ఎట్టి పరిస్థితుల్లోనూ కిందకు దిగేందుకు సిద్ధపడం' అన్నారు. మలయాళ సినిమాకి పునరాగమనం గురించి అడిగితే ఆమె నవ్వుతూ పరిశ్రమలో పాత్రల కోసం ఆడిషన్‌కు మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఆమె రాబోయే ప్రాజెక్ట్‌లలో రెండు మలయాళ వెబ్ సిరీస్‌లు, ఒక మలయాళ చిత్రం, ఒక హిందీ చిత్రంతో పాటు రెండు వెబ్ సిరీస్ ఉన్నాయి. అలాగే ఒక తమిళ చిత్రం కూడా ఉంది.





బడి ఊడ్చేదెవరు..?

(మొదటిపేజీ తరువాయి)

చెప్పినట్టుగా.. అన్ని స్కూళ్లకు స్కావెంజర్లను నియమించడం ద్వారా స్వచ్ఛ వాతావరణంలో ప్రభుత్వ స్కూళ్లను నడిపించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

హైదరాబాద్ పరిధిలో 691 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో లక్షకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనుల కోసం గతంలో స్కావెంజర్లు ఉండేవారు. 40మందిలోపు విద్యార్థులు ఉంటే ఒకరిని రూ.2వేలు, అంతకంటే ఎక్కువ విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులకు రూ.2500 చొప్పున వేతనం చెల్లించేవారు. ఈ వేతనంతోనే సదరు కార్మికులు నిత్యం పాఠశాలల ప్రాంగణాలు, గదులు, టాయిలెట్లను శుభ్రం చేసేవారు. అంతేగాక హైస్కూళ్లలో వందలాది మంది విద్యార్థులకు వీరి సేవలు ఎంతో కీలకం. కానీ రెండేండ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్కావెంజర్ల వ్యవస్థను రద్దుచేసింది. దాంతో సిటీలో సుమారు 800కుపైనే.. రాష్ట్రంలో 20వేలకుపైనే కార్మికులు ఉపాధి కోల్పోయారు. పాఠశాలల్లో పరిశుభ్రతను ప్రభుత్వం.. హెచ్ఎంలు, ఉపాధ్యాయులపై నెట్టేసింది. వారి నుంచి వ్యతిరేకత పెరగడంతో ఆ తర్వాత జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు అప్పగించింది. ఇదివారికి అదనపు భారమే కాదు.. ఈ పనులకు అదనపు చెల్లింపులు కూడా లేవు. అయినప్పటికీ జీహెచ్ఎంసీ కార్మికులు పాఠశాలల్లో ప్రాంగణాలను శుభ్రం చేస్తున్నారు. కానీ మరుగుదొడ్లు పరిశుభ్రత చేయడం లేదు. దాంతో బడుల్లో స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారింది. టాయిలెట్లు పరిస్థితి అధ్వానంగా తయారు కావడంతో విద్యార్థినులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గతంలో పనిచేసిన వారిని తిరిగి పిలిచి కొంత డబ్బులు చెల్లించి పనులు చేయించుకునే పరిస్థితి నెలకొంది.

రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం..!

ఎల్లుండి నుంచి స్కూళ్ల ప్రారంభమైతే పరిశుభ్రత ఎలా అనేది ఇప్పుడు ప్రశ్నార్థంగా మారింది. పట్టణ ప్రగతిలో భాగంగా పారిశుధ్యం, హరితహారం, తదితర పనుల్లో జీహెచ్ఎంసీ కార్మికులు తీరిక లేకుండా ఉన్నా.. వీరికి బడుల బాధ్యత అప్పగించడంతో పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో అమలుకాక అపరిశుభ్రంగా మారుతున్నాయి. సిబ్బంది కొరత, అదనపు పని భారం వల్ల వారు పాఠశాలలకు వచ్చినా కేవలం బడి ఆవరణ మాత్రమే క్లీన్ చేస్తున్నారు. దీంతో అటు స్వచ్ఛ కార్మికులు లేక.. ఇటు జీహెచ్ఎంసీ కార్మికులు చేయక.. టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. వాటినే విద్యార్థులు ఉపయోగించే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారాయి. ఈ నేపథ్యంలో స్కావెంజర్ల వ్యవస్థను పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బడుల ప్రారంభంలోపే.. స్కావెంజర్లను నియమించాలి :
ఏ.శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి, టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా



నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న సందర్భంగా మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. పాఠశాలల్లో టాయిలెట్స్ క్లీనింగ్, ఇతర పనుల బాధ్యతలను రెండేండ్ల క్రితం అప్పటి ప్రభుత్వం జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు అప్పగించింది. స్కూళ్లలో క్లీనింగ్ పనులు సరిగ్గా జరగడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు జూన్ 12న స్కూల్స్ ప్రారంభం రోజునే అన్ని పాఠశాలలకు స్కావెంజర్లను నియమించాలి.

పార్లమెంట్‌లో రైతుల గొంతుక

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



ఎంపీగా ఎన్నికైన ఎఐకెఎస్ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు అమ్రారామ్ కు ఏఐకేఎస్ ఘనంగా సత్కరించింది. ఇండియా ఫోరం తరపున ఆయన రాజస్థాన్‌లోని సికార్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా విజయం సాధించారు. ఆదివారం నాడిక్కడ ఏఐకేఎస్ కార్యాలయంలో అమ్రారామ్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసి సభలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పుష్పగుచ్ఛం అందించి సత్కరించి అభినందించారు. అనంతరం సీతారాం ఏచూరి మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా రైతుల కోసం పోరాడుతున్నారని, అమ్రారామ్ ఇప్పుడు లోక్‌సభలో రైతులు, కూలీల కోసం పోరాడుతారని అన్నారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్ మాట్లాడుతూ అమ్రారామ్ రైతుల మనిషి అని, రైతు పోరాటాలతో పెనవేసుకొని ఉన్నారని అన్నారు. ఏఐకేఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి, ఎస్కేఎం సీనియర్ నేత, మాజీ ఎంపీ హన్నన్ మొల్లా మాట్లాడుతూ రైతు ఉద్యమానికి ప్రతీకగా అమ్రారామ్ నిలిచారని, ఇప్పుడు పార్లమెంట్‌లో రైతుల గొంతుక ప్రతిధ్వనిస్తుందన్నారు. ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే మాట్లాడుతూ రైతుల కోసం పోరాటం చేయడం అమ్రారామ్ నుంచి నేర్చుకున్నానని అన్నారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల వేళ ఎక్కడ చూసినా ఒక్కటే గొంతు వినిపించేదని, మా ఎంపీ అమ్రారామ్ అని, ఆయనే సరైనోడని తెలిపారు. ఏఐకేఎస్ ఆర్థిక కార్యదర్శి పి.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అమ్రారామ్ పార్లమెంట్‌లో అడుగుపెట్టడంతో రైతు ఉద్యమానికి మరింత ఊపు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, తపన్ సేన్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, జేఎన్‌యూఎస్‌యూ మాజీ అధ్యక్షురాలు ఐషీఘోష్, ఢిల్లీ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్ (డీయూటీఏ) మాజీ అధ్యక్షుడు రాజీవ్ కన్వర్, డీఎస్ఎంఎం నేత నత్తు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం అందడంతో నారాయణ్‌పూర్, కొండగావ్, దంతేవాడ, బస్తర్ జిల్లాల సరిహద్దుల్లో ఈ నెల 6 అర్ధరాత్రి సమయంలో భద్రతా సిబ్బంది ప్రత్యేక బృందాలతో ఈ ఆపరేషన్ చేసినట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌లాల్ తెలిపారు. ఇరు వర్గాల మధ్య అడపాదడపా జరిగిన క్రాస్ ఫైరింగ్‌లో ఆరుగురు మావోయిస్టులు మరణించారు. ఈ ప్రాంతంలో రక్తపు మరకలు ఉన్నాయని, మరో మావోయిస్టు గాయపడ్డాడో, మరణించాడో తెలియాల్సి ఉందన్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి చెందిన ఈ ఆరుగురిలో నలుగురిపై రూ.8 లక్షలు, ఒకరిపై రూ.5 లక్షలు, మరొకరిపై రూ.లక్ష రివార్డులు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఆ ప్రాంతాల్లో 71 ఎన్‌కౌంటర్లలో 123 మంది మావోయిస్టులు చనిపోయారు. 136 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 339 మంది లొంగిపోయారు.

నెలరోజులు... వరుస సమీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా ఆదివారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన మధిరలో సమీక్ష సమావేశం కూడా నిర్వహించారు. ఈనెల 12, 13 తేదీల్లో ఖమ్మం జిల్లాలో సమీక్షా సమావేశాలు జరపాలని నిర్ణయించారు. దీనికి కూడా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరవుతారని ఆయన కార్యాలయం ఆదివారం తెలిపింది. ఎలక్షన్ కోడ్ ముగియడంతో రేవంత్ సర్కార్ పాలనపై దృష్టి కేంద్రీకరించింది. రాష్ట్ర స్థాయిలో అన్ని శాఖల పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిస్థాయి సమీక్షలు చేయనున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ఏండ్ల తరబడి ఒకే పోస్టులో పాతుకుపోయిన అధికారుల బదిలీల ప్రక్రియను తొలి దశలో చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ మేరకు వచ్చే వారంలో అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ భారీగా బదిలీలు జరుగుతాయనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అధికారుల పనితీరుపై ప్రతి నెలా నివేదికలు, సమీక్షలు చేయాలని కూడా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈనెల 9న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ కార్యాచరణ ప్రారంభమైంది. ఈనెలాఖరు నాటికి ఈ ప్రక్రియ ముగియనుంది. మరోవైపు ఆరు గ్యారెంటీల అమలుపై ప్రధానంగా దృష్టి పెట్టి, దానికి అవసరమైన ఆర్థికాభివృద్ధిని రాబట్టుకోవాలని భావిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లుల మంజూరును అమల్లోకి తెచ్చారు. స్వయం సహాయక బృందాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమం- అభివృద్ధి జోడెడ్ల బండి తరహాలో పాలనను ముందుకు తీసుకెళ్లాలని సీఎం, డిప్యూటీ సీఎం భావిస్తున్నారని ఆయా కార్యాలయాలు తెలిపాయి.

12 ,13న ఖమ్మంలో సమీక్ష

నీళ్లు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన గత పాలకులు ఖమ్మం జిల్లాలో ఇందిరా, రాజు సాగర్ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేశారనీ, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని డిప్యూటీ సీఎం కార్యాలయం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈనెల 12న సీతారామ సాగునీటి ప్రాజెక్టు, వైరా రిజర్వాయర్‌కు సాగర్ కాల్వ అనుసంధానం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సాగునీటి సరఫరా అంశాలను సమీక్షించనున్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా వైరా రిజర్వాయర్‌కు సాగునీటిని మళ్లించేందుకు ఎన్నికల కోడ్‌కు ముందే రూ.75 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు డిప్యూటీ సీఎం కార్యాలయం తెలిపింది. 13న జరిగే సమీక్షలో సాగునీటి ప్రాజెక్టు పనులు, వాటి ప్రగతిని తెలుసుకుంటారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా ఆయా ప్రాజెక్టుల వద్దకు క్షేత్రస్థాయి పర్యటన చేపడతారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలో దుమ్ముగూడెం నుంచి జూలూరుపాడు వరకు జరుగుతున్న పనులు, ఏనుకూరు నుంచి వైరా రిజర్వాయర్‌కు నాగార్జునసాగర్ ఎడమ కాలువను లింక్ చేయడం వంటి పనులను వారు పరిశీలిస్తారు. అలాగే మన ఊరు- మనబడి, వివిధ సంక్షేమ పథకాల అమలును సైతం పరిశీలిస్తారు.

ఇక సెలవ్...

(మొదటిపేజీ తరువాయి)

చేయించుకున్న స్మృతి కట్టడం వద్దే కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. రామోజీరావు చితికి ఆయన కుమారుడు, ఈనాడు ఎండీ సీహెచ్ కిరణ్ నిప్పంటించారు. సినీ, రాజకీయ ప్రముఖులు, బంధువులు, సన్నిహితులు, రామోజీ గ్రూపు సంస్థల సిబ్బంది, అభిమానుల 'జోహార్ రామోజీరావు' నినాదాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి.

ఫిల్మ్‌సిటీలోని నివాసం నుంచి ఉదయం 11 గంటల ప్రాంతంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పోలీస్ బ్యాండ్ నడుమ రామోజీ అంతిమయాత్ర ప్రారంభమయింది. అక్కడ నుంచి రామోజీ గ్రూప్ సంస్థల కార్యాలయాల మీదుగా స్మారకకట్టడానికి చేరుకుంది. అభిమానుల నినాదాలతో ఫిల్మ్‌సిటీ మార్మోగింది. అంతిమయాత్ర స్మృతి కట్టడం వద్దకు చేరుకున్న తర్వాత ఆయన భౌతికకాయాన్ని కుటుంట సభ్యులు వాహనం నుంచి కిందకు దింపారు. కుటుంబ సంప్రదాయ క్రతువులు నిర్వహించిన అనంతరం చంద్రబాబు నాయుడు, లోకేశ్, తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, పలువురు సినీ ప్రముఖులు రామోజీకి కడసారిగా నివాళులర్పించారు. చంద్రబాబు నాయుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంత్యక్రియల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, ప్రముఖ వైద్యులు గురవారెడ్డి, శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు పోచారం శ్రీనివాసరెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, మోత్కుపల్లి నర్సింహులు, నామా నాగేశ్వరరావు సినీ, రాజకీయప్రముఖులనేకులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోళ్లలో రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. అందుకే ఈదురు గాలులు, అకాల వర్షాలకు కూడా రైతులు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు వెనుకాడలేదు. ధాన్యం సేకరణలో జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట, సిరిసిల్ల, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, నిర్మల్, మంచిర్యాల, జనగామ జిల్లాలు ముందంజలో ఉన్నాయి.

కొలువుదీరిన క్యాబినెట్

(మొదటిపేజీ తరువాయి)




ఐదుగురు స్వతంత్ర హోదా కలిగిన సహాయ మంత్రులు. మిగిలిన 36 మంది సహాయ మంత్రులు.

వీరంతా ఔట్

గతంలో మోడీ క్యాబినెట్‌లో పనిచేసిన నారాయణ్ రాణే, అర్జున్ ముండా, అనురాగ్ ఠాకూర్, పురుషోత్తం రూపాలా, స్మృతి ఇరానీ, ఆర్కే సింగ్, మహేంద్ర నాథ్ పాండే, అశ్విని కుమార్ చౌబే, వీకే సింగ్, సాధ్వి నిరంజన్ జ్యోతి, సంజీవ్ బలియన్ రాజీవ్ చంద్రశేఖర్, దర్శన్ జర్దోష్, వి.మురళీ ధరన్, మీనాక్షి లేఖిలకు ప్రస్తుత క్యాబినెట్‌లో చోటు దక్కలేదు. వీరిలో కొందరు ఎన్నికల్లో ఓటమి పాలవగా మరికొందరు గెలుపొందినా మంత్రి పదవులు లభించలేదు.

హాజరైన ప్రముఖులు వీరే

మోడీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి పలువురు విదేశీ నేతలు హాజరయ్యారు. శ్రీలంక అధ్యక్షులు రణిల్ విక్రమసింఘే, మాల్దీవుల అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ మొయిజు, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జగ్‌నాథ్, నేపాల్ ప్రధాని పుష్ప కుమార్ దహాల్ ప్రచండ, భూటాన్ ప్రధాని షెరింగ్ తాగ్బే తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధిపతి పవన్ కల్యాణ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రజలే బలం.. బలగం

- ప్రతిక్షణం ప్రజాసేవకే అంకితం..
- నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు
- మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ
- జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం..



నవతెలంగాణ - తిమ్మాపూర్

ఓటమైనా.. గెలుపైనా ప్రజల మధ్యనే ఆయన ఉంటారు.. ప్రజలే తన బలం, బలగం అని చాటుతూ నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నారు. 24 గంటలు ప్రజాభవన్ (మానకొండూరు నియోజకవర్గం కార్యాలయం)లో ఉంటూ నిరంతరం ప్రజాసేవకే అంకితం అవుతానని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అంటున్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్దే నా లక్ష్యం, నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ రాష్ట్రంలోనే మానకొండూరు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని చెప్తున్నారు. చెప్పడమే కాదు.. ప్రతి మండల కేంద్రంలో స్టడీ సెంటర్, హెల్త్ సబ్ సెంటర్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టి ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించేందుకు కృషిచేస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారేంటీలన్నింటిని అమలు చేసి తీరుతామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్తున్నారు. సోమవారం ఆయన జన్మదిన సందర్భంగా నవతెలంగాణ ప్రత్యేక కథనం..

రైతు కుటుంబం నుంచి డాక్టర్‌గా


కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మానకొండూరు మండలంలోని వచ్చునూరు గ్రామంలో 1965 జూన్ 10న జన్మించారు. పదోతరగతి, ఇంటర్ ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివారు. 1998లో కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అనంతరం ఎమ్మెస్ జనరల్ మెడిసిన్ పూర్తి చేసి వైద్య వృత్తిలో నియోజకవర్గ ప్రజలకు సుపరిచితులయ్యారు. ఎంతో మందికి వైద్య సేవలు అందించిన ఆయన ప్రజల్లో విశేషంగా గుర్తింపు పొందారు.

రాజకీయ ప్రస్థానం..


తాను పుట్టి పెరిగిన ప్రాంత ప్రజలకు, మానకొండూర్ నియోజకవర్గ ప్రజల బాగోగులు నేరుగా చూసేందుకు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరుపున మొదటిసారి పోటీచేసి ఓడిపోయారు. 2014 టీడీపీ నుంచి పోటీ చేసినా గెలుపొందలేకపోయారు. తరువాత కాంగ్రెస్ పార్టీలోకి చేరిన కవ్వంపల్లికి ఆ పార్టీ జిల్లా బాధ్యతలు చూసుకునే అవకాశం వచ్చింది. ఈ క్రమంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయనకు కార్యకర్తల నుంచి మద్దతు పెరిగింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మానకొండూరు ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందారు. ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం తరుపు వారికి సేవలు అందిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకున్న సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో తనదైన ముద్ర వేస్తూ అంచలంచలుగా ఎదుగుతూ వచ్చారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా అనేక సేవ, సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు ఎంతో చేరువయ్యారు. కాంగ్రెస్ పార్టీలో కిందిస్థాయి నుంచి ఎన్నో పదవులు అధిరోహిస్తూ వచ్చిన కవ్వంపల్లి సత్యనారాయణ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి ఎంతో సన్నిహితుడుగా ఉన్నారు.


























Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.